
'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా,
ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 318

గురువారం 8-2-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



20 లక్షల మందికి ఏఐలో శిక్షణ

ఏఐ నియంత్రణపై సహకారం అత్యవసరమన్న సత్య నాదెళ్ల -13లో



బుమ్రా నంబర్‌వన్...

ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌లో భారత పేసర్ -12లో



17న హాజరుకండి

మద్యం కుంభకోణం కేసులో ఫిబ్రవరి 17న వ్యక్తిగతంగా తమ ఎదుట హాజరుకావాలని కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టు సమన్లు జారీచేసింది.

వివరాలు 6లో ▸



పాక్‌లో జంట పేలుళ్లు

పాకిస్తాన్ జంట పేలుళ్లతో దద్దరిల్లింది. వేర్వేరు చోట్ల జరిగిన బాంబు పేలుడు ఘటనల్లో 25 మంది మరణించారు.

వివరాలు 6లో ▸



చేపల పడవలో దేశాలే దాటారు

కువైట్‌లో యజమాని హింసలు భరించలేక ముగ్గురు భారతీయులు దొంగచాటుగా సముద్ర మార్గంలో ముంబై చేరుకున్నారు.

వివరాలు 6లో ▸



2050 నాటికి...నీటికి కటకటే!

నీటి కొరతతో ఇప్పటికే ప్రపంచం అల్లాడుతోంది. పలు దేశాల్లో ఈ సమస్య ఉగ్రరూపం దాలుస్తోంది.

వివరాలు 6లో ▸

ఈఎన్సీలపై వేటు

నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) సి.మురళీధర్ రాజీనామాకు సర్కారు ఆదేశం

మంత్రి ఉత్తమ్ ఆదేశాల మేరకు బుధవారం రాత్రి ఉత్తర్వులు

- రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు సర్వీస్ నుంచి తొలగింపు
- 'మేడిగడ్డ బ్యారేజీ'పై విజిలెన్స్ ప్రాథమిక నివేదిక ఆధారంగా చర్యలు
- ఇద్దరు అధికారులు కూడా రిటైరైన తర్వాత కొనసాగుతున్న వారే..
- వారి స్థానంలో ఇతర అధికారులకు తాత్కాలికంగా బాధ్యతలు


మురళీధర్


వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సమర్పించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఇద్దరు కీలక అధికారులపై వేటు వేసింది. నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ విభాగానికి అధిపతిగా ఉన్న ఈఎన్సీ (జనరల్) సి.మురళీధర్‌ను రాజీనామా చేయాలని ఆదేశించింది. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి బాధ్యుడిగా గుర్తిస్తూ రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును సర్వీస్ నుంచి తొలగించింది. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు.. ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.



రిటైరైనా కొనసాగుతూ..

2011 ఆగస్టు 1 నుంచి నీటి పారుదల శాఖ ఈఎన్సీగా పనిచేస్తున్న సి.మురళీధర్ వాస్తవానికి 2013లోనే పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ నాటి ఉమ్మడి రాష్ట్ర సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఆయన పదవీకాలాన్ని పొడిగించారు. తెలంగాణ ఏర్పాటయ్యాక బీఆర్‌ఎస్ సర్కారు మురళీధర్‌రావును కొనసాగించింది. తదుపరి ఆదేశాలు జారీచేసే వరకు కూడా ఆయన ఈఎన్సీ పదవిలో కొనసాగుతారంటూ ఆదేశాలు ఇచ్చింది. ఇక రామగుండం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు నాలుగేళ్ల కిందే రిటైరైనా అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు తిరిగి అదే పోస్టులో నియమించింది. ఆయన పదవీకాలం వచ్చే నెలాఖరున ముగియాల్సి ఉంది. కానీ కాంగ్రెస్ సర్కారు ఆయనను ముందే తొలగించింది. తొలగించిన ఇద్దరు ఈఎన్సీల స్థానంలో.. ఇన్‌చార్జి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని నీటిపారుదల శాఖ ఈఎన్సీ (అడ్మిన్) అనిల్‌కుమార్‌ను ఆదేశించింది.

'వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్'తో గందరగోళం!

గత ఏడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలో 7వ బ్లాకు కుంగిపోయింది. సొంత ఖర్చుతో దాని

మిగతా 3వ పేజీలో ▶

విజిలెన్స్ ఏం చెప్పింది?

- మేడిగడ్డ బ్యారేజీ పనులు పూర్తికాకున్నా వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చారు.. బ్యాంకు గ్యారంటీలను కూడా విడుదల చేశారు
- ఇందుకు కారణమైన ఈఎన్సీలపై చర్యలు తీసుకోవాలి..
- కుంగుబాటుకు కారణాలపై నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి
- ఆ బ్లాకును కాంట్రాక్టు సంస్థ కాకుండా సబ్ కాంట్రాక్టర్ నిర్మించారు
- 'మేడిగడ్డ' కుంగుబాటుపై ప్రాథమిక నివేదికలో విజిలెన్స్ సిఫార్సులు
- బిల్లుల చెల్లింపులు, ఖాతాల పరిశీలన ద్వారా వివరాలు సేకరిస్తున్నట్టు వెల్లడి

3లో

సభా సమయం

నేటి నుంచి బడ్జెట్ భేటీ



ఉదయం 11.30కి ఉభయ సభల సంయుక్త సమావేశం

- సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్న గవర్నర్.. 9న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ
- 10న ఓటాన్ అకౌంట్ బడ్జెట్
- సమావేశాలు 6 రోజుల పాటు జరిగే చాన్స్
- 6 గ్యారంటీల అమలు, కులగణన బిల్లు తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం
- ఏర్పాట్లపై మండలి చైర్మన్, స్పీకర్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మూడో శాసనసభ తొలి బడ్జెట్ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11.30కి శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రసంగిస్తారు. ఈ నెల 9న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై

మిగతా 3వ పేజీలో ▶

కొలువులు



సింగరేణి కార్మికుల వారసులకు కారుణ్య నియామక పత్రాలను ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి తదితరులు

15 రోజుల్లో 15 వేల పోలీసు ఉద్యోగాల భర్తీ

- 60 కొత్త ఖాళీల భర్తీకి త్వరలో గ్రూప్–1 నోటిఫికేషన్
- సింగరేణిలో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి: రేవంత్‌రెడ్డి
- 441 మంది కార్మికుల వారసులకు కారుణ్య నియామక పత్రాలను అందజేసిన సీఎం
- గత ప్రభుత్వం సింగరేణిని ఖాయిలా పడేలా చేసిందని ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే పదిహేను రోజుల్లో 15 వేల పోలీసు ఉద్యోగాలను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. గ్రూప్–1లో 60 కొత్త ఖాళీల భర్తీ చేపడతామని తెలిపారు. రాష్ట్రంలోని 30 లక్షల మంది నిరుద్యోగులు పోటీపరీక్షలకు సిద్ధం కావాలని, ఉద్యోగ నియామకాల కోసం ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న అన్ని ప్రయత్నాలు చేస్తామని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో.. 441 మంది సింగరేణి కార్మికుల వారసులకు కారుణ్య నియామక పత్రాలను సీఎం అందజేశారు. అనంతరం మాట్లాడారు. గత ప్రభుత్వంలో సింగరేణి

మిగతా 2వ పేజీలో ▶

హారిజాంటల్ పద్ధతే...



మహిళా రిజర్వేషన్లపై స్పష్టత ఇచ్చిన ప్రభుత్వం

- 33.3 శాతం ఉద్యోగాలు మహిళలకు..
- ప్రత్యేకంగా ఎలాంటి రోస్టర్ పాయింట్ మార్క్ ఉండదని వెల్లడి
- త్వరలో టీఎస్‌పీఎస్సీ, టీఆర్‌ఈఐఆర్‌బీ పరీక్షల ఫలితాలు!

సాక్షి, హైదరాబాద్

ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీకి అడ్డంకులు తొలగిపోయాయి. నియామకాల ప్రక్రియలో మహిళా రిజర్వేషన్ల అంశం కోర్టు పరిధిలో ఉండడంతో కొంతకాలంగా ఉద్యోగాల భర్తీ నిలిచిపోగా.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో లైన్‌క్లియర్ అయింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో మహిళలకు వర్టికల్ స్థానంలో హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో ప్రత్యేకంగా రోస్టర్ పాయింట్ (రిజర్వేషన్ వారీ పాయింట్) మార్క్ చేయకుండా ఓపెన్ కాంపిటీషన్, రిజర్వేషన్ కేటగిరీల్లో మహిళలకు 33 1/3 (33.33) శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్టు తెలిపింది. (మార్క్ చేస్తే ఆ పోస్టును తప్పనిసరిగా మహిళతోనే భర్తీ చేయాలి) రాజస్తాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వర్సెస్ రాజేశ్‌కుమార్ దరియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ నియామకాల ప్రక్రియలో మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్లు

మిగతా 2వ పేజీలో ▶

మరో భారతీయ విద్యార్థి అమెరికాలో దుర్మరణం



ఎన్నో ఆశలతో అమెరికాలో అడుగుపెడుతున్న కొందరు భారతీయ విద్యార్థుల భవిత అర్ధంతరంగా ముగిసిపోతోంది. ఆ విషాదపర్వంలో మరో ఉదంతం తాజాగా చోటుచేసుకుంది. భారతీయ మూలాలున్న విద్యార్థి సమీర్ కామత్ అమెరికా కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం ఇండియానా రాష్ట్రంలో విగతజీవిగా కనిపించారు.

- వివరాలు 6లో ▶

కాంగ్రెస్‌కు కాలం చెల్లింది...

రాజ్యసభలో ప్రధానమంత్రి మోదీ ఉద్ఘాటన

- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కాంగ్రెస్ ఎప్పటికీ వ్యతిరేకమే
- రిజర్వేషన్లను జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకించారు
- ఉత్తరం, దక్షిణం అంటూ దేశాన్ని విభజించడానికి కాంగ్రెస్ కుట్రలు.. వారంటీ తీరిపోయినవారి మాటలను దేశం వినిపించుకోదు
- యువరాజును లిఫ్ట్ చేసే యత్నాలన్నీ విఫలం..
- 'మోదీ 3.0 సర్కారు' ఏర్పాటు దగ్గర్లోనే ఉంది
- వికసిత్ భారత్ పునాదిని పటిష్టం చేస్తాం

6లో



ఏపీ బడ్జెట్

ఏడు రంగుల ఆంధ్రధనుస్సు

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా రూ.2.86 లక్షల కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

- విద్య, వ్యవసాయం, వైద్యం, సాగునీటికి ప్రాధాన్యం
- ద్రవ్య, రెవెన్యూలోటు తగ్గించే చర్యలు
- 4 నెలలకు రూ.88,215 కోట్ల వ్యయానికి అసెంబ్లీకి ప్రతిపాదన


అసెంబ్లీలో బడ్జెట్ ప్రతిని పరిశీలిస్తున్న సీఎం జగన్

10లో

మొత్తం బడ్జెట్ రూ.2,86,389.27 కోట్లు

మూలధన వ్యయం రూ.30,530.18 కోట్లు

రెవెన్యూ వ్యయం రూ.2,30,110.41 కోట్లు

రెవెన్యూ లోటు 24,758.22 కోట్లు

ద్రవ్య లోటు రూ.55,817.50 కోట్లు

ఈ ఏడాది వరకే నాన్ లోకల్ కోటా


రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు నిర్ణయం: ఉన్నత విద్యా మండలి



సాక్షి, హైదరాబాద్: విద్యా సంస్థల్లో స్థానికేతరులకు ఇచ్చే 15 శాతం నాన్–లోకల్ కోటాను ఈ ఒక్క సంవత్సరం మాత్రమే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యా సంస్థలకు అనుమతినిచ్చింది. దీంతో ఈ ఏడాది ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ సహా అన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షల ద్వారా చేపట్టే నియామకాల్లో తెలంగాణేతరులకు 15 శాతం సీట్లు ఇవ్వనున్నారు. దీనిపై ఉమ్మడి ప్రవేశ పరీక్షల కన్వీనర్లకు ఉన్నత విద్యా మండలి ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ నాన్–లోకల్ విద్యార్థులకు రాష్ట్ర విద్యా సంస్థల్లో 15 శాతం కేటాయించేవారు. విభజన జరిగినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పదేళ్లపాటు స్థానికేతర కోటా అమలు చేయాలని రాష్ట్రపతి ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే 2024 మే నాటికి ఈ గడువు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నాన్–లోకల్ కోటా అమలు చేయాలా.. వద్దా అని ఉన్నత విద్యా మండలి సంశయంలో పడింది. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో కోటా అమలుకు రంగం సిద్ధం చేశారు. పోటీ పరీక్షల నోటిఫికేషన్లన్నీ మేనెలకన్నా ముందే విడుదలవుతున్నాయి. కాబట్టి ఈ ఏడాది వరకూ అమలు చేయడం సరైన నిర్ణయమని ప్రభుత్వం భావించింది.

రాష్ట్రంలో స్కిల్ వర్సిటీ

- టాటా, మహీంద్రా కంపెనీల ఆసక్తి.. పెట్టుబడులకు సరళీకృత విధానం
- జూన్‌లో హైదరాబాద్‌లో ఏఐ సమ్మిట్
- టెలిపర్ఫార్మెన్స్ ఇంప్రెసివ్ ఎక్స్‌పీరియన్స్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 165 ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయని, ఆయా విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు నైపుణ్య విశ్వ విద్యాలయం ఏర్పాటుకు ప్రణాళికలు చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలో ఈ వర్సిటీ నైపుణ్య మానవ వనరులను అందిస్తుందని వివరించారు. టాటా, మహీంద్ర కంపెనీలు స్కిల్ వర్సిటీ స్థాపనకు ముందుకు వచ్చాయని చెప్పారు. వర్సిటీ కార్యరూపంలోకి వస్తే రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉంటారని వ్యాఖ్యానించారు. బుధవారం మాదాపూర్‌లోని

మిగతా 2వ పేజీలో ▶


బుధవారం ఢిల్లీలో మెట్రో రైల్లో విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

న్యూస్‌రీల్

డ్రోన్ పైలట్లకు అధునాతన శిక్షణ



రాష్ట్రంలో డ్రోన్ పైలట్లకు అధునాతన శిక్షణ ఇచ్చేందుకు ఇస్రో అనుబంధ 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ)'తో తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

- వివరాలు 2లో ▶

డిప్యుటేషన్లు రద్దు



వైద్య, ఆరోగ్యశాఖలోని అన్ని డిప్యుటేషన్లను రద్దు చేశారు. తక్షణమే రద్దు ఆదేశాలు అమలులోకి వచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. డిప్యుటేషన్లలో ఉన్న డాక్టర్లు, నర్సులు, ఇతర ఉద్యోగులు వెంటనే తమ అసలైన చోట విధుల్లో చేరాలని హుకుం జారీ చేసింది.

- వివరాలు 14లో ▶

రూ.250 కోట్లపైనే..



హెచ్‌ఎండీఏ మాజీ ప్లానింగ్ డైరెక్టర్ శివబాలకృష్ణ ఆస్తులు రూ. 250 కోట్లపైనే ఉంటాయని ఏసీబీ అధికారులు ఓ అంచనాకు వచ్చారు. శివబాలకృష్ణ కస్టడీ బుధవారంతో ముగిసింది. ఆయన ఇంట్లో జరుపుతున్న సోదాలు ముగిసినట్టు ఏసీబీ వెల్లడించింది.

- వివరాలు 2లో ▶

తెలంగాణ కుంభమేళాకు వేళాయె



మేడారం సమ్మక్క–సారలమ్మలకు పూజలతో తెలంగాణ కుంభమేళాకు అంకురార్పణ జరిగింది. ప్రతీ రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమికి ముందుగా వచ్చే బుధవారం రోజునే ఈ మహా ఉత్సవం మొదలవుతుంది.

- వివరాలు 5లో ▶


ఇదండీ సంగతి



.. కండువాలను ఆయనలానే వేస్తారు... నీ కిష్టముంటేనే వేసుకో!:

క్లుప్తంగా...

కాంగ్రెస్ వాస్తవాలు మోదీ బయటపెట్టారు: కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వాస్తవాలను పార్లమెంటులో ప్రధాని మోదీ బయటపెట్టారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. మండల్ కమిషన్‌ను రాజీవ్ గాంధీ అడ్డుకున్నారని, అంబేడ్కర్‌ను కాంగ్రెస్ ఓడించిందని గుర్తుచేశారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల యూపీఏ పాలన, పదేళ్ల ఎన్డీయే పాలనను పోల్చి చూడాలని సూచించారు. పదేళ్ల యూపీఏ పాలనలో అవినీతి, కుంభకోణాలు ఇప్పుడు వెలుగులోకి వచ్చాయన్నారు. బీసీలపై మొసలి కన్నీరు కారుస్తూ.. ఓట్ల కోసం విభజన రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ కథ ముగిసిందని, రాష్ట్రంలో ఇక బీజేపీదే భవిష్యత్ అని లక్ష్మణ్ తెలిపారు.

క్రిమికీటకాలకూ లెక్కలు.. బీసీలకు మాత్రం లేవు

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్ గౌడ్ ఆవేదన



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో చెట్లకు, పుట్టలకు, జంతువులకు, క్రిమి కీటకాలకు కూడా లెక్కలు ఉన్నాయి కానీ.. దేశ జనాభాలో 63 శాతం ఉన్న బీసీలకు మాత్రం లెక్కలు లేవని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని విమర్శించారు. బీసీ డిమాండ్ల సాధనకై బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నరేంద్రగౌడ్ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆళ్ల రామకృష్ణ, ఎస్సీ సెల్ నేషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్, బీసీ మహిళాసంఘం జాతీయ అధ్యక్షురాలు రోజా శ్రీ, మట్ట జయంతి గౌడ్ హాజరయ్యారు. నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ అప్పటి యూపీఏ ప్రభుత్వం 'సోషియో ఎకనామిక్ కాస్ట్‌బేస్డ్ సెన్సెస్' పేరిట జనాభా లెక్కలు చేసినా వాటిని బయటపెట్టలేదని గుర్తుచేశారు. ధర్నాకు మద్దతు తెలిపిన రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం పోరాడతానని చెప్పారు.

బీజేపీతో బీఆర్‌ఎస్ లోపాయికారీ ఒప్పందం

అందుకే కాంగ్రెస్‌లో చేరా: పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్



సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీతో భారత్ రాష్ట్ర సమితి లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుందని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత ఆరోపించారు. దేశంలో మతాల్ని, కులాల్ని ముక్కలు చేస్తున్న బీజేపీకి.. బీఆర్‌ఎస్ సానుకూలంగా ఉండటాన్ని జీర్ణించుకోలేకే కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు. ఆయన బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన బీఆర్‌ఎస్ పార్లమెంటరీ సమావేశంలో బీజేపీతో ఒప్పందంపై చర్చ జరిగిందని పేర్కొన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీఆర్‌ఎస్ నిలబడే స్థానాల్లో బీజేపీ మద్దతు తెలపడం.. బీజేపీ నిలబడే స్థానాల్లో బీఆర్‌ఎస్ మద్దతు తెలిపేందుకు ఆలోచన చేస్తున్నట్లు వెంకటేశ్ వివరించారు.

ప్రభుత్వ విధానాలను ఎండగట్టేలా..

సర్కారుపై ఒత్తిడి తేవాలని బీజేఎల్పీ నిర్ణయం.. రామచంద్రరావుకు సమన్వయ బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బీజేపీ ఎమ్మెల్యేలు నిర్ణయించారు. అధికారంలోకి వచ్చాక వివిధ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించడాన్ని ఎండగట్టాలని భావిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను సభావేదికపై ప్రస్తావించి ప్రభుత్వపరంగా చర్య తీసుకునేలా పట్టుబట్టాలని నిశ్చయించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమల్లో పూర్తిసహకారాన్ని అందించినా గత బీఆర్‌ఎస్ సర్కార్ నిర్లక్ష్య ధోరణిని అవలంబించడం వల్ల రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లిందనే విషయాన్ని సభలో వివరించాలని అనుకుంటున్నారు. గురువారం నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండడంతో ఈ సమావేశాల సమన్వయ బాధ్యతలను బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావుకు అప్పగించారు.

బీఏసీ భేటీకి ఆహ్వానం?

అసెంబ్లీలో లేవనెత్తాల్సిన అంశాలు, పార్టీపరంగా ప్రత్యేకంగా ప్రస్తావించదలుచుకున్న వివిధ వర్గాల ప్రజల సమస్యలు, ఏ సబ్జెక్ట్‌పై ఎవరు మాట్లాడాలి అన్న దానిపై పార్టీ 8 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ రాష్ట్ర పార్టీ కార్యదర్శి డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి సహా ఇతరనాయకులతో కలిసి రామచంద్రరావు చర్చించి నిర్ణయాలు తీసుకుంటున్నారు. కౌన్సిల్‌లో బీఏసీ భేటీకి ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి ఆహ్వానం అందినట్టు తెలిసింది. గురువారం ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ డా.తమిళిసై సౌందరరాజన్ ప్రసంగం పూర్తయ్యాక బీఏసీ భేటీకి శాసనసభాపక్షానికి కూడా ఆహ్వానం అందవచ్చునని భావిస్తున్నారు.

డ్రోన్ పైలట్లకు అధునాతన శిక్షణ

ఇస్రో ఆధ్వర్యంలోని ఎన్‌ఆర్‌ఎస్‌సీతో తెలంగాణ ఏవియేషన్ అకాడమీ ఒప్పందం

సీఎం రేవంత్‌తో ఇస్రో చైర్మన్ సోమనాథ్ భేటీ

- ప్రభుత్వ అధికారులకు కూడా డ్రోన్ల వినియోగంపై శిక్షణ
- ఫార్మాసిటీ ప్రాంతం వైపు డ్రోన్ పోర్టు కోసం 20 ఎకరాల స్థలం
- వరంగల్ ఎయిర్‌పోర్టు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశం



సీఎం రేవంత్‌కు శాటిలైట్ నమూనాను అందిస్తున్న సోమ్‌నాథ్. చిత్రంలో కోమటిరెడ్డి, శాంతి కుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో డ్రోన్ పైలట్లకు అధునాతన శిక్షణ ఇచ్చేందుకు ఇస్రో అనుబంధ 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ)'తో తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ (టీఎస్‌ఏఏ) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్‌ల సమక్షంలో టీఎస్‌ఏఏ సీఈవో ఎస్‌ఎన్ రెడ్డి, ఎన్‌ఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్‌లు దీనిపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్‌ఆర్‌ఎస్‌సీ శాస్త్రవేత్తలు డ్రోన్ పైలటింగ్, డ్రోన్ డేటా మేనేజ్‌మెంట్, డేటా అనాలసిస్, ప్రాసెసింగ్, మ్యాపింగ్‌లపై ఏవియేషన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న డ్రోన్ పైలట్లకు 15 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రభుత్వ అధికారులకు కూడా శిక్షణ: సీఎం

అన్ని రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిందని, పొలాల్లో ఎరువులు, పురుగుమందులు చల్లేందుకు రైతులు డ్రోన్లను వినియోగిస్తున్నారని ఈ భేటీలో అధికారులు వివరించారు. కొన్నిచోట్ల స్వయం సహాయక సంఘాలు డ్రోన్లను ఉపాధి మార్గంగా ఎంచుకున్నాయని తెలిపారు. దీంతో ఉన్నతస్థాయి నుంచి తహసీల్దార్ల వరకు ప్రభుత్వ అధికారులకు కూడా డ్రోన్లపై అవగాహన కలిగేలా శిక్షణను ఇవ్వాలని రేవంత్ సూచించారు. ఇస్రో చైర్మన్ సోమనాథ్ మాట్లాడుతూ.. దేశంలోనే వినూత్నంగా తెలంగాణలో డ్రోన్లపై శిక్షణ కోర్సు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. శాటిలైట్, రిమోట్ సెన్సింగ్, అంతరిక్ష వ్యవహారాల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఎన్‌ఆర్‌ఎస్‌సీ.. డ్రోన్ టెక్నాలజీని సాంకేతికపరంగా మరింత పకడ్బందీగా వినియోగించుకునేందుకు శిక్షణలో భాగస్వామ్యం అవుతోందని వివరించారు. దేశంలో 12సార్లు బెస్ట్ ఏవియేషన్ అవార్డు అందుకున్న తెలంగాణ ఏవియేషన్ అకాడమీ సేవలను కొనియాడారు.

శిక్షణకు స్థలం కేటాయించండి

ప్రస్తుతం ఎయిర్‌పోర్ట్‌లోనే డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇస్తున్నామని, అక్కడ నెలకొన్న రద్దీ దృష్ట్యా హైదరాబాద్ పరిసరాల్లో ప్రత్యేకంగా డ్రోన్ పైలట్ల శిక్షణ కోసం స్థలం కేటాయించాలని ఏవియేషన్ అకాడమీ అధికారులు సీఎం రేవంత్‌ను కోరారు. దీనిపై స్పందించిన సీఎం.. డ్రోన్ పోర్టు ఏర్పాటుకు ఎంత స్థలం అవసరం? ఏమేం నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందనే వివరాలు తెలుసుకున్నారు. పైలట్ల శిక్షణతోపాటు డ్రోన్ తయారీ కంపెనీలు ట్రయల్స్ నిర్వహించుకునేందుకు డ్రోన్ పోర్టు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. డ్రోన్ పోర్టుకు అవసరమైన 20 ఎకరాలను ఫార్మాసిటీ వైపు అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. ఏవియేషన్ నిబంధనల ప్రకారం అభ్యంతరం లేని ప్రాంతంలో ఈ స్థలం కేటాయించాలని సూచించారు.

వరంగల్ ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ

వరంగల్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని.. పాడైన పాత రన్‌వేలను కొత్తగా నిర్మించాలని అధికారులను సీఎం ఆదేశించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు నుంచి వాణిజ్య కార్యకలాపాలను నిర్వహించేందుకు గల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని.. ఏవైనా అడ్డంకులు ఉంటే పరిష్కరించాలని సూచించారు. కొత్తగూడెం, భద్రాచలం పరిసర ప్రాంతంలోనూ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అనువుగా ఉంటుందని, అక్కడున్న అవకాశాలను పరిశీలించి ఎయిర్‌పోర్టు అథారిటీతో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు.

సీఎంతో నెదర్లాండ్స్ రాయబారి భేటీ



సాక్షి, హైదరాబాద్: భారత్‌లో నెదర్లాండ్స్ రాయబారి మెరిసా గెరార్డ్స్ బుధవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఇరుదేశాల సంబంధాలపై మాట్లాడుకున్న ఇద్దరూ తెలంగాణలో అభివృద్ధికి ఉన్న అవకాశాలపై చర్చించారని సీఎంవో వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో వ్యవసాయ రంగాభివృద్ధికి అపార అవకాశాలు, అగ్రికల్చర్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు, మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో నెదర్లాండ్స్ భాగస్వామ్యం తదితర అంశాలు వీరిద్దరి భేటీలో చర్చకు వచ్చాయి. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

విద్యుత్ డైరెక్టర్ల నియామకంలో తకరారు

62 ఏళ్లకు కుదింపుపై బీసీ, ఓసీ ఉద్యోగుల నిరసన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకాల కోసం ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గత ఉత్తర్వులను సవరించి జారీ చేసిన మార్గదర్శకాల మేరకు నియామకాలు చేపడితే కొందరికే ప్రయోజనం కలుగుతుందని తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘాలు వేర్వేరుగా ట్రాన్స్‌కో సీఎండీకి ఫిర్యాదు చేశాయి. ట్రాన్స్‌కోలో ముగ్గురు, జెన్‌కోలో ఐదుగురు, ఎస్పీడీసీఎల్‌లో నలుగురు, ఎన్పీడీసీఎల్‌లో నలుగురు డైరెక్టర్ల నియామకం కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే ఇందులో గతంలో ఉమ్మడి రాష్ట్రంలో 2012లో ఇచ్చిన 18, 45 జీవోల మేరకు భర్తీ చేస్తామని పేర్కొన్నప్పటికీ, వయోపరిమితిని మాత్రం 65 నుండి 62 ఏళ్లుగా పేర్కొన్నారు. 62 ఏళ్ల పరిమితిని అమలు చేస్తే ప్రస్తుతం విద్యుత్ సంస్థల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న కొందరికే ప్రయోజనం చేకూరి, మిగిలిన వారందరికీ అన్యాయం జరుగుతుందని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి వెంకన్నగౌడ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై ఓసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి నజీర్ ఉల్ హక్‌లు ట్రాన్స్‌కో సీఎండీకి మరో ఫిర్యాదు చేశారు. వయోపరిమితిని 62కు కుదించటం సరికాదని, 65 వరకు కొనసాగించటం వల్ల అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయమై ప్రభుత్వం పునరాలోచన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

15 రోజుల్లో 15 వేల పోలీసు ఉద్యోగాల భర్తీ

▶ మొదటి పేజీ తరువాయి

తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, తాము అన్ని రకాలుగా ఆదుకుంటామని చెప్పారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనంగా, అంబేడ్కర్ సాక్షిగా నియామక పత్రాలను అందజేస్తున్నామన్నారు. తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికుల పాత్రను ఎవరూ తగ్గించలేరని, పార్టీలు విఫలమైన సమయంలోనూ కార్మికులు రాష్ట్రం కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు.

సింగరేణి అండగా నిలిచింది

రాష్ట్రంలోని గత ప్రభుత్వం సింగరేణిని ఖాయిలా పడేలా చేసిందని, కేంద్రం కూడా సింగరేణికి అనేక అడ్డంకులు సృష్టించిందని సీఎం ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి ప్రాంతం కాంగ్రెస్‌కు అండగా నిలిచి ప్రజా ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించిందన్నారు. సింగరేణిలో 80శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని ఆదేశించామని చెప్పారు. ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించే అంశంపై చర్చించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. కారుణ్య నియామకాల వయసు సడలింపు అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వివేక్, గడ్డం వినోద్, కోవ లక్ష్మి, ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి, సింగరేణి ఎండీ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖ, టీఎస్ఐఐసీ అధికారులతో ధరణి కమిటీ భేటీ

పూర్తయిన సంప్రదింపులు.. త్వరలో ప్రభుత్వానికి నివేదిక

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ బుధవారం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీ) అధికారులతో భేటీ అయింది. ధరణి పోర్టల్‌లో నమోదై ఉన్న భూములు, టీఎస్ఐఐసీ రికార్డుల ప్రకారం ఉన్న భూములు, ధరణి పోర్టల్ రికార్డులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇచ్చిన రికార్డులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, రేమండ్ పీటర్, నవీన్‌మిత్తల్, మధుసూదన్, సీఎంఆర్వో పీడీ వి.లచ్చిరెడ్డి, రిజిస్ట్రేషన్ల శాఖ, టీఎస్ఐఐసీ అధికారులు పాల్గొన్నారు. ఈ రెండు శాఖల సమావేశాలతో ధరణి పోర్టల్ కమిటీ భాగస్వామ్య పక్ష శాఖలన్నింటితో సంప్రదింపులను పూర్తి చేసింది. అయితే ధరణి పోర్టల్ నిర్వహణలో తీసుకురావాల్సిన మార్పులు, చేపట్టాల్సిన ప్రాథమిక చర్యల గురించి త్వరలోనే ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక ఇవ్వనున్నారు. వాస్తవానికి బుధవారమే నివేదిక ఇవ్వాల్సి ఉన్నప్పటికీ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అందుబాటులో లేనందున ఇవ్వలేదని, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే మధ్యంతర నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలుస్తోంది.

రూ. 250 కోట్లపైనే..

శివబాలకృష్ణ ఆస్తులు 214 ఎకరాల భూములు, 29 ప్లాట్లు, 7 ఫ్లాట్స్, 3 విల్లాలు.. తెలంగాణతో పాటు వైజాగ్‌లోనూ ప్లాట్లు

- మరో ముగ్గురిని అరెస్ట్ చేసే అవకాశం.. అధికారుల పాత్రపై సమగ్ర దర్యాప్తు
- హెచ్‌ఎండీఏలో కీలక ఫైళ్లు స్వాధీనం
- లాకర్లలోనూ భారీగా బంగారం..
- ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్ర వెల్లడి



శివబాలకృష్ణ

సాక్షి, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ మాజీ ప్లానింగ్ డైరెక్టర్ శివబాలకృష్ణ ఆస్తులు రూ. 250 కోట్లపైనే ఉంటాయని ఏసీబీ అధికారులు ఓ అంచనాకు వచ్చారు. శివబాలకృష్ణ కస్టడీ బుధవారంతో ముగిసింది. ఆయన ఇంట్లో కొద్ది రోజులుగా జరుపుతున్న సోదాలు ముగిసినట్టు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్ర వెల్లడించారు. శివబాలకృష్ణ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్టు గుర్తించామని, ఆయన సమీప బంధువులు, స్నేహితులు, సహ ఉద్యోగుల ఇళ్లలో మొత్తంగా 17 ప్రదేశాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారని చెప్పారు.

ఇవీ ఆస్తులు...

శివబాలకృష్ణ ఇంట్లో రూ. 84.60 లక్షల నగదు, 2 కేజీలు బంగారం, 5.5 కేజీల వెండి, 32 లక్షలు విలువ చేసే వాచ్‌లు, 3 విల్లాలు, 7 ఫ్లాట్స్‌తోపాటు కొడకండ్ల, జనగామ, నాగర్‌కర్నూలు, సిద్దిపేట, యాదాద్రి, పాలకుర్తి, జఫర్‌గఢ్ ప్రాంతాల్లో 214 ఎకరాల వ్యవసాయ భూమిని గుర్తించామని సుధీంద్ర చెప్పారు. భూమి ఆయన పేరుతోపాటు కొందరు బినామీల పేరుపై ఉందని, 29 ఓపెన్‌ప్లాట్లు ఉన్నాయని, రంగారెడ్డిజిల్లాలోనే 12, వైజాగ్, విజయవాడ, సంగారెడ్డి ప్రాంతాల్లో కూడా ఖాళీ స్థలాలు రిజిస్టర్ అయ్యాయన్నారు. అన్నింటి విలువ రూ.250 కోట్లుగా ఉంటుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. సోదాలు ఇంకో నాలుగు చోట్ల కొనసాగుతున్నాయని, శివబాలకృష్ణపై కేసు నమోదు చేసి, గురువారం న్యాయస్థానం ముందు హాజరుపరుస్తామన్నారు. 'ఇంకా కొన్ని విషయాలు ఆయన చెప్పలేదు..మా విచారణకు సహకరించలేదు. కస్టడీకి తీసుకుంటే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంటుంది.' అని సుధీంద్ర తెలిపారు.

మిగతా అధికారుల్లో టెన్షన్..


హెచ్‌ఎండీఏలో పనిచేస్తున్న మిగతా అధికారుల్లో టెన్షన్ నెలకొంది. హెచ్‌ఎండీఏ పరిధి ఏడు జిల్లాల్లో విస్తరించి ఉండగా, గతంలో అనుమతులు మంజూరు చేసిన లేఔట్లు, ప్లాట్లకు సంబంధించిన ఫైల్స్ అన్నింటినీ పరిశీలించే యోచనలో ఏసీబీ ఉంది. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో నిర్మిస్తున్న హైరేజ్ అపార్ట్‌మెంట్లకు అనుమతుల్లో హెచ్‌ఎండీఏ అధికారులు భారీగా లంచాలు పొందినట్టు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి రెండు రోజుల ముందు భారీఎత్తున లాండ్ కన్వర్షన్ జరిగిందని, హైరైస్ బిల్డింగ్ జోన్ పరిధిలోకి భూముల మార్పు జరిగిందని భావిస్తున్నారు. ఉస్మాన్‌సాగర్ పరిధిలోనూ భారీగా భూమార్పిడి జరిగిందని సమాచారం. ఆ రెండు రోజుల్లోనే రూ.200 కోట్ల విలువైన భూములు చేతులు మారినట్టు ఏసీబీ ప్రాథమికంగా గుర్తించింది. పూర్తిస్థాయి విచారణ జరిగితే ఇందులోని పెద్ద తలకాయల భాగోతాలు బట్టబయలు అవుతాయని తెలుస్తోంది. కాగా ఉప్పల్‌లో శివబాలకృష్ణ సోదరి ఇంట్లో కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. శివబాలకృష్ణ సోదరి, ఇద్దరు కొడుకులు హెచ్‌ఎండీఏలో ఆయన దగ్గరే పనిచేశారు. వీరంతా బినామీలుగా ఉన్నట్టు గుర్తించారు.

హెచ్‌ఎండీఏలో మూడో రోజు ఏసీబీ సోదాలు

హెచ్‌ఎండీఏలో మూడో రోజు ఏసీబీ సోదాలు కొనసాగాయి. శివబాలకృష్ణపై విచారణలో భాగంగా పలు కీలకమైన ఫైళ్లు ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. బుధవారం ఉదయమే అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారులు రాత్రి వరకు సోదాలు నిర్వహించారు. శివబాలకృష్ణ హయాంలో ఇచ్చిన అనుమతులపైన ప్రధానంగా దృష్టి సారించి మూడురోజుల పాటు ఫైళ్లను పరిశీలించినట్టు తెలిసింది. ముఖ్యంగా కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, తదితర ప్రాంతాల్లో నిర్మించిన భారీ బహుళ అంతస్తుల భవనాలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చినట్టు ఏసీబీ అధికారుల పరిశీలనలో వెల్లడి కావడంతో, ఆ దిశగానే హెచ్‌ఎండీఏలో సోదాలు నిర్వహించారు. శివబాలకృష్ణ రెరాకు బదిలీ అయిన తర్వాత కూడా పలు ఫైళ్లకు పాత తేదీలపైన అనుమతులు ఇవ్వడాన్ని ఏసీబీ సీరియస్‌గా పరిగణిస్తోంది.

తెలంగాణలో 3 గ్రీన్‌ఫీల్డ్ కారిడార్లు

- రూ.38,279 కోట్లతో 1,719 కి.మీ రోడ్ల నిర్మాణానికి ఆమోదం
- రాజ్యసభలో కేంద్ర మంత్రి గడ్కరీ



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా రహదారి ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన భారత్‌మాల పరియోజన-1 కింద గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ మీదుగా మూడు, ఆంధ్రప్రదేశ్ మీదుగా ఐదు గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ల నిర్మాణం జరుగుతోందని చెప్పారు. బీఆర్‌ఎస్ ఎంపీ లింగయ్య యాదవ్ అడిగిన ప్రశ్నకు బుధవారం రాజ్యసభలో కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తెలంగాణలో హైదరాబాద్- విశాఖపట్నం (222 కి.మీ) యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్, షోలాపూర్ - కర్నూల్ - చెన్నై (329 కి.మీ) యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్ నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఇండోర్-హైదరాబాద్ (525 కి.మీ) యాక్సెస్ కంట్రోల్డ్ కారిడార్ నిర్మాణం పాక్షికంగా పూర్తయిందని పేర్కొన్నారు. భారత్‌మాల పరియోజన -1 కింద తెలంగాణలో రూ.38,279 కోట్లతో 1,719 కి.మీ రహదారుల నిర్మాణానికి ఆమోదం తెలిపామన్నారు. ప్రస్తుతం తెలంగాణలో రూ.22,749 కోట్లతో 1,026 కి.మీ. పొడవైన రహదారుల నిర్మాణం జరుగుతోందని గడ్కరీ వివరించారు.

నేటి నుంచి రాజ్యసభ నామినేషన్ల స్వీకరణ

15 వరకు గడువు.. 20 వరకు ఉపసంహరణ

- 27న పోలింగ్, అదేరోజు ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో భాగంగా రాష్ట్రం కోటాలో ఏప్రిల్‌లో ఖాళీ అయ్యే మూడు స్థానాలకు సంబంధించి గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈనెల 8న ప్రారంభమై 15వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈనెల 16న నామినేషన్ల పరిశీలన, 20న ఉపసంహరణ గడువుగా పేర్కొన్నారు. ఎన్నిక అనివార్యమయ్యే పక్షంలో ఈనెల 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటల తర్వాత ఫలితం వెల్లడిస్తారు. రాష్ట్రం కోటాలో రాజ్యసభ నుంచి ఈ ఏడాది ఏప్రిల్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు ఎంపీలు జె.సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర తమ పదవీ కాలం పూర్తి చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఆధారంగా అధికార కాంగ్రెస్ పార్టీకి రెండు, విపక్ష బీఆర్‌ఎస్‌కు ఒక స్థానం చొప్పున దక్కే అవకాశముంది. ఒకవేళ కాంగ్రెస్ మూడో అభ్యర్థిని కూడా బరిలోకి దించితే ఈనెల 27న పోలింగ్ అనివార్యం అవుతుంది. తమకు దక్కే ఒక స్థానంలో బీసీ అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. కాంగ్రెస్‌కు దక్కే రెండు స్థానాల్లో 20 మందికి పైగా ఆశావహులున్నట్లు సమాచారం.

బీసీ బిల్లు పెట్టే వరకు ఉద్యమం ఆగదు

- ఎస్సీ, ఎస్టీ యాక్ట్ తరహాలో బీసీ యాక్ట్ తీసుకురావాలి
- ఢిల్లీలో మీడియాతో ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టే వరకూ ఉద్యమం ఆపేది లేదని వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 30 ఏళ్ల నుంచి బీసీ బిల్లుపై పోరాటాలు చేస్తుంటే, అధికారంలో ఉన్న కేంద్రప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవి, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు భరత్‌కుమార్, బీసీ సంక్షేమసంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ తరహాలో 'బీసీ యాక్ట్'ను తేవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని, పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 52 శాతానికి పెంచాలన్నారు.

హారిజాంటల్ పద్ధతే...

▶ మొదటి పేజీ తరువాయి

అమలు చేస్తున్నట్లు వివరించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ తరఫున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మెమో నంబర్ 4981/సర్వీసెస్.డి/ఏ2/2023ను జారీ చేశారు. ఈ కాపీని ప్రభుత్వ ఉద్యోగ నియామక సంస్థలైన తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ), తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ)లతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలకు పంపింది.

నియామకాలు వేగవంతం

మహిళా రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో ఉద్యోగ నియామకాల ప్రక్రియ వేగవంతం కానుంది. ఇప్పటికే నియామక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో అందడంతో ఆ మేరకు చర్యలు మొదలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ పరిధిలో 20 వేలకు పైగా ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అర్హత పరీక్షలు పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. అదేవిధంగా గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు పరిధిలోనూ 10 వేల ఉద్యోగాల భర్తీకి సంబంధించి అర్హత పరీక్షలు నిర్వహించారు. అయితే మహిళా రిజర్వేషన్ల అంశం తేలక ఫలితాలను టీఆర్ఈఐఆర్‌బీ దాదాపు ఆర్నెల్లుగా వాయిదా వేస్తూ వచ్చింది. ఇప్పుడు స్పష్టత రావడంతో ఫలితాలను వేగంగా వెల్లడించనున్నట్లు సమాచారం. పీజీటీ (పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్), లైబ్రేరియన్ కేటగిరీలతో పాటు జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలకు సంబంధించి నేడో, రేపో 1:2 నిష్పత్తిలో ఫలితాలు వెలువడే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఇప్పటివరకు వర్టికల్ రిజర్వేషన్లు..

ఇప్పటివరకు వర్టికల్ రిజర్వేషన్ల ఆధారంగా ఉద్యోగ నియామకాలు జరుపుతున్నారు. వంద పాయింట్లతో కూడిన రోస్టర్ పట్టిక ఆధారంగా నియామకాలు చేపడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు రిజర్వ్ చేసిన పోస్టులను కేవలం ఆయా వర్గాలతోనే భర్తీ చేస్తున్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన వారు ఓపెన్ కాంపిటీషన్ (ఓసీ)లో మెరిట్ ఆధారంగా ఎంపికవుతారు. ఓపెన్ కాంపిటీషన్‌లోకి అన్ని వర్గాల వారికి మెరిట్ ఆధారంగా అవకాశం ఉంటుంది. అయితే ఓపెన్ కాంపిటీషన్‌తో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల్లో కొన్ని పోస్టులను మార్కింగ్ చేసి వాటిని కేవలం మహిళలతోనే భర్తీ చేస్తున్నారు.

ఇక హారిజాంటల్ రిజర్వేషన్లు..

హారిజాంటల్ విధానంలో.. వంద పాయింట్ల రోస్టర్ పట్టికలో మహిళలకు నిర్దేశించిన పాయింట్లను పరిగణనలోకి తీసుకోరు. అంటే ప్రత్యేకంగా ఎలాంటి మార్కింగ్ చేయరు. కేవలం ఓపెన్ కాంపిటీషన్, రిజర్వ్‌డ్ కేటగిరీల వారీగా అన్ని పోస్టులను భర్తీ చేస్తారు. అయితే మహిళలకు కచ్చితంగా 33 1/3 శాతం ఉద్యోగాలు.. అంటే వంద పోస్టుల్లో 33 1/3 పోస్టులు కేటాయిస్తారు. అదేవిధంగా మెరిట్ ఆధారంగా జనరల్ కేటగిరీల్లోనూ మహిళలు ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుంది.

మెథడాలజీపై సందిగ్ధత

మహిళలకు మెథడాలజీ ఆధారంగా హారిజాంటల్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తాజా మెమోలో ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా హారిజాంటల్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నప్పటికీ సంబంధిత మెథడాలజీని మాత్రం ఉత్తర్వుల్లో పొందుపరచలేదు. దీంతో అధికారవర్గాల్లో కూడా హారిజాంటల్ విధానంపై కొంత స్పష్టత కొరవడింది. అయితే ప్రభుత్వ శాఖలకు మరింత లోతైన వివరణతో కూడిన సమాచారం ప్రభుత్వం నుంచి అందే అవకాశం ఉందని, అప్పుడు స్పష్టత వస్తుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

గురుకుల నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్లు

గురుకుల పరీక్షలు రాసిన అభ్యర్థుల కోసం టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌నోట్ జారీ చేసింది. గురుకుల విద్యా సంస్థల ఉద్యోగ నియామకాల్లో మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్లు (ప్రత్యేకంగా రోస్టర్ పాయింట్‌లో మార్కింగ్ లేకుండా) అమలు చేయనున్నట్లు తెలిపింది. మహిళా రిజర్వేషన్లకు సంబంధించి గతేడాది సెప్టెంబర్ 15న హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో మహిళలకు హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేస్తామని ఈనెల 6వ తేదీన టీఆర్ఈఐఆర్‌బీ హైకోర్టుకు విన్నవించింది. తాజాగా ప్రభుత్వం మెమో జారీ చేయడంతో ఆ మేరకు టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌నోట్ ద్వారా సమాచారం ఇచ్చింది.

రాష్ట్రంలో స్కిల్ వర్సిటీ

▶ మొదటి పేజీ తరువాయి

ఐటీసీ కోహినూర్‌లో జరిగిన టెలిపర్ఫార్మెన్స్ ఇంప్రెసివ్ ఎక్స్‌పీరియన్స్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు తమ ప్రభుత్వం సరళీకృతమైన విధానం ప్రవేశపెడుతుందని పునరుద్ఘాటించారు. పరిశ్రమల స్థాపనకు హైదరాబాద్ అత్యంత అనువైన ప్రాంతమని స్పష్టం చేశారు. పరిశ్రమలు, ఐటీ, మౌలిక వసతులకు ప్రత్యేక పాలసీలను రూపొందిస్తున్నామని ఆయన చెప్పారు. జూన్‌లో హైదరాబాద్‌లో ఏఐ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని, దీనికి ప్రపంచ వ్యాప్తంగా అన్ని ఏఐ కంపెనీలను ఆహ్వానిస్తున్నామని మంత్రి వివరించారు. ఏఐ సాంకేతికతలో హైదరాబాద్‌ను గ్లోబల్ హెడ్ క్వార్టర్స్‌గా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టిసారించామని, టూరిజం అభివృద్ధిని 20 శాతం పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు.

ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఐటీ, ఇండస్ట్రీ గ్రోత్ ఖాయం

1990వ దశకంలో దేశ ప్రధానిగా పీవీ నర్సింహారావు ఉన్నప్పుడే హైదరాబాద్‌లో ఐటీ ఇండస్ట్రీకి అంకురార్పణ చేశారని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ... తాము హైదరాబాద్‌లో ఐటీ, ఇండస్ట్రీ గ్రోత్ కొనసాగిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. టెలిపర్ఫార్మెన్స్ గ్రూప్ ఫౌండర్ డానియల్ జులియన్, సీఈఓ అనీష్ ముక్కర్‌ను ఇండియాకు వచ్చి ఇండస్ట్రీ స్థాపనకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు మంత్రి వివరించారు. గురువారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఐటీ, ఇండస్ట్రీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పాలసీలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

బీజేపీకి బాబూమోహన్ రాజీనామా

- పార్టీని నాశనం చేస్తున్నారంటూ కిషన్‌రెడ్డిపై విమర్శలు
- ఇంకా ఏ పార్టీలోనూ చేరాలని నిర్ణయించుకోలేదని వెల్లడి



పంజగుట్ట: మాజీ మంత్రి, సినీనటుడు బాబూమోహన్ బీజేపీకి, ఆ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం రాజీనామా లేఖను పార్టీ అధినాయకత్వానికి పంపుతానని ఆయన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వెల్లడించారు. పార్టీని ముందుకు తీసుకువెళ్లలేని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మూడు పదవులు ఎందుకో అర్థం కావడం లేదని విమర్శించారు. పార్టీని పరుగులు పెట్టించాల్సిందిపోయి మొత్తం నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఒక సర్పంచ్‌ను కూడా గెలిపించుకోలేని వారు పార్టీలో లీడర్లుగా కొనసాగుతున్నారని బాబూమోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే సమయంలో మొదటి, రెండవ లిస్టు కాదని మూడో లిస్టులో తన పేరును ప్రకటించారని అప్పటికీ తాను పోటీ చెయ్యనని అంటే ఒత్తిడి చేసి పార్లమెంట్ ఎన్నికలకు ఇంకా సమయం ఉంది కదా అప్పుడు వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇస్తానని హామీ ఇచ్చి పోటీ చేయించారని తెలిపారు. కానీ ఇప్పుడు ఢిల్లీకి పంపిన లిస్టులో వరంగల్ నుంచి తన పేరునే పరిగణనలోకి తీసుకోలేదని, ఎవరో ఐపీఎస్ అధికారి, మందకృష్ణ మాదిగ పేర్లు పంపినట్లు సమాచారముందన్నారు. ఇప్పటికి ఇంకా ఏ పార్టీలో చేరే నిర్ణయం తీసుకోలేదని, అవసరమైతే ఇండిపెండెంట్‌గానైనా వరంగల్ నుంచి పోటీ చేస్తానని బాబూమోహన్ తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్ పిటిషన్లపై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: సూర్యాపేట డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. అక్రమాస్తులు, నేరపూరిత బెదిరింపులు, దొంగతనం, దోపిడీ కేసులకు సంబంధించి ఊరట కోరుతూ జానయ్య దాఖలు చేసిన పిటిషన్లు బుధవారం జస్టిస్ హృశికేశ్ రాయ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. నెలలు గడుస్తున్నా తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అయితే, కౌంటర్ దాఖలుకు మరింత గడువు కావాలని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది కోరారు. దీనికి అనుమతించిన ధర్మాసనం విచారణను నాలుగు వారాలపాటు వాయిదా వేసింది. జానయ్యకు రక్షణ కల్పిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులు తదుపరి ఆదేశాల వరకూ కొనసాగుతాయని ధర్మాసనం స్పష్టం చేసింది.

'వర్ధన్నపేట'పై వీగిన అవిశ్వాసం

వర్ధన్నపేట: వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఈ విషయాన్ని వరంగల్ ఆర్డీవో వాసుచంద్ర అధికారికంగా ప్రకటించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీలో 12 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 9 మంది బీఆర్ఎస్, ఇద్దరు కాంగ్రెస్, మరో కౌన్సిలర్ బీజేపీ నుంచి ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన చైర్‌పర్సన్ అరుణ, వైస్‌చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డిలు ఒంటెత్తుపోకడలకు పోతున్నారని ఆరోపిస్తూ ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక బీజేపీ కౌన్సిలర్ జనవరి 11న జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో వాసుచంద్రకు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు. ఈ మేరకు బుధవారం అవిశ్వాస తీర్మాన సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి 2/3 మెజారిటీ సభ్యులు రావలసి ఉంది. కానీ ఆరుగురే హాజరుకావడంతో అవిశ్వాసం వీగిపోయిందని ఆర్డీవో వాసుచంద్ర ప్రకటించారు.

అలవికాని హామీలకు బడ్జెట్ ఎలా తెస్తారు?

ఆరు గ్యారంటీలకు ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలి: రాణీరుద్రమ



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలకు బడ్జెట్ ఎక్కడ నుంచి సమకూరుస్తారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణీరుద్రమ ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఆరు గ్యారంటీల అమలుకు కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ గ్యారంటీల పేరుతో ఇచ్చిన అనేక హామీల అమలుకు ఎంతమంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారు, అందుకు ఎంత ఖర్చవుతుందో చెప్పాలన్నారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, 2024–25 బడ్జెట్‌లో హామీలకోసం ఎన్ని నిధులు కేటాయిస్తున్నారో అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రావడానికి అలవికాని హామీలిచ్చి ప్రజల్ని కాంగ్రెస్ మోసం చేసిందని, మళ్లీ అప్పులు చేసి హామీలు అమలు చేస్తారా, లేక ప్రజలపైన పన్నులు వేస్తారా అని నిలదీశారు. కృష్ణా జలాల పంపిణీని సవాల్ చేస్తూ బడ్జెట్ సెషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పక్కదారి పట్టించాలనుకుంటున్నారని రుద్రమ ఆరోపించారు. బడ్జెట్ సమావేశాల్లో ఆరు గ్యారంటీల అమలుకు కార్యాచరణ ప్రకటించకపోతే బీజేపీ తెలంగాణ ప్రజల పక్షాన నిలిచి ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

విజిలెన్స్ ఏం చెప్పింది?

- మేడిగడ్డ బ్యారేజీ పనులు పూర్తికాకున్నా 'వర్క్ కంప్లీట్ సర్టిఫికెట్' ఇచ్చారు
- బ్యాంకు గ్యారంటీలను కూడా విడుదల చేశారు
- ఇందుకు కారణమైన ఈఎన్సీలపై చర్యలు తీసుకోవాలి
- కుంగుబాటుకు కారణాలపై నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి
- ఆ బ్లాకును కాంట్రాక్టు సంస్థ కాకుండా సబ్ కాంట్రాక్టర్ నిర్మించారు
- మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై ప్రాథమిక నివేదికలో విజిలెన్స్ సిఫార్సులు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ విషయంలో ఈఎన్సీ (ఇంజనీర్ ఇన్ చీఫ్)లు, ఇతర అధికారులు నిబంధనలను ఉల్లంఘించారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తేల్చింది. నిర్మాణ సమయంలో, తర్వాత చూపిన నిర్లక్ష్యం కారణంగానే బ్యారేజీ విఫలమైందని స్పష్టం చేసింది. బ్యారేజీకి సంబంధించిన పనులన్నీ పూర్తికాకున్నా 'వర్క్ కంప్లీట్ సర్టిఫికెట్'ఇచ్చారని.. కాంట్రాక్టర్‌కు బ్యాంక్ గ్యారంటీలను కూడా విడుదల చేశారని తప్పుపట్టింది. మేడిగడ్డ బ్యారేజీలోని 6, 7, 8వ బ్లాకులను కాంట్రాక్టు సంస్థ కాకుండా సబ్ కాంట్రాక్టర్ నిర్మించారని.. బిల్లుల చెల్లింపులు, ఖాతాల పరిశీలన ద్వారా దీనికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నామని పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై విచారణ చేపట్టిన విజిలెన్స్ విభాగం తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక సమర్పించింది. ఆ నివేదికలోని ప్రధాన అంశాలు ఇవీ..

పని పూర్తికాకున్నా బ్యాంక్ గ్యారంటీల విడుదల

బ్యారేజీ డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ 2020 ఫిబ్రవరి 2 నుంచి వర్తిస్తుందంటూ అదే ఏడాది నవంబర్ 11న ఈఎన్సీ లేఖ జారీచేశారు. పనులు పూర్తికాకున్నా బ్యాంకు గ్యారంటీలను నిర్మాణ సంస్థకు విడుదల చేశారు. సదరు ఈఎన్సీపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. ఒప్పందంలోని నిబంధన 50 ప్రకారం కాంట్రాక్టర్ పనులు పూర్తిచేయలేదు. ఏటా వానాకాలం ముగిశాక డ్యామ్ ఆప్రాన్ ఏరియాలో 'సౌండింగ్ అండ్ ప్రొబింగ్' పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నా.. డ్యామ్ పర్యవేక్షకుడు (ఈఎన్సీ రామగుండం) అవి చేపట్టలేదు.

నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి

ప్రాజెక్టు డిజైన్లు, డ్రాయింగ్స్, జియోలాజికల్ ఇన్వెస్టిగేషన్స్, అన్ని కాంక్రీట్ నిర్మాణాల దృఢత్వంపై పరిశీలన అత్యవసరం. బ్యారేజీ వైఫల్యానికి కారణాలు తెలుసుకోవడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలి. నిర్దేశిత పద్ధతిలో బ్యారేజీ నిర్మాణ పనులు జరగలేదు. బ్లాక్–7 పియర్ల కింద ఉన్న పునాది (ర్యాఫ్ట్), ర్యాఫ్ట్ దిగువన భూగర్భంలో ఉండే సీకెంట్ పైల్స్‌ను నిర్దేశిత క్రమపద్ధతిలో నిర్మించలేదని వాటికి సంబంధించిన మెజర్‌మెంట్ బుక్స్, ఇతర రికార్డుల పరిశీలనలో తేలింది. ఉన్నతాధికారుల తనిఖీలు లేకుండానే చాలా ఉల్లంఘనలను ఆమోదిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

నిర్వహణ గాలికి వదిలేశారు

2019 జూన్ 19న బ్యారేజీని నాటి సీఎం ప్రారంభించారు. నాటి నుంచి బ్యారేజీ నిర్వహణ, పర్యవేక్షణను నిర్మాణ సంస్థ, నీటిపారుదల శాఖల్లో ఎవరూ చేపట్టలేదు. నిజానికి తొలుత రూ.1,849.31 కోట్లతో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ బాధ్యతలను నిర్మాణ సంస్థకు అప్పగించారు. తర్వాత ఈఎన్సీ సిఫార్సుల ఆధారంగా.. 2016 మార్చి 3న రూ.2,591 కోట్లకు, 2018 మే19న రూ.3,260 కోట్లకు, 2021 సెప్టెంబర్ 6న రూ.4,613 కోట్లకు అంచనాలను పెంచారు.

ఒప్పందాలు, నిబంధనలను ఉల్లంఘించి..

ఒప్పందంలోని నిబంధనల మేరకు నాణ్యత, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ బ్యారేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయని ధ్రువీకరిస్తూ నిర్మాణ 2019 సెప్టెంబర్ 10న మహదేవపూర్ డివిజన్–1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 'సబ్‌స్టాన్షియల్ కన్‌స్ట్రక్షన్ కంప్లీషన్ సర్టిఫికెట్'ను జారీచేశారు. దానిపై సూపరింటెండింగ్ ఇంజనీర్ కౌంటర్ సంతకం చేశారు. నిర్మాణ సంస్థ విజ్ఞప్తి మేరకు.. 2021 మార్చి 15న పనులు పూర్తయినట్టు ధ్రువీకరిస్తూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్టిఫికెట్ జారీచేశారు. కానీ ఒప్పందం గడువును 2022 మార్చి 31 వరకు పొడగిస్తూ ఈఎన్సీ ఆరోసారి ఉత్తర్వులు జారీచేశారు.

బ్యారేజీ వైఫల్యానికి కారణాలివీ..

- బ్యారేజీ నిర్మాణ సమయంలో షీట్ పైల్స్‌ను పాతి నిర్మించిన కాఫర్ డ్యామ్‌ను నిర్మాణం పూర్తయ్యాక తొలగించాలి. కానీ కాఫర్ డ్యామ్‌ను, షీట్‌పైల్స్‌ను ఐదేళ్లు గడిచినా తొలగించలేదు. దీనితో గోదావరి నది సహజ ప్రవాహంపై ప్రభావం పడింది.
- బ్యారేజీ పునాది (ర్యాఫ్ట్), దాని కింద భూగర్భంలో 'కటాఫ్ వాల్స్' నిర్మాణం సమయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. డ్రాయింగ్స్ ప్రకారం ర్యాఫ్ట్, కటాఫ్ వాల్స్ మధ్య కలయిక (కనెక్షన్)ను చేపట్టలేదని బ్యారేజీకి జరిగిన నష్టాన్ని పరిశీలిస్తే స్పష్టమవుతోంది. ర్యాఫ్ట్ కింద భూగర్భంలో ఎగువన, దిగువన షికెంట్ పైల్స్‌ను వేశారు. ఇందులో సెకండరీ పైల్స్ వేసేప్పుడు.. ప్రైమరీ పైల్స్ దెబ్బతిని పునాదుల కింది నుంచి ఇసుక కొట్టుకుపోయి ఉండవచ్చు. 7వ బ్లాకులోని 16–21 పియర్లకు వచ్చిన పగుళ్లను పరిశీలిస్తే.. పునాదులు ఘోరంగా విఫలమైనట్టు అర్థమవుతోంది.
- బ్యారేజీ నిర్వహణ, పర్యవేక్షణలో తీవ్ర వైఫల్యం కనిపించింది. బ్యారేజీని 2019–20లో ప్రారంభించాక దిగువన కాంక్రీట్ బ్లాకులతో ఏర్పాటు చేసిన అప్రాన్ ఏరియాకు ఎలాంటి తనిఖీలు, నిర్వహణ చేపట్టలేదు. వరదల్లో కాంక్రీట్ బ్లాకులు కొట్టుకుపోవడంతో బ్యారేజీ కింద నుంచి ఇసుక కొట్టుకుపోవడానికి ఆస్కారం ఏర్పడింది. కాంక్రీట్ బ్లాకులను పునరుద్ధరించి మరమ్మతులు చేయాలని 2020–2023 మధ్య నీటిపారుదల శాఖ నాలుగు సార్లు కోరినా నిర్మాణ సంస్థ పట్టించుకోలేదు.
- 7వ బ్లాకులో 11 నుంచి 22 వరకు పియర్లు ఉండగా.. 18, 19, 20 పియర్లకు పగుళ్లు వచ్చాయి. వీటిలో 20వ పియర్ పునాదుల దాకా భారీగా దెబ్బతిన్నది.
- డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం ఏటా బ్యారేజీ నిర్వహణకు సంబంధించిన నివేదికను రూపొందించాలి. కానీ రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ సంస్థ తయారు చేయలేదు. మేడిగడ్డ బ్యారేజీ నిర్వహణ విషయంలో డ్యామ్ సేఫ్టీ యాక్ట్‌ను పూర్తిగా ఉల్లంఘించారు.

ఈఎన్సీలపై వేటు

▶ మొదటి పేజీ తరువాయి

పునరుద్ధరణ పనులు చేపడతామని నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ అప్పట్లో ప్రకటించింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించి.. డిజైన్, నిర్మాణం, నాణ్యత, పర్యవేక్షణ, నిర్వహణ లోపాలతోనే కుంగిందని నివేదిక సమర్పించింది. ఒప్పందం ప్రకారం బ్యారేజీ పనులన్నీ పూర్తి కాలేదని, అంటే డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ పూర్తికాలేదని నీటిపారుదల శాఖ ఈఎన్సీ సి.మురళీధర్ పలుమార్లు పేర్కొన్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే ఎల్‌అండ్‌టీ సంస్థ మాటమార్చింది. బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత తమది కాదని అంటోంది. 2020 జూన్ 29 నాటికి బ్యారేజీ నిర్మాణం పూర్తయిందని.. ఒప్పందం ప్రకారం పనిపూర్తయినట్టు (వర్క్ కంప్లిషన్) ధ్రువీకరిస్తూ 2021 మార్చి 25న ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) లేఖ సైతం ఇచ్చారని ఎల్‌అండ్‌టీ వాదిస్తోంది. నీటిపారుదల శాఖ అందించిన డిజైన్ల ప్రకారమే బ్యారేజీని నిర్మించామని పేర్కొంటోంది. దీంతో బ్యారేజీ పునరుద్ధరణ బాధ్యత ఎవరిదన్న దానిపై గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కారు మేడిగడ్డ కుంగుబాటుపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అంతేగాకుండా బ్యారేజీ వద్దకు మీడియా బృందాన్ని తీసుకెళ్లి చూపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇప్పించారు. రూ.1.27 లక్షల కోట్ల వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని.. కానీ ఇప్పటివరకు కేవలం 98,570 ఎకరాల ఆయకట్టు మాత్రమే అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు.

మేడిగడ్డపై కేసీఆర్ ఎందుకు మాట్లాడట్లేదు

- వాస్తవాలు అసెంబ్లీలో చెబుతాం
- మంత్రులు ఉత్తమ్, తుమ్మల, దామోదర రాజనర్సింహ


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో మంత్రులు తుమ్మల, దామోదర రాజనర్సింహ

కోదాడ: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానభాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోతే ఇప్పటివరకు కేసీఆర్ ఎందుకు నోరు విప్పడం లేదని రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ ప్రశ్నించారు. బుధవారం సూర్యాపేట జిల్లా కోదాడలో వంద పడకల వైద్యశాల శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం చేసిన లక్ష కోట్ల అప్పుకు ఏటా రూ.పది వేల కోట్ల వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీని ద్వారా ఇప్పటి వరకు ఒక్క ఎకరం భూమికి కూడా సాగునీరు అందించిన దాఖలాలు లేవన్నారు. ఒక్క మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని చెప్పారు. కృష్ణానదిలో తెలంగాణకు 500 టీఎంసీల వాటా ఉంటే మాకు 250 టీఎంసీలు చాలు.. ఆంధ్రకు 550 టీఎంసీల నీరు ఇవ్వండి అని ఢిల్లీకి వెళ్లి చెప్పిన కేసీఆర్ ఇప్పుడు కృష్ణా నదిపై ప్రాజెక్టుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి ఏపీలో కంటే పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థపాలన వల్ల ఆంధ్రకు ఎక్కువ మేలు జరిగిందన్నారు. సాగునీటి రంగంలో గత ప్రభుత్వం అవినీతి, అక్రమాలను గురువారం నుంచి జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పాల్గొన్నారు.

20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను లేపుకొస్తాం

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యలు
- ఎవరెన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ ఐదేళ్లు అధికారంలో ఉంటుందని ధీమా



సాక్షి, హైదరాబాద్: 'మేం అధికారంలోకి వచ్చి రెండు నెలలే అయింది. ఆరు నెలలాగండి.. కేసీఆర్ సీఎం అవుతారని హరీశ్‌రావు అంటున్నారు. వాళ్ల ఎమ్మెల్యేలు ఎక్కడ వెళ్లిపోతారోననే భయం కేటీఆర్, హరీశ్‌లకు పట్టుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే కేసీఆర్ కుటుంబం రాజకీయ సందిగ్ధంలో పడిపోయింది. కేసీఆర్ అంటిపెట్టుకున్నా సరే.. 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి లేపుకొస్తాం..'అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ రెండు నెలల పాలనలో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని, బీఆర్ఎస్ వాళ్లు మాత్రమే సంతోషంగా లేరని జగ్గారెడ్డి అన్నారు. పార్టీని కాపాడుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని బీఆర్ఎస్ నేతలంటున్నారని, ఎవరెన్ని కుట్రలు చేసినా తాము ఐదేళ్ల పాటు అధికారంలో ఉండడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కుట్రకు ప్రతికుట్ర ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

12 నుంచి 14 ఎంపీ స్థానాల్లో గెలుస్తాం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచామని జగ్గారెడ్డి తెలిపారు. త్వరలో రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలను అమలు చేస్తామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 12 నుంచి 14 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో వంశీచంద్‌రెడ్డి

ఎన్నికలకు ముందు డ్రామాలు

- కేసీఆర్‌పై మంత్రి జూపల్లి ధ్వజం
- ప్రాజెక్టులు అప్పగిస్తామని ఎప్పుడూ చెప్పలేదని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికలకు ముందు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ డ్రామాలు ఆడుతున్నారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. కృష్ణా నదీ జలాలపై ఆయన ఉద్యమం చేస్తాననడం హాస్యాస్పదమన్నారు. ఉద్యమం చేయాల్సిన సమయంలో మిన్నకుండి ఇప్పుడు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ ఇప్పటికే తెలంగాణను నట్టేట ముంచారని, తాజాగా ప్రజలను మభ్యపెట్టేందుకు కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం కృష్ణా బేసిన్‌లో 811 టీఎంసీ నీటి నిల్వలు ఉన్నప్పటికీ, తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటా దక్కట్లేదని, అయినా కేసీఆర్ ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ముడుపుల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టి లక్ష కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెపుతామని తామేనాడూ చెప్పలేదని, ఆ ప్రసక్తే లేదని జూపల్లి అన్నారు.

ఓర్వలేకే ఆరోపణలు: వంశీచంద్ రెడ్డి

ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం అన్నివిధాలుగా దోచుకుందని ఆరోపించారు. పైగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సుపరిపాలన నడుస్తుంటే ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెపుతారని అన్నారు.

రానున్న కాలం బీఆర్ఎస్‌దే

- కాంగ్రెస్ నేతల్లో వ్యంగ్యం తప్ప వ్యవహారం లేదు
- ఐదారు నెలల్లోనే ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లేస్తారు
- సీఎం రేవంత్‌రెడ్డి సంస్కారహీనంగా మాట్లాడుతున్నారు
- మాజీ మంత్రి హరీశ్‌రావు


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

జనగామ రూరల్: 'రానున్న కాలం బీఆర్ఎస్‌దే. వచ్చే ఐదారు నెలల్లోనే బీఆర్ఎస్ నాయకులు ఎక్కడ పోటీచేసినా ప్రజలు గుర్తించి ఓట్లు వేస్తారు. కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి సంస్కారహీనంగా మాట్లాడుతున్నాడు. బట్టేబాజ్ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చారే తప్ప కష్టపడలేదు. కాంగ్రెస్ మోసాలపై గ్రామాల్లో చర్చ పెట్టాలి'అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. బుధవారం జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని మాయ మాటలు చెప్పారని, ఏ ఒక్కటీ అమలు కాలేదన్నారు. పాలనాపరంగా అవగాహన లేక కాంగ్రెస్ నేతలు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని, జూటా మాటలతో కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. వీరిలో వ్యంగం తప్ప వ్యవహారం లేదని హరీశ్ ఎద్దేవా చేశారు. యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని మొదటి డిక్లరేషన్‌గా చెప్పిన ముఖ్యమంత్రి నేడు మాట మార్చారని ఆరోపించారు. సోనియా గాంధీ పుట్టిన రోజున 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నేడు ఆ ఊసే లేదన్నారు. పంట కొనుగోలులో అదనంగా రూ.500 బోనస్ ఇస్తామని ఇవ్వలేదని ఆరోపించారు. కాళేశ్వరం మీద అసత్య ప్రచారాలు చేస్తున్నారనీ, ఏదైనా అవసరం ఉంటే సరిచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలే తప్ప రాజకీయం ఎందుకని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, బీఆర్ఎస్‌కు ఇది కేవలం స్పీడ్ బ్రేకర్ మాత్రమే అని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. సమావేశంలో మాజీ మంత్రి దయాకర్‌రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరేడ్ గ్రౌండ్ బుక్ చేస్తా.. తిట్టుకోండి

- ఆరు గ్యారంటీలపై రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వాలి
- సీఎం పదవిపై బీఆర్ఎస్ వాళ్లు హద్దు మీరి మాట్లాడారు: బండి సంజయ్


రంగాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

హుజూరాబాద్: 'ఒకరేమో అసెంబ్లీలో మీ సంగతి తేలుస్తానంటారు. ఇంకొకరు నన్ను టచ్ కూడా చేయలేవంటారు. అసెంబ్లీ నిర్వహించుకునేది ఒకరినొకరు తిట్టుకోవడానికా? ప్రజా సమస్యలు పరిష్కరించడానికా? మీరు తిట్టుకోవాలనుకుంటే హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ నేనే బుక్ చేస్తా. తిట్టుకుంటారో, కొట్టుకుంటారో అక్కడే తేల్చుకోండి. అసెంబ్లీని మాత్రం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడానికి వేదికగా మార్చండి'అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. 'గావ్ చలో అభియాన్'కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రంగాపూర్‌లో మంగళవారం రాత్రి బస చేసిన ఆయన బుధవారం ఉదయం గ్రామంలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేసిన అభివృద్ధి పనులు పరిశీలించి, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సర్కారు వద్ద పైసల్లేవని, అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సాక్షాత్తూ ముఖ్యమంత్రే చెప్పారని, మరి ప్రజలకిచ్చిన ఆరుగ్యారంటీల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రేషన్‌కార్డు ప్రాతిపదికన రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ హామీలు అమలు చేయాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో పదేళ్లుగా అర్హులైన 10 లక్షల కుటుంబాలు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నాయని, వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. వారంరోజుల్లో అందరికీ రేషన్‌కార్డులు మంజూరుచేసేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొందరు బీఆర్ఎస్ నేతలు హద్దుమీరి మాట్లాడుతున్నారని, ముఖ్యమంత్రి పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

నేటి నుంచి బడ్జెట్ భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

చర్చ, ఆమోదం ఉంటాయి. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 10వ తేదీన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. కాగా బడ్జెట్‌లోని అంశాలపై 12 నుంచి చర్చ జరగనుంది. ఆరు రోజుల పాటు బడ్జెట్‌పై చర్చ జరుగుతుందని భావిస్తుండగా, గురువారం స్పీకర్ అధ్యక్షతన జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశంలో సమావేశ తేదీలు, ఎజెండా ఖరారు అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే బీఏసీ ఇంకా ఏర్పాటు కాకపోవడంతో విపక్ష పార్టీల నేతలతో సంప్రదించి సభ నిర్వహణ తీరుతెన్నులపై స్పీకర్ నిర్ణయం తీసుకోనున్నారు.

సకాలంలో సమాధానాలు ఇవ్వండి

శాసనసభ, శాసనమండలి సమావేశాలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఉభయ సభల్లో సభ్యులు అడిగే ప్రశ్నలకు సకాలంలో సమాధానాలు ఇవ్వడంతో పాటు సమావేశాలు సజావుగా నడిచేందుకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని సూచించారు. అధికారులు తగిన సమాచారంతో సిద్ధంగా ఉండాలని అన్నారు. పాత అసెంబ్లీ భవనంలోకి శాసనమండలిని తరలించే పనులు త్వరగా పూర్తి చేయాలని గుత్తా చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు భద్రత, లాబీల్లోకి సందర్శకులు గుంపులుగా రావడం, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రొటోకాల్ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడటం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. సమావేశాలు జరిగే సమయంలో మంత్రులు అందుబాటులో ఉండాలని మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ కోరారు.



ప్రొటోకాల్‌లో తప్పిదాలు జరగొద్దు: శ్రీధర్‌బాబు

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అన్ని విభాగాలను సమన్వయం చేసేందుకు, త్వరితగతిన సమాధానాలు వచ్చేలా చూసేందుకు సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని సీఎస్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశించారు. ప్రస్తుత సమావేశాల్లో మంత్రులకు సబ్జెక్టుల వారీగా బాధ్యతలు ఇస్తున్నామని, సభ్యుల ప్రశ్నలకు వీలైనంత త్వరగా సమాధానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రొటోకాల్ విషయంలో తప్పిదాలు జరగవద్దని అన్నారు. ప్రొటోకాల్ విషయంలో గతంలో తాను కూడా బాధితుడినని గుర్తు చేశారు.

త్వరలో ఓరియెంటేషన్ కార్యక్రమం

మండలిని అసెంబ్లీ ప్రాంగణంలోకి త్వరితగతిన తరలించేందుకు చర్యలు తీసుకుంటామని శ్రీధర్‌బాబు చెప్పారు. తొలిసారిగా శాసనసభ, శాసనమండలికి ఎన్నికైన సభ్యుల కోసం రెండురోజుల ఓరియెంటేషన్ కార్యక్రమం త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, బీర్ల ఐలయ్య, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులు, లెజిస్లేచర్ అడ్వైజర్ ప్రసన్నకుమార్‌తో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. కాగా పాత అసెంబ్లీ భవనంలోకి శాసనమండలిని తరలించాలనే నిర్ణయం నేపథ్యంలో బుధవారం మండలి చైర్మన్, స్పీకర్ తదితరులు పాత అసెంబ్లీ భవనంలోని సమావేశ మందిరాన్ని పరిశీలించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల లోపు పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రాజెక్టులపై వాడీవేడిగా..

ఆరు గ్యారంటీల అమలు, కులగణన బిల్లు, ఇటీవలి మంత్రివర్గ భేటీలో తీసుకున్న నిర్ణయాలు వంటి అంశాలు సభల్లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చే అవకాశముంది. ప్రధానంగా కృష్ణా ప్రాజెక్టుల అప్పగింత అంశంపై అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా చర్చలు జరుగుతాయని భావిస్తున్నారు. మరోవైపు గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు, రాష్ట్ర ఆర్థిక రంగం స్థితిగతులు, ఆరు గ్యారంటీల అమలు వంటి అంశాలను గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం పొందుపరిచే అవకాశం ఉంది. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసే అవకాశాలు కూడా ఉన్నాయని తెలుస్తోంది. ఇక బీఏసీ ఏర్పాటుతో పాటు డిప్యూటీ స్పీకర్ ఎన్నిక, అసెంబ్లీ కమిటీల నియామకం లాంటి అంశాలపై ఈ సమావేశాల్లో స్పష్టత రానుంది.

నిర్బంధాలు, సంకెళ్లకు భయపడేదిలేదు

- ఆరునూరైనా బహిరంగ సభ ఏర్పాటు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి


నల్లగొండ శివారులో సభకు స్థల పరిశీలన చేస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, తదితరులు

నల్లగొండ టూటౌన్: తెలంగాణ రైతాంగ హక్కుల సాధన కోసం పేగులు తెగేదాకా కొట్లాడుతామని, పోలీస్ యాక్టులు, నిర్బంధాలు, సంకెళ్లకు తాము భయపడేదిలేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 13న బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభ కోసం బుధవారం స్థల పరిశీలన చేశారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా, పోలీస్ యాక్టులు పెట్టినా బహిరంగ సభ నిర్వహించి తీరుతామని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం పెద్ద, పెద్ద రాక్షసులతోనే కొట్లాడామని, ఈ రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లాంటి వాళ్లు మాకు లెక్క కాదని వ్యాఖ్యానించారు. పోలీసులతో రాజ్యం నడపాలని చూస్తే పతనం తప్పదని, పోలీసులను అడ్డుపెట్టుకొని నాటకాలు ఆడితే ప్రజలు ఉరికించి కొడతారని హెచ్చరించారు. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పిన కాంగ్రెస్ నాయకుల బాగోతం బట్టబయలు చేస్తామన్నారు. కేంద్రం నుంచి ఏదో ఆశించే కాంగ్రెస్ వాళ్లు ప్రాజెక్టులను అప్పగించారని ఆరోపించారు. సాగర్ డ్యాంపై కేంద్ర బలగాలు మోహరించాయని, కాలు కూడా పెట్టనివ్వడం లేదన్నారు. ఇరిగేషన్ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అవగాహన లేదని, విజ్ఞానం లేనోళ్లు కాంగ్రెస్ నాయకులు అని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మతిస్థిమితం లేదని విమర్శించారు.



“మనిషి భయపడవలసింది మృత్యువుకు కాదు. ఎప్పటికీ జీవించడం మొదలుపెట్టనందుకు భయపడాలి.
– మార్కస్ అరేలియస్

సాక్షి
గురువారం, 8 ఫిబ్రవరి 2024

పాక్‌లో ఎన్నికల ప్రహసనం

సైన్యం పడగనీడలో ఎన్నికల తంతుకు పాకిస్తాన్ సిద్ధమైంది. జాతీయ అసెంబ్లీకి గురువారం జరిగే పోలింగ్‌లో గెలిచేదెవరో ఎవరూ నిర్ధారణగా చెప్పలేకపోతున్నారు. అయితే ఎప్పటిలాగే అక్కడ ప్రజాస్వామ్యం ఓటమి పాలవటం ఖాయమన్నది విశ్లేషకుల జోస్యం. 2018లో జరిగిన ఎన్నికల్లో కేవలం తన దయాదాక్షిణ్యాలతో అధికారంలోకొచ్చి తననే ధిక్కరించిన మాజీ క్రికెటర్, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌పై సైన్యం ఆగ్రహంతో వుంది. ఫలితంగా పదవి కోల్పోయి రెండు అవినీతి కేసుల్లో పదేళ్లు, పద్నాలుగేళ్ల చొప్పున శిక్షపడి ఆయన జైలుపాలయ్యారు. చట్టవిరుద్ధంగా పెళ్లాడిన కేసులో మరో ఏడేళ్ల శిక్ష కూడా పడింది. భార్య సైతం ఈ కేసులో జైలుకు పోయారు. ఎలాగైతేనేం సకాలంలోనే ఎన్నికల తంతు మొదలైంది. ఇమ్రాన్ స్థాపించిన పాకిస్తాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ ఏటికి ఎదురీదుతోంది. పీటీఐకి న్యాయస్థానాల పుణ్యమా అని బ్యాట్ గుర్తు గల్లంతుకాగా, పార్టీ అభ్యర్థులంతా ఇండిపెండెంట్లుగా బరిలో వున్నారు. పీటీఐ అభ్యర్థినని చెప్పుకున్నవారిని సైన్యం అరెస్టు చేసింది. వారి ఇళ్లపై దాడులకు తెగబడింది. అభ్యర్థులు నామినేషన్ వేసిన వెంటనే అజ్ఞాతంలోకి పోగా, ప్రచారంలో పాల్గొంటున్న అభ్యర్థుల కుటుంబాలకు సైతం వేధింపులు తప్ప లేదు. కొందరు అభ్యర్థులు పీటీఐతో తెగదెంపులు చేసుకున్నామని ప్రకటించి, బతుకుజీవుడా అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. దేశ రాజధాని ఇస్లామాబాద్‌లో మొన్న జరిగిన పీటీఐ ఎన్నికల ప్రచారసభలో వేదికపై రెండు డజన్లమంది బిక్కుబిక్కుమని కూర్చోగా, ఆ సభకు కనీసం మైక్ పెట్టుకునేందుకు కూడా అనుమతి ఇవ్వలేదనీ, పోస్టర్లు వేయనీయలేదనీ ‘న్యూయార్క్ టైమ్స్’ పత్రిక కథనం. యథాప్రకారం ఇక్కడి అభ్యర్థి కూడా కేసుల్లో చిక్కుకుని పరారీలో వున్నాడు. ఇమ్రాన్ ఖాన్‌ను అందలం ఎక్కించిన 2018 నాటి ఎన్నికల్లో కూడా ఆయన ప్రత్యర్థులను సైన్యం వేధించిందిగానీ, పాక్ 76 ఏళ్ల చరిత్రలో ఇంతటి అణచివేత ఎప్పుడూ లేదని పౌరసమాజ కార్యకర్తలు చెబుతున్నారు. నిరుడు ఏప్రిల్‌లో పదవీభ్రష్టుడయ్యాక ఆయన సైన్యాన్ని తూర్పారపట్టడం మొదలెట్టారు. రాజకీయ నేతలకు సైన్యంపై ఎంతటి ఆగ్రహావేశాలున్నా దాన్ని ‘అధికార వ్యవస్థ’ పదం చాటున నిందించటం అలవాటు. ఇమ్రాన్ ఆ సంప్రదాయానికి స్వస్తిపలికారు. నేరుగా సైన్యాన్నీ, దాని అధినేతలనూ ఉద్దేశిస్తూ దూషించారు. పైగా నిరుడు మే నెలలో ఇమ్రాన్‌కు అనుకూలంగా పీటీఐ నిర్వహించిన ర్యాలీలో హింస చోటుచేసుకుంది. ఊహకందని రీతిలో సైనిక కార్యాలయాల పైనా, సైనిక ఉన్నతాధికారుల నివాసాలపైనా యువజనం దాడులకు పాల్పడ్డారు. ఇవన్నీ సైన్యానికి ఆగ్రహం కలిగించాయి. తమ దయతో అందలం ఎక్కినవాడు తమనే సవాలు చేయటం సైనికాధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు.

రంగంలో వున్న రెండు ప్రధాన పక్షాలు– మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్ (పీఎంఎల్–ఎన్), మాజీ ప్రధాని బేనజీర్ భుట్టో కుమారుడు బిలావల్ భుట్టో ఆధ్వర్యంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) మాత్రం స్వేచ్ఛగా ప్రచారం చేసుకోగలిగాయి. ఈ రెండు పార్టీల మధ్యనే ప్రధాన పోటీవుండటం అనివాయితీ. ఇమ్రాన్ సారథ్యంలోని పీటీఐ నెగ్గిన 2018 ఎన్నికలొక్కటే దీనికి మినహాయింపు. చెప్పాలంటే ఇతరులకన్నా పీపీపీ చాలా ముందుగా ఎన్నికల బరిలోకి దిగింది. విస్తృతంగా ప్రచారం చేసింది. మొదట్నుంచి బలంగా వున్న సింధ్ ప్రాంతంలో ఈసారి ఆ పార్టీ బలహీనపడింది. ప్రచారావకాశాలు బొత్తిగా లేని పీటీఐకి యువత బలమైన శక్తిగా వున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వారు సాగిస్తున్న ప్రచారం రెండు పార్టీలనూ బెంబేలెత్తిస్తున్నది. పాకిస్తాన్‌లో మరీ ముఖ్యంగా... బలూచిస్తాన్, ఖైబర్ ఫక్తుంఖ్వాల్లో భారీయెత్తున హింస చోటుచేసుకున్నదని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటించటాన్నిబట్టి ఈ ఎన్నికల సరళి ఎలావుందో అర్థం చేసుకోవచ్చు. మహిళా అభ్యర్థులకు ఈసారి పెద్దగా చోటు దక్కలేదని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ అంటున్నది. ఈ విషయంలో మీ సంజాయిషీ ఏమిటని పాకిస్తాన్ ఎన్నికల సంఘానికి ఆ సంస్థ తాఖీదులు పంపింది. పాకిస్తాన్ పార్లమెంటులో మహిళా కోటా 22 శాతం వుంది. దీంతోపాటు చట్టప్రకారం ప్రతి పార్టీ మహిళలకు తప్పనిసరిగా 5 శాతం స్థానాలు కేటాయించాలి. అయితే ప్రధాన పార్టీలు మూడూ ఈ విషయంలో మొహం చాటేశాయి.

ఎన్నికలు, గెలుపోటముల సంగతలావుంచితే... రాబోయే ప్రభుత్వానికి చాలా సవాళ్లున్నాయి. నిరుడు మే నెలలో పాకిస్తాన్ దాదాపు దివాలా అంచులకు చేరింది. ఆఖరి నిమిషంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) 300 కోట్ల డాలర్ల రుణం అందించి ఆదుకుంది. ఆ సాయం కూడా వచ్చే నెలాఖరుతో ఆగిపోతుంది. దాన్ని పొడిగించేలా చూసుకోవటం, అందుకు సంస్థ విధించబోయే షరతులకు తలొగ్గటం కొత్త పాలకులకు తప్పనిసరి. అధిక ధరలు, నిరుద్యోగం, పేదరికంతో సతమతమవుతున్న ప్రజానీకంలో ఇది మరింత నిరాశానిస్పృహలను రేకెత్తిస్తుంది. ప్రభుత్వ మద్దతు కోసం ఎదురుచూస్తున్న పారిశ్రామిక రంగానికి కూడా సహకారం అందకపోవచ్చు. మన దేశంతో ఆదినుంచీ పాకిస్తాన్‌ది శత్రుపూరిత వైఖరే. దీనికితోడు దశాబ్దాలుగా పాక్‌లో వుంటున్న వేలాదిమంది అఫ్గాన్ పౌరులను నిరుడు వెనక్కి పంపటంతో తాలిబన్ పాలకులతో తగాదాలు మొదలయ్యాయి. ఇవన్నీ దేశంలో మిలిటెన్సీ మరింత పెరగటానికి దోహదపడతాయి. వీటిని ఒడుపుగా ఎదుర్కొంటూ, సైన్యానికి ఆగ్రహం కలగకుండా చూసుకోవటం కొత్త పాలకులకు జీవన్మరణ సమస్య. ఇన్ని భారాలు మోసేదెవరో తాజా ఎన్నికలు తేల్చబోతున్నాయి.

నిజమైన కళకు నీరాజనాలు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

“ప్రజా నాట్యమండలి ప్రదర్శనలు చూసిన తర్వాత, మా గండపెండేరాలను తీసి ఆ నాట్య మండలి నిర్వాహకుల, కళాకారుల ముందు సమర్పించాలనిపిస్తోంది” అని వ్యాఖ్యానించారు విశ్వనాథ సత్యనారాయణ. నాటక, సాహిత్యాది రంగాలు ఎలా ఉంటే నిజమైన ప్రజాకళలుగా, సృజన శక్తులుగా భాసిస్తాయో ‘ప్రజా నాట్యమండలి’ ప్రదర్శనలు నిరూపించాయి. అయితే తెలుగునాట నాటక రంగానిది మహా వైభవోపేత చరిత్ర. అవి జనజీవితాన్ని ఎల్లెడలా ప్రభావితం చేశాయి. జీవితాన్ని ఎలా జీవించాలో చెప్పాయి. నవజీవన పరిధి విస్తృతం కావాలంటే ‘ప్రశ్న’ అనివార్యం అని చాటాయి. ‘సమాజానికాయువైన నాటకమే శ్వాసగా జీవితాలనర్పించిన సూత్రధారులెందరో! మధురస్వర ఝరీ గమన హృద్యపద్య రాగంతో మేలుకొలుపు పాడిన గాత్రధారులెందరో!! ఆ మహానుభావులకు వందనం!!!

నాటక, సాహిత్యాది రంగాలకు చెందిన వివిధ రంగాలు ఎలా ఉంటే నిజమైన ప్రజాకళలుగా, సృజన శక్తులుగా భాసిస్తాయో 1930లలో భారత పర్యంతం వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ‘ప్రజా నాట్యమండలి’ ప్రదర్శనలు నిరూపించాయి. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని, ‘ఆంధ్ర ప్రజా నాట్యమండలి’ సారథ్యంలోని ‘మా భూమి’ ఇత్యాది కళారూపాలను ప్రస్తావిస్తూ మహాకవి విశ్వనాథ సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి. ‘‘ప్రజా నాట్యమండలి ప్రదర్శనలు చూసిన తర్వాత మా గండపెండేరాలను తీసి ఆ నాట్య మండలి నిర్వాహకుల, కళాకారుల ముందు సమర్పించాలనిపిస్తోంది. ప్రజాకళలు ఎలా ఉండాలో ‘మా భూమి’, ‘అంతా పెద్దలే’ నాటకాలు నిరూపించా’’యని ప్రశంసల వర్షం కురిపించారు! ఈ కితాబు నాటికీ, నేటికీ మరపురాని సందేశంగా నిలిచిపోయింది. ఆ ఒరవడిలో ముందుకు సాగి, అఖిల భారత స్థాయిలోనే ఒక విశిష్ట స్థానాన్ని పొందిన ‘ఆంధ్ర ప్రజా నాట్యమండలి’ రాష్ట్రీయ విశిష్ట శాఖలలో ఒకటి గుంటూరు జిల్లా ‘ప్రజా నాట్యమండలి’. భారత ప్రజా నాట్య మండలికి ఆంధ్ర ప్రజానాట్య మండలి ఎలా ‘ఒజ్జ బంతి’ అయిందో, అలాగే గుంటూరు ప్రజా నాట్యమండలి వివిధ శాఖలతో పరిఢవిల్లింది. మానవ జీవన దర్పణంగా పలువురు ఆంధ్ర పండితుల, కవుల ఆశీస్సులతో ముందుకు సాగుతోంది.

రెండో మాట



సందేశాలు సమకాలీనం

విశ్వనాథ వారు ఎంతటి మహాకవో, అంతటి సరసుడు, ‘గడగ్గాయి’ కూడా! పెళ్లయి, కాపురాలకు వెళ్లబోయే నూతన దంపతులందరికీ కంటికి కనిపించినా, కనిపించకపోయినా ‘అరుంధతీ’ నక్షత్రాన్ని చూపడానికి మన పెద్దలు ప్రయత్నిస్తారు. కానీ విశ్వనాథను ఒకరు మీరెప్పుడైనా ‘అరుంధతీ’ నక్షత్రాన్ని చూశారా అని ప్రశ్నించగా... నాకైతే ‘అరుంధతి కనిపించలేదుగానీ చేసిన ‘అప్పులయితే’ కనిపించి, వేధించాయని చమత్కరించారు.

బహుశా కొన్ని జీవితానుభవాల తర్వాత, ‘చింతామణి’ నాటక కర్తగా సుప్రసిద్ధుడైన మహాకవి కాళ్లకూరి... భార్యాభర్తల మధ్య ఉదాత్తమైన సంసార అవగాహన ఎలా ఉండాలో చెప్పడానికి ఒక పద్యాన్ని రాశారు. సందేశాత్మకంగా ఉండటానికి సరళమైన భాషలో రాసి మనకు అందించారు! ఆరోజుల్లో వేశ్యా లంపటత్వం వల్ల సంసార జీవితాలు ఎలా బుగ్గిపాలవుతున్నాయో చెప్పి, ఆ వినాశం వల్ల సంసార జీవితాల్ని రక్షించడం అవసరమని భావించి కాళ్లకూరి ఆ నాటకం రాశారు! ఫలితంగా గంభీర సంసార జీవితాల అవగాహనకు ఆ పద్యం ద్వారా సమకాలీన సందేశం అందింది. కనుకనే కాళ్లకూరి రచనకు అంత విలువ పెరిగింది.

‘కష్ట ఫలితంబు బహుళ దుఃఖ ప్రదంబు
సార రహితమైన సంసారమందు
భార్యయను స్వర్గమొకటి కల్పనంబు చేసే
పురుషుల నిమిత్తము పురాణ పురుషులుందు!’

ప్రశ్నించే సంస్కారం బుద్ధి జీవుల్లో పెరగనంతవరకూ మనిషికి వికాసం ఉండదని కవి మీగడ రామలింగస్వామి స్పష్టం చేస్తాడు. ఎందుకని? ఆయన మాటల్లోనే నవజీవన పరిధి విస్తృతం కావాలంటే ‘ప్రశ్న’ అనివార్యం అంటారు.

‘ప్రశ్న మానవ విజ్ఞాన పరిధి పెంచు
ప్రశ్న లేనిదే మనిషికి ప్రగతి లేదు
ప్రశ్న యందే సకల దిశా ప్రగతి యుండు
కాన, ప్రశ్నయే వ్యక్తి వికాసమౌను’ అంటారు. అంతేగాదు,

‘ఈర్ష్య’ అనేది ఏ కళకూ, నాటకానికీ పనికి రాదనీ, ఈర్ష్య అనారోగ్యం, హానికరమని స్పష్టం చేశారు!

ఇలా ఎన్నెన్నో దృశ్య మాలికలను ‘దర్పణం’ పేరిట గుంటూరు కళా పరిషత్ 1997–2022 సంవత్సరాల మధ్య కార్యక్రమాలన్నింటిని రసవత్తరమైన రచనా శైలిలో ‘కళ ప్రజలది’ అన్న మకుటం కింద రజతోత్సవ ప్రత్యేక సంచికగా అందించింది. ‘దర్పణం’ సంపాదకులు, సహ సంపాదకులు వల్లూరు శివప్రసాద్, వల్లూరు తాండవకృష్ణ అభినందనీయులు. నాటక రంగంలో ప్రజాకళలకు ప్రాధాన్యం కల్పించడంలో సుప్రసిద్ధులైన నవీన పథకులుగా ఖ్యాతి పొందిన నటశేఖరులు బళ్లారి రాఘవ, గరికపాటి రాజారావు ప్రఖ్యాతులకు ఈ ప్రత్యేక సంపుటిని అంకితమిచ్చారు. గుంటూరు కళాపరిషత్ కార్యక్రమాల ప్రత్యేక దృశ్యమాలిక ఈ సంచికకు ప్రత్యేక కళాకాంతులు అందించింది.

ఎందరో మహానుభావులు

జీవితాంతం ఆధునికులను వెన్నుతట్టి ప్రోత్సహించినవారు... కందుకూరి, తిరుపతి కవులు, చిలకమర్తి, బలిజేపల్లి, పరబ్రహ్మ పరమేశ్వరి, ఒద్దిరాజు సోదరులు, కోదాటి నరసింహం, రామరాజు, గురజాడ, బళ్లారి రాఘవ, వాసిరెడ్డి, సుంకర, ఆత్రేయ, గరికపాటి, ఆత్రేయ ఇత్యాదులు. ఇలా తెలుగు నాటక పరిణామానికి దోహదం చేసినవారి గురించి మేడిచర్ల సత్యనారాయణమూర్తి కవితాత్మకంగా కురిపించిన ప్రశంస ద్వారా దర్పణం సంచిక వైశిష్ట్యం తెలుస్తుంది.

‘సమాజానికాయువైన నాటకమే శ్వాసగా
జీవితాలనర్పించిన సూత్రధారులెందరో,
మధురస్వర ఝరీ గమన హృద్యపద్య రాగంతో
మేలుకొలుపు పాడిన గాత్రధారులెందరో,
నటనకు జీవం పోసి దైవాలుగా పూజలంది
శిలారూపమందిన పాత్రధారులెందరో,
ఎవని కళకు, యువనికలకు ఊపిరినిచ్చెనో
ఈ రంగస్థలి చిత్రకారులెందరో
ఆ మహానుభావులకు వందనం
సాష్టాంగ వందనం!’

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఎందుకో చెప్పాల్సింది!



సహజీవనాల పట్ల నాకేమీ సానుకూలత లేదుగానీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వం తెచ్చిన ఉమ్మడి పౌరస్మృతిలో అలాంటి బంధాల గురించి కొంచెం భిన్నంగా వ్యవహరించాల్సింది. శిక్ష అని బెదిరించే బదులు, లాభమేమిటో చెబితే బాగుండేది. చట్టబద్ధమైన ప్రయోజనాలు కావాలంటే, రిజిస్టర్ చేసుకోవాలి; లేదంటే, అవి ఉండవు; ఎంపిక మీది!

– కార్తీక్ బాలచంద్రన్, వైద్యుడు

కఠిన వాస్తవం



బీజేపీ ఓట్లు 2009 లోని 7.8 కోట్ల నుంచి 2019లో 22.9 కోట్లకు విశేషంగా పెరిగాయి. అదే కాలానికి కాంగ్రెస్ ఓట్లు కేవలం 11.9 నుంచి 11.94 కోట్లు మాత్రమే పెరిగాయి. కొత్త ఓటర్లను ఆకర్షించలేకపోతే గెలిచే అవకాశం లేదు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

అందుకా ఉద్యమం?



ఉత్తర భారతదేశంలో బీజేపీ ఎంత బలంగా ఉంటే, అంత బలంగా దక్షిణ భారత రిపబ్లిక్ గురించిన ఉద్యమం కొనసాగుతుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో రాజీ చర్చలు జరిపే అవకాశం కూడా ఇది దక్షిణ భారత అవినీతి నేతలకు ఇస్తుంది.

– మనూ జోసెఫ్, రచయిత

చిన్న మార్పు



ముంబయి నుంచి సినిమా పరిశ్రమను ఉత్తర ప్రదేశ్‌కు మార్చు తామని భారతీయ జనతా పార్టీ వాగ్దానం చేసింది. అదేమోగానీ వాళ్లు ఉత్తర ప్రదేశ్ శాంతి భద్రతలను మాత్రం ముంబయికి పట్టుకొచ్చారు. ప్లాన్‌లో చిన్న మార్పు అంతే!

– నరుందార్, సెటైరిస్ట్

అప్పుడే?



మాల్దీవుల ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఇబ్బందుల్లో ఉంది; అందుకే కొత్త అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించలేకపోతున్నామని (అధ్యక్షుడు మహమ్మద్) ముయిజ్జు చెబుతున్నారు.

– గీతా మోహన్, జర్నలిస్ట్

రామనామం



గురుగ్రంథ్ సాహిబ్(సిక్కుల పవిత్ర గ్రంథం)లో రామ్ అనే పదం 2,533 సార్లు కనిపిస్తుంది. సిక్కుల్లోని దివ్యత్వాన్ని రామ్ పదం చిత్రిస్తుంది. రామ్ అనే మాట లేకపోతే శ్రీగురుగ్రంథ్ సాహిబ్‌లో పెద్ద ఖాళీ ఏర్పడుతుంది.

– రామ్‌నిక్ సింగ్ మాన్, మిలిటరీ పరిశోధకుడు

ఇన్ బాక్స్

కర్ణాటక సంగీత పితామహుడు

‘దాసశ్రేంద్ర పురందర దాసరాయ’ (దాస భక్తులలో పురందర దాసు శ్రేష్ఠుడు) అని రాజ గురువు వ్యాస తీర్థులతో ప్రశంసలు పొందిన పురందర దాసు ప్రప్రథమ కర్ణాటక సంగీత విద్వాంసుడు. అసలు పేరు ‘శ్రీనివాస నాయక’. ‘పురందర దాసు’ క్రీ.శ. 1484లో కర్ణాటకలో శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా ‘అరగ’లోని ఓ సంపన్న వర్తక కుటుంబంలో జన్మించాడు. సంప్రదాయ విధానంలో కన్నడ, సంస్కృతాలతో పాటు సంగీతమూ అభ్యసించిన పురందర దాసుకు 16 ఏళ్లకే సరస్వతీ బాయితో వివాహమైంది.



పురందర దాసు

కాలక్రమంలో సంపదమీద ఎక్కువ ప్రేమ పెంచుకోవడం వల్ల కలిగే అనర్థం గ్రహించి తన 30వ ఏటనే సంపదనంతా త్యాగం చేసి పరమ భక్తుడై ‘పురందర దాసు’గా మారి ‘కర్ణాటక సంగీత పితామహుడు’ అయ్యాడు. రచయితగా, వాగ్గేయకారుడిగా, పరమభక్తునిగా, హరిదాసునిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

విజయనగర సామ్రాజ్యంలో శ్రీకృష్ణదేవ రాయలకు రాజ గురువైన వ్యాస తీర్థుల నుండి హరి దాస దీక్ష చేసి ‘పురందర విఠల’ కలం పేరుతో తన కీర్తనలన్నీ విష్ణుమూర్తికి అంకితం ఇస్తూ ‘పురందర విఠలా’ అనే పదం (మకుటం) తోనే ప్రతి పాటను ముగించేవాడు. తిరుపతి, శ్రీరంగం, బేలూరు, ఉడిపి, పండరీపురం లాంటి అనేక ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తూ ఆ యా దేవుళ్లపై వేలాది సంకీర్తనలను రచించాడు. అయితే సుమారు వెయ్యి సంకీర్తనలు మాత్రమే ప్రస్తుతం మనకు లభ్యమవుతున్నాయి. ‘వేంకటాచల నిలయం వైకుంఠపురవాసం పంకజనేత్రం పరమపవిత్రం’ అంటూ భక్తిపారవశ్యంతో తిరుమల శ్రీ వేంకటేశ్వరుణ్ణి కీర్తిస్తూ పురందరదాసు రాసిన సంకీర్తన ఎంత ప్రాచుర్యం పొందిందో మనకు తెలిసిందే.

పురందర దాసు కోసం శ్రీకృష్ణదేవరాయలు ఓ జపశాలను నిర్మించారు. అది ‘హంపి’లో ‘పురందర మండపం’గా వాసికెక్కింది. 1564లో పురందర దాసు కాలధర్మం చెందాడు. ప్రతి ఏడాది పురందర దాసుని పుణ్యతిథి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో ఆయన ఆరాధన ఘనంగా జరుపుతారు. ఈ ఏడాది ఫిబ్రవరి 9న ఆయన పుణ్యతిథిని పురస్కరించుకుని ఫిబ్రవరి 8 నుండి 10వ తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో ‘టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు’ ఆధ్వర్యంలో పురందరదాసుల వారి ఆరాధన ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నారు.

– డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ , విశాఖపట్నం
(ఫిబ్రవరి 9వ తేదీన ‘పురందరదాసు’ వార్షిక ఆరాధన)

గోండు సంస్కృతికి ప్రతీక నాగోబా జాతర

సందర్భం



సుమనస్పతి

పుష్య మాసం (జనవరి–ఫిబ్రవరి) వచ్చిందంటే ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ నాగోబా జాతర వార్తల్లో కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో మేడారం సమ్మక్క సారక్క జాతర తర్వాత ఆదివాసీలు జరుపుకునే అతిపెద్ద జాతర ఇది. అందమైన జాతర కూడా.

పుష్య మాసం ఆదిలాబాద్ జిల్లాలో రాజ్ గోండులతో సహా ఆదివాసీలందరికీ పెద్ద పండుగ సమయం. రాజ్ గోండుల్లో వేరు వేరు ఇంటి పేర్ల వారు తమ గోత్రపు ‘పెర్సపేన్’ లేక ఆది దేవుళ్లను గుర్తు చేసుకుంటూ తమ కృతజ్ఞతలను తెలుపుకుంటూ ఆయా క్షేత్రాలకు వెళ్లి చేసే పలు జాతర్లలో కేస్లాపూర్ నాగోబా జాతర ఒకటి. నిజానికి కేస్లాపూర్ ‘మేస్రం’ అనే ఇంటి పేరు ఉన్న రాజ్ గోండుల ఆది దేవుని క్షేత్రం. కానీ ‘మేస్రం’ ఇంటి పేరు ఉన్న ‘ఏడు దేవతల’ గోత్రపు రాజ్ గోండులు ఎక్కువ సంఖ్యలో ఉండడం (దాదాపు 2500 కుటుంబాలు) వల్ల, వాళ్లతో పెళ్లి సంబంధాలు ఉన్న ఇతర గోండులు కూడా తప్పనిసరిగా జాతరలో పాల్గొనవలసి ఉన్న కారణంగా నాగోబా జాతర కాలక్రమంలో గోండులందరి జాతరగా, ఇతర ఆదివాసీలు, ఆదివాసేతరులు కూడా ఈ సమయంలో దర్శించే క్షేత్రంగా రూపుదిద్దుకుంది.

తెల్లని సంప్రదాయ దుస్తులు ధరించిన కొందరు మేస్రం వంశీయులు నాగోబా ఆలయం నుండి పవిత్ర కలశాన్ని తీసుకుని వెళ్లి గోదావరి నది నుండి నీళ్ల నింపుకొని ఆ కలశాన్ని కాలియాత్రన ఒకే వరుసలో నడుస్తూ తీసుకువచ్చే దృశ్యం ఒక దృశ్య కావ్యంలా సాగుతుంది. జాతర మొదలయ్యే సమయానికి తమ తమ గ్రామాల నుండి గుంపులుగా గూడు ఎడ్లబండ్ల మీద, ఇప్పుడు మోటార్ వాహనాల మీద కూడా, మేస్రం కుటుంబాల వారు అక్కడక్కడ విడిది చేస్తూ వెళ్లే దృశ్యాలు ఆదిలాబాద్ జిల్లా అంతటా ఈ మాసంలో దర్శనమిస్తుంటాయి. నాగోబా పూజా సామగ్రిని ఆయా కుటుంబాల స్త్రీలు తలమీద గంపల్లో పెట్టుకుని తప్పనిసరిగా కాలినడకనే ఈ గుంపుల వెంబడి వస్తారు. ఇలా రెండు రకాలుగా సాగుతుంది ఈ జాతర యాత్ర.

29 ఎకరాల ప్రాంగణంలో విస్తరించి ఉన్న కేస్లాపూర్ నాగోబా (నాగదేవత) క్షేత్రంలో ఊడలు కట్టిన పురాతనమైన మర్రి మానుల వద్దకు పవిత్ర కలశం ముందు చేరుకుంటుంది. ఆ తరువాత, అక్కడి నుండి నాగోబా ఆలయానికి బయలుదేరి వెళ్తుంది. ఐదు రోజులపాటు చూడ చక్కనైన ఆచార కర్మలు, పూజా కార్యక్రమాలతో మేస్రం వంశీయులు జరుపుకునే సంబరంలో లెక్క లేనన్ని విశేషాలు కనిపిస్తాయి.



మేస్రం వంశపు తొలివాడైన ‘పడియోర్’ తమ వంశపు ఆరాధ్య దేవతగా నాగోబాను కనుగొని, తమ నివాస ప్రాంతంలోని కేస్లాపూర్ గ్రామం దగ్గర శాశ్వత విగ్రహ దేవతగా ఉండేలా ఎలా చేశాడో పెద్ద పురాణంగా జాతర సమయంలో మేస్రం పర్ధాన్ గాయకులు గానం చేసి వినిపిస్తారు. ఇది ఇక్కడ కనిపించే ఒక విశేషం.

జాతర వైభవం అలా ఉండగా, గత ఆరేండ్లలో కేస్లాపూర్‌లో వచ్చిన పెద్ద మార్పు అక్కడ ఓ అద్భుత దేవాలయ నిర్మాణం రూపుదిద్దుకోవడం. పేద రైతుల నుండీ ఉద్యోగస్తుల దాకా, మేస్రం వంశీయులందరూ ఐదు సంవత్సరాల పాటు చందాలు వేసుకుని కూడగట్టిన నాలుగున్నర కోట్ల డబ్బు వల్ల ఇది సాధ్యమైంది. ప్రభుత్వం అందించే తోడ్పాటు ఉండగా, తమ సొంత కృషితో భవిష్యత్తరాలకు ఒక కానుకగా నిలిచిపోవాలన్న ఆశయంతో తాము సమష్టిగా నిర్ణయించుకుని ఈ పనికి పూనుకున్నామని కేస్లాపూర్ గ్రామ పటేల్ మేస్రం వెంకటరావు, స్వయంగా పరిశోధకులు, విద్యావేత్త కూడా అయిన పర్ధాన్ మేస్రం మనోహర్ తెలిపారు.

మేస్రం వంశీయుల ఆలోచనలు, అభిప్రాయాలకు అనుగుణంగా విజయనగర శైలిలో ఆలయాన్ని రూపకల్పన చేసి ఒక కళాఖండాన్ని అవతరింపజేసిన ఘనత నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన సంప్రదాయ శిల్పి తలారి రమేష్, ఆయన బృందానికి దక్కుతుంది. ఆలయ నిర్మాణానికి అహోబిలం ఆలయంలో వాడిన ఎర్ర రాతినీ, నాగోబా మూల విగ్రహానికి కంచి ప్రాంతంలో దొరికే కృష్ణశిల (నల్లరాయి)నీ వాడారు. నాగోబా పౌరాణిక గాథలోని పలు ఘట్టాలను, రాజ్ గోండుల ప్రాచీన సాంస్కృతిక అంశాలనూ, వైభవాన్నీ తెలియజేసే ఇతివృత్తాలను ఆలయ స్తంభాల్లో, ఆలయ పీఠం చుట్టూ ఒక దృశ్య కావ్యంలా రూపకల్పన చేసి నిలిపారు. ఎర్ర రాయి కాంతిని ప్రతిఫలించే ప్రత్యేకతను కలిగి ఉన్న కారణంగా... సూర్యకాంతి మారుతున్న తీరును బట్టి ఆలయంలోని శిల్పాలు పలు వర్ణాల్లో దర్శనమిస్తాయి.

ఒకప్పుడు గడ్డి కప్పుతో ఉన్న సాదా సీదా గుడి, కాల క్రమంలో పెరుగుతూ, ఇప్పుడు గొప్ప వాస్తు, శిల్పాలతో భవ్యమైన ఆలయంగా అవతరించడం భారతదేశపు ఆదివాసీల అధునిక చరిత్రలోనే ఒక గొప్ప ఘట్టం. మధ్య భారత దేశంలో ఒకప్పుడు గొప్ప సామ్రాజ్యాలు ఏలిన గోండుల ప్రాచీన వైభవానికి ప్రతీకగా కూడా నాగోబా ఆలయం నిలిచిపోతుంది.

ఇప్పుడింక ఏడాది అంతా దర్శించుకోదగిన సరికొత్త పుణ్యక్షేత్రం, పర్యాటక స్థలం కేస్లాపూర్ నాగోబా ఆలయం.

జానపద, ఆదివాసీ సంస్కృతుల పరిశోధకులు
మొబైల్ : 96761 80802

సమతుల్యత అవసరం

భగవంతుడు కోటానుకోట్ల ప్రాణులను సృష్టించాడు. ఒక్కొక్క ప్రాణిదీ ఒక్కొక్క జీవితం. ఒక్కో తత్వం. ఈ జీవరాశులనేవి మనిషి, మృగము, పక్షి, పురుగు ఇలా అనేక రకాలు. జీవిత కాలంలో ఇవన్నీ ఏదో ఒక కార్యాన్ని చేస్తూ ఉంటాయి. కానీ వీటిని ఆడించేవాడు భగవంతుడు. అతను సూత్రధారియై ఆడిస్తున్నంత కాలం ఇవన్నీ ఆడుతుంటాయి. అతను ఆపితే ఇవన్నీ ఆగిపోతాయి. అందుకే ఈ జీవితం నిత్యమని అనుకోకూడదు. ఎంతకాలం జీవిస్తామనేది మన ఇష్టాన్ని బట్టి ఉండదు. క్షణభంగురమైన ఈ జీవితకాలంలో దైవ భక్తి అనేది అలవాటు చేసుకోవాలి.



అలాగే ఐహిక ప్రపంచ జీవితంలో మనకు ఎదురయ్యే సంబంధ బాంధవ్యాల పట్ల అంటీ అంటనట్టు ఉండాలి. అంతేతప్ప వాటిల్లో కూరుకుపోకూడదు. తామరాకుపై నీటిబిందువులా జీవితం సాగించాలి. తామరాకుపై ఉన్న నీటి బిందువులు ఏ క్షణంలో జారి కింద పడిపోతాయో ఎవరు చెప్పగలరు? జీవితమూ అంతే. కనుక దేనికీ దాసోహమైపోకూడదు. అలాగే అత్యాశ, అధికమైన కోరికలను త్యజించాలి. అవి త్యజించలేనినాడు ఇతరులపైనే కాదు, మనపై మనకే కోపం వస్తుంది. ఫలితంగా అశాంతి జీవితాన్ని ఆవరిస్తుంది. అయితే కేవలం మన కోరికలే మన అశాంతికి కారణం అని చెప్పడమూ సరికాదు. మనిషి సంఘజీవి కాబట్టి మనతో సంబంధం లేకుండా ఇతరుల ప్రవర్తనా, ప్రభుత్వాల నిర్ణయాలూ, పని ఒత్తిడులూ వంటివీ మన కోపతాపాలకూ, అశాంతికీ కారణమవుతాయి.

కాబట్టి మనిషి తన పరిధిలో తాను ప్రశాంతంగా, ఆరోగ్యంగా జీవించడానికి ఆధ్యాత్మిక, లౌకిక విషయాలను తగు విధంగా మేళవించుకోవాలి. ఈ రెండింటి మధ్య సమతౌల్యాన్ని సాధించినవారే ఇహ, పర జీవితాల పరంగా సంపూర్ణత్వాన్ని సాధించగలుగుతారు. కోరికలను అదుపుచేసుకోవడం, నడక, యోగాసనాలు, సంగీత– సాహిత్యాలు వంటి లలితకళలపై దృష్టిపెట్టడం వంటివి భగవన్నామ స్మరణతో పాటూ చేయాల్సిన పనులు. ఇందువల్ల మానసిక ప్రశాంతతతో పాటూ శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుంది. రోజురోజుకీ జీవితం యాంత్రికంగా మారుతున్న ఈ కాలంలో పైన చెప్పిన విషయాలు ఎంతో విలువైనవి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** బ.త్రయోదశి ఉ.9.34 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.1.48 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.10.31 నుండి 12.01 వరకు, తిరిగి తె.5.34 నుండి 7.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.22 నుండి 11.07 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.37 వరకు, **అమృత ఘడియలు:** రా.7.40 నుండి 9.12 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.54

భద్రాచలంలో వెండి వాకిలి



భద్రాచలం అర్బన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం వెండి వాకిలి ఏర్పాటు చేశారు. దాదాపు 100 కిలోల వెండితో నిపుణులు ఈ వాకిలిని సిద్ధం చేశారు. ఇందుకు 70 కిలోల వెండి ఆలయం నుంచి సమకూర్చగా.. 30 కిలోలను ఓ దాత విరాళంగా అందజేశారు. కాగా, అంతరాలయంలో కొన్నేళ్ల క్రితం బంగారు వాకిలి ఏర్పాటు చేయగా, ఇప్పుడు ముఖమండపం వద్ద వెండివాకిలి ఏర్పాటైంది.

17 నుంచి రామాలయంలో నూతన సేవలు

భద్రాచలం టౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈనెల 17 నుంచి నూతన సేవలు ప్రారంభిస్తున్నట్లు ఈవో రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారి కల్యాణ మూర్తులను ప్రధాన ఆలయం నుంచి బేడా మండపానికి తీసుకెళ్లడం, తిరిగి ఆలయానికి తీసుకొచ్చే క్రమంలో స్వామివారికి ఈ సేవలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి శనివారం చిన్న హనుమత్ వాహన సేవ, ప్రతి ఆదివారం చిన్న గరుడ వాహన సేవలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సేవల్లో పాల్గొనే భక్తులు రూ.250 చెల్లించాలని సూచించారు. వారికి స్వామివారి ప్రసాదం, చిన్న లడ్డూలు రెండు అందజేస్తామని ఈవో వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో రూమ్ బుకింగ్

- వేములవాడ రాజన్న భక్తులకు తీరనున్న కష్టాలు



వేములవాడ రాజన్న ఆలయం

వేములవాడ: దక్షిణకాశీగా ప్రసిద్ధి గాంచిన వేములవాడ రాజన్న ఆలయ వసతి గదులను ఇక నుంచి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. ఇన్నాళ్లు వేములవాడకు వచ్చాకే వసతి గదులు బుక్ చేసుకునే అవకాశం ఉండడంతో రూమ్ దొరుకుతుందా? లేదా? అనే బెంగ భక్తులను వెంటాడేది. ఇక నుంచి అలాంటి ఇబ్బంది లేకుండా వారం రోజుల ముందుగానే ఆన్‌లైన్‌లో వసతిగదిని రిజర్వ్ చేసుకునే అవకాశాన్ని ఆలయ అధికారులు బుధవారం నుంచి కల్పించారు. టీయాప్ ఫోలియో (T APP FOLIO, MEE E VA), మీసేవ (T APP FOLIO) ద్వారా బుక్ చేసుకోవచ్చని ఆలయ ఈఓ కృష్ణప్రసాద్ తెలిపారు వసతిగది బుకింగ్‌తోపాటు పేమెంట్స్ సైతం ఇదే యాప్‌లో రాజన్న ఖాతాకు జయచేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలు యాప్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. అన్ని రకాల పూజలు, మొక్కులు కూడా రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. కాగా, రాజన్నకు 14 రోజుల్లోనే హుండీల ద్వారా రూ.2,15,67,130 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం హుండీలను లెక్కించారు. నగదుతోపాటు 71 గ్రాముల బంగారం, 13.600 కిలోల వెండి సమకూరినట్లు వివరించారు.

విద్యార్థినుల ఆత్మహత్యపై విచారణ ముమ్మరం

హాస్టల్‌ను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటనపై విచారణ అధికారి డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం విచారణ చేపట్టారు. ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. ఆ ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య ఘటన జరిగిన తర్వాత మిగతా విద్యార్థినులంతా హాస్టల్‌ను ఖాళీ చేసి ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో అక్కడ విద్యార్థినులు ఎవరూ లేకపోవడంతో హాస్టల్ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పట్టణంలోని బ్రాహ్మణవాడలోని బాలికల ఉన్నత పాఠశాలలో విచారణ జరిపారు. చనిపోయిన ఇద్దరు విద్యార్థినులకు కౌన్సిలింగ్ ఇచ్చిన పీఈటీ ప్రతిభ కోసం విచారించగా సెలవులో ఉన్నారని చెప్పారు. గురువారం మరోసారి విచారణ చేసిన అనంతరం నివేదికను కలెక్టర్‌కు సీల్డ్ కవర్‌లో అందించనున్నట్లు నాగలక్ష్మి 'సాక్షి'తో చెప్పారు. కాగా, ఈ ఘటనపై పుకార్లను నమ్మవద్దని, దర్యాప్తు పారదర్శకంగా కొనసాగుతోందని భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర చెప్పారు.

పెళ్లి బృందం నిలువుదోపిడీ

- నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ రైలులో భారీ చోరీ
- రూ.30 లక్షల ఆభరణాలు, రూ.5.7 లక్షల నగదు చోరీ



నాందేడ్ రైల్వే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జగదీశ్ అగర్వాల్

ఆదిలాబాద్ టౌన్: శుభకార్యానికి వెళ్లి రైల్లో తిరిగి వస్తున్న ఆదిలాబాద్‌కు చెందిన ఓ వ్యాపారికి చెందిన రూ.30 లక్షల విలువైన ఆభరణాలు, రూ.5.7 లక్షల నగదు చోరీ అయ్యింది. ఈ నెల 6న జరిగిన ఈ సంఘటనపై వ్యాపారి జగదీశ్ అగర్వాల్ తెలిపిన వివరాలివి. ఈ నెల 2న జగదీశ్ అగర్వాల్ తన మనవరాలు శృతి వివాహానికి హాజరయ్యేందుకు ఆదిలాబాద్ పట్టణం నుంచి నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో 56 మంది బంధువులతో కలిసి నాసిక్ వెళ్లారు. 4న వివాహం కాగా 5న ముంబయి–ఆదిలాబాద్ నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ రైల్లో (నం.11401) నాసిక్ నుంచి తిరిగి బయల్దేరారు. జగదీశ్ అగర్వాల్ కుటుంబ సభ్యుల వద్ద ఉన్న ఓ బ్యాగులో నగదుతో పాటు వజ్రాభరణాలున్నాయి. ఈ నెల 5వ తేదీ రాత్రి ఒంటిగంట ప్రాంతం వరకు ఆ బ్యాగు వారి వద్ద ఉండగా.. మర్నాడు 6వ తేదీ ఉదయం 5 గంటల ప్రాంతంలో రైలు నాందేడ్‌కు చేరుకుంది. నిద్రలేచి చూసేసరికి బ్యాగు కనిపించలేదు. బ్యాగులో రూ.30 లక్షల విలువైన వజ్రాభరణాలు, రూ.5.7 లక్షల నగదు, రెండు మొబైల్ ఫోన్లు చోరీ అయ్యాయి. దీంతో జగదీశ్ అగర్వాల్ 139కు సమాచారం అందించగా నాందేడ్ డివిజన్ పోలీసులు బాధితుల వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. బుధవారం జగదీశ్ అగర్వాల్ నాందేడ్ రైల్వే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన కారు

- ఇద్దరి మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- కరీంనగర్ జిల్లా కొత్తగట్టు వద్ద ఘటన



ప్రభాకర్ (ఫైల్)



ధ్వంసమైన కారు



కొమురమ్మ (ఫైల్)

శంకరపట్నం: వేకువజామున రోడ్డును కమ్ముకున్న పొగ మంచు.. రోడ్డుపక్కనే ఓ టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యపు పార్కింగ్ కారణంగా ఇద్దరి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మరో ఇద్దరు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో బుధవారం వేకువజామున చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కోతిరాంపూర్ పోచమ్మవాడకు చెందిన నీర్ల ప్రభాకర్ (58), తాళ్లపల్లి సదానందం స్నేహితులు. ప్రభాకర్ లారీల వ్యాపారం చేస్తున్నాడు. సదానందం కారు డ్రైవర్. ప్రభాకర్‌కు చెందిన లారీ విజయవాడలో రిపేరులో ఉండటంతో ఆ పని ఎంతవరకు అయ్యిందో చూసేందుకు ఇద్దరూ కలిసి వెళ్దామనుకున్నారు. ముందుగా బస్సులోనే వెళ్దామనుకున్నప్పటికీ.. సదానందం తల్లి కొమురమ్మ (68), హన్మకొండకు చెందిన సోదరి గీతను హన్మకొండలో దింపాల్సి ఉంది. దీంతో కారులో అక్కడివరకు నలుగురూ వెళ్లి.. అక్కడి నుంచి సదానందం, ప్రభాకర్ విజయవాడకు వెళ్దామని అనుకున్నారు. బుధవారం వేకువజామున నాలుగున్నర ప్రాంతంలో కరీంనగర్‌లోని ఇంటినుంచి నలుగురూ బయల్దేరారు. కారు సదానందం నడుపుతుండగా.. పక్క సీటులో ప్రభాకర్, వెనక సీట్లో కొమురమ్మ, గీత కూర్చుకున్నారు. ఐదున్నర గంటల సమయంలో కారు శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారుకు చేరుకోగానే పొగమంచు కమ్ముకోవడంతో పాటు రోడ్డుపక్కన ఎలాంటి సూచిక లేకుండా పార్క్ చేసిన టిప్పర్‌ను వెనకనుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో ప్రభాకర్, కొమురమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. సదానందం, గీతకు తీవ్రగాయాలయ్యాయి.

తెలంగాణ కుంభమేళాకు వేళాయె

- మేడారంలో గుడిమెలిగెతో శ్రీకారం.. వచ్చే బుధవారం మండమెలిగె
- మహాజాతర ఆరంభానికి ఇదే కీలకఘట్టం
- సమ్మక్క– సారలమ్మలకు పూజలు.. పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భక్తులు
- పూర్తికాని రహదారులు, జాతర ఏర్పాట్లు.. ఉత్సవ కమిటీ ఏర్పాటుపైనా తాత్సారం



భక్తులతో కిక్కిరిసిన సమ్మక్క గద్దె

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిని శుద్ధి చేసి పూజలు చేస్తున్న సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య

సాక్షిప్రతినిధి, వరంగల్: మేడారం సమ్మక్క–సారలమ్మలకు పూజలతో తెలంగాణ కుంభమేళాకు అంకురార్పణ జరిగింది. ప్రతీ రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమికి ముందుగా వచ్చే బుధవారం రోజునే ఈ మహా ఉత్సవం మొదలవుతుంది. దానికి సరిగ్గా 14 రోజుల ముందు గుడిమెలిగె పండుగ జరుగుతుంది. బుధవారం మేడారంలోని సమ్మక్క, కన్నెపెల్లిలో సారలమ్మ గుడిలో పూజారులు తలస్నానాలు ఆచరించి తల్లుల అలయాలను శుద్ధి చేసి గుడిమెలిగె పండగ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మేడారంలో సమ్మక్క పూజారి సిద్దబోయిన మనీందర్ ఇంటి వద్ద పూజారులు కంకణాలు కట్టుకోగా, ఆడపడుచులు పసుపు, కుంకమలు, పూజారులు, వడ్డెలు పవిత్ర జలం, దూపం, యాటతో డోలు వాయిద్యాల నడుమ సమ్మక్క గుడికి చేరారు. ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య సమ్మక్క గుడి ఈశాన్యం మూలన ఎట్టి గడ్డి ఉంచగా, ఆడపడుచులు సమ్మక్క శక్తి పీఠాన్ని పసుపు, కుంకుమలతో అలంకరించారు. అనంతరం సమ్మక్క గుడి గుమ్మం బయట ముగ్గులు వేసి అందంగా అలంకరించగా. పూజారులు అమ్మవారికి దూప, దీపాలు వెలగించి పూజలు నిర్వహించి యాటను నైవేద్యంగా సమర్పించారు. కన్నెపెల్లిలోని సారలమ్మ గుడిలో సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్య ఇతర పూజారులతో కలిసి గుడిమెలిగె పండగ పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం ఆడపడుచులు సారలమ్మ గుడి ముందు ముగ్గులు వేసి అలంకరించారు. బుధవారం సమ్మక్కకు బోనం పెట్టడం ఆనవాయితీ కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ నెల 14న ఉదయం 9 నుంచి రాత్రి 12 గంటల వరకు వనదేవతలు సమ్మక్క, సారలమ్మ మండమెలిగె పండుగ జరుగుతుంది.

జాతరకు మరో 13 రోజులే... పనుల పూర్తిలో ఇంకా జాప్యమే

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరకు మరో 13 రోజులే ఉంది. ఆదివాసీ సంప్రదాయబద్ధంగా నిర్వహించే మహాజాతర ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనుంది. ప్రతిసారీ కనీసం నాలుగు నెలల ముందు నుంచే జాతర నిర్వహణ ఏర్పాట్లు, అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు. గతేడాది జూలైలో పంపిన ప్రతిపాదనలను మించి మొత్తం 21 శాఖలకు రెండు విడతల్లో రూ.105 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. దాదాపుగా రెండు నెలలుగా సాగుతున్న పనులు చాలా వరకు పూర్తి కాలేదు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లు అధికారులతో విడతల వారీగా ఇప్పటికే నాలుగైదు సమీక్షలు నిర్వహించారు. రహదారుల నిర్మాణం, మరుగుదొడ్లు, నీటి ట్యాంకులు, క్యూలైన్లు, స్నానఘట్టాలు, కల్యాణకట్టలు, చెక్‌డ్యాంలు, హోల్డింగ్ పాయింట్లు, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, డంప్‌యార్డులు తదితర నిర్మాణాలు ప్రతిపాదనల్లో పేర్కొన్న ప్రకారం సంపూర్ణంగా పూర్తి కావాల్సి ఉంది. కొందరు భక్తులు జాతరకు ముందుగానే మొక్కులు చెల్లిస్తున్న క్రమంలో ఇప్పటికే మేడారం వెళ్లే వాహనాలతో రహదారి రద్దీగా ఉంటోంది. వచ్చే నెల 21 నుంచి 24 వరకు జరగనున్న జాతరకు ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాకు చెందిన భక్తులు 365వ జాతీయ రహదారి గుండా ప్రయాణిస్తారు. గూడూరు, వరంగల్ జిల్లా ఖానాపురం మండలాల్లో అసంపూర్తి పనులతో ప్రయాణికులకు కష్టాలు తప్పేలా లేవు. నల్లగొండ జిల్లా నకిరేకల్ నుంచి ములుగు జిల్లా మల్లంపల్లి వరకు 189 కిలోమీటర్ల వరకు జాతీయ రహదారి నిర్మాణం చేపట్టారు. మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి నుంచి వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట వరకు 32 కిలోమీటర్ల దూరం విస్తరణ పనులు పూర్తి కావాల్సి ఉంది.

అతిపెద్ద జాతరకు ఆ కమిటీనే వేయలే..

మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటులో ఎప్పుడూ నిర్లక్ష్యమే కనిపిస్తోంది. 2012 వరకు సజావుగానే సాగినా 2014 జాతర నుంచి ధర్మకర్తల మండలి ఏర్పాటులో ప్రతీసారి జాప్యమే అవుతోంది. 2014లో కోర్టు వివాదాల వల్ల ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో అధికారుల పర్యవేక్షణలోనే జాతర నిర్వహించారు. 2016లో పునరుద్ధరణ కమిటీని నియమించారు. 2018 మహాజాతరకు కాక లింగయ్యను చైర్మన్‌గా ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేశారు. 2020, 2022 జాతరలు పునరుద్ధరణ కమిటీతో నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేస్తారని ఆదివాసీలు భావిస్తున్నారు. షెడ్యూల్ ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ (పెసా) చట్టం ప్రకారం ఆదివాసీలనే నియమించాలని కూడా కోరుతున్నారు. అయితే జాతరకు మరో 13 రోజులు ఉండగా ఇంకా ఆ కమిటీపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈసారి మహాజాతరను ధరకర్తల కమిటీ వేసి నిర్వహిస్తారా? లేక పునరుద్ధరణ కమిటీతో నడిపిస్తారా? అన్న చర్చ జరుగుతోంది.

మేడారం జాతరకు వెళ్లకుండానే..
సమ్మక్క–సారక్కకు బంగారం!: మంత్రి సురేఖ



సాక్షి, హైదరాబాద్: శ్రీ సమ్మక్క సారక్క జాతరకు వెళ్లలేని భక్తులు తమ నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) అమ్మవారి గద్దెల వద్ద సమర్పించేలా ఆన్‌లైన్ సేవలను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో తన మనవడు కొండా మురళీకృష్ణ పేరును మీ సేవ వెబ్‌సైట్‌లో నమోదుచేసి, బరువు ప్రకారం డబ్బులు చెల్లించి అమ్మవారి గద్దెల వద్ద బంగారాన్ని సమర్పించే సౌకర్యాన్ని మంత్రి సురేఖ ఉపయోగించుకున్నారు. వివిధ కారణాలతో సమ్మక్క సారలమ్మలను దర్శించుకోలేని భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు. సమ్మక్క సారక్కల గద్దెల వద్ద బంగారం సమర్పించడాన్ని భక్తులు ఎంతో పవిత్రమైన కార్యంగా భావిస్తారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహకారంతో దేవాదాయ శాఖ అమలు చేస్తున్న ఈ సేవలు బుధవారం నుంచే ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్టు శాఖ అధికారులు తెలిపారు. మీ సేవ, టీయాప్ ఫోలియో (ఆన్లైన్), పోస్టల్ డిపార్టమెంట్ ద్వారా ఎవరి పేరు మీదైతే బంగారం సమర్పించాలనుకుంటున్నారో వారి బరువుకు అనుగుణంగా డబ్బులు చెల్లించి ఈ సేవలను బుక్ చేసుకునే వెసులుబాటును దేవాదాయ శాఖ కల్పించింది. రాష్ట్రంలోని దాదాపు 5 వేల మీ–సేవ సెంటర్లు, దేశంలోని దాదాపు 1.5 లక్షల పోస్టల్ కేంద్రాలు (తెలంగాణలో 6 వేల కేంద్రాలు) ఈ సేవలను అందించనున్నాయి. బంగారం సమర్పణతో పాటు, అమ్మవారి ప్రసాదం కావాలనుకునే వారు కూడా పోస్టల్ డిపార్టమెంట్ టీ–యాప్, మీ సేవా కేంద్రాల ద్వారా డబ్బులు చెల్లించి...పోస్టల్ డిపార్టమెంట్ కొరియర్ ద్వారా ప్రసాదాన్ని పొందే సౌకర్యాన్ని కూడా కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, పోస్టల్ డిపార్టమెంట్, మీ సేవ, దేవాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

హరిత నిధిలెక్క పక్కాగా ఉండాలి

హరితనిధిలో ప్రతీ రూపాయికి పక్కా లెక్క ఉండాలని, పూర్తి పారదర్శకత, జవాబుదారీతనంతో పనులు చేయాలని అధికారులను అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. కేటాయింపులు, ఖర్చుల వివరాలు ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. వివిధ జిల్లాల్లో ఏర్పాటైన నర్సరీలు, జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించి తనకు నివేదిక ఇవ్వాలని అటవీశాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్‌కు మంత్రి చెప్పారు. పూర్తయిన పనుల ఆడిట్ నివేదికలను పరిశీలించాలన్నారు. మంజూరై, పనులు మొదలుపెట్టని జిల్లాల నుంచి నిధులు వెంటనే వెనక్కి తీసుకొని, తాజా పనులకు కేటాయించాలని తెలిపారు. చింత, వేప, రేల వంటి చెట్లను రహదారుల వెంట నాటేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బుధవారం సచివాలయంలో హరితనిధి విరాళాలు, వ్యయంపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. హరితనిధి కింద వచ్చిన విరాళాలు, ఖర్చు వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పీసీసీఎఫ్ ఆర్‌ఎం. డోబ్రియాల్ వివరించారు. 2021లో మొదలైన హరితనిధి ద్వారా ఇప్పటి దాకా రూ.69.21 కోట్లు జమ కాగా, అందులో రూ.43 కోట్ల మేరకు పనులు మంజూరు అయ్యాయని, రూ.29.39 కోట్లు విడుదల కాగా, రూ.18.72 కోట్ల పనులు పూర్తయ్యాయని తెలియజేశారు. జిల్లాకు ఒకటి చొప్పున సెంట్రల్ నర్సరీల ఏర్పాటు, ఎవెన్యూ ప్లాంటేషన్‌కు పెద్ద మొక్కల పెంపకం, అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో మిగిలిన పనులు, దశాబ్ది సంపదవనాల పేరుతో సాగునీటిశాఖ పరిధిలో ఉన్న మిగులు భూముల్లో వనాల పెంపుకం హరితనిధి ద్వారా వచ్చిన నిధులతో జరుగుతోందని వెల్లడించారు. ఈ సమావేశంలో పీసీసీఎఫ్ (హరితహారం) సువర్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లింగ మార్పిడి వ్యక్తులకు రక్షణ కల్పించాలి

- వారిపై వివక్ష, హింసకు చోటులేకుండా చర్యలు చేపట్టాలి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్ కోషి



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ శ్యామ్‌కోషి. చిత్రంలో టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ సభ్యకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: లింగ మార్పిడి చేయించుకున్న వ్యక్తుల హక్కులను పరిరక్షించాలని, వారికి రక్షణ కల్పించాలని అధికారులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్ కోషి సూచించారు. అధికారులు, పారిశ్రామికవేత్తలతో ఆయన బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్యామ్ కోషి మాట్లాడుతూ.. పని స్థలాలు, విద్యా సంస్థలు వంటి ప్రదేశాల్లో లింగ మార్పిడి వ్యక్తులపై లింగ ఆధారిత వివక్ష, హింసకు చోటులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. వారిపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే కేసులు పెట్టి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

'భూపాలపల్లి' కేసు కొట్టివేయండి

- హైకోర్టులో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: తమపై భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో గత నెల 16న నమోదైన కేసును కొట్టివేయాలంటూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, గండ్ర గౌతమ్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అక్రమంగా కేసు పెట్టారని.. తదుపరి విచారణపై స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భూపాలపల్లి పట్టణంలోని పుల్లూరి రామయ్యపల్లి శివారు చెరువు శిఖంలో అక్రమ నిర్మాణం చేపట్టారని నాగవెల్లి రాజలింగమూర్తి గత నెలలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో గండ్ర వెంకటరమణారెడ్డి, గండ్ర జ్యోతి, గండ్ర గౌతమ్‌రెడ్డి తదితరులపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా, గండ్ర దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ చేపట్టనుంది.

మార్చి 1న 'రజాకార్' విడుదల

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సంస్థానాన్ని పాలించిన నిజాం కాలంలో జరిగిన ముఖ్య ఘటనలపై తీసిన రజాకార్ సినిమా మార్చి 1వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తామని బీజేపీ ముఖ్య నాయకుడు గూడూరు నారాయణరెడ్డి తెలిపారు. అన్ని భారతీయ భాషల్లో విడుదలయ్యే ఈ సినిమా హిందీ ట్రైలర్‌ను ఈనెల 10న ముంబైలో సినీనటి కంగనా రనౌత్ చేతుల మీదుగా లాంచ్ చేయించేందుకు మంగళవారం గూడూరు ఆమెతో భేటీ అయ్యారు. ఇదిలా ఉంటే ఈ సినిమాపై ఇప్పటికే పలు వివాదాలు, ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో రజాకార్ సినిమాపై అందరి ఆసక్తి ఏర్పడింది.

ఇన్‌ఫార్మర్ నెపంతో గిరిజనుడి హత్య

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధి తిమ్మాపూర్‌కు చెందిన మిచ్చా హిద్మా (25)ను మావోయిస్టులు కిడ్నాప్ చేసి ప్రజాకోర్టు నిర్వహించిన అనంతరం మంగళవారం రాత్రి పదునైన ఆయుధాలతో హత్య చేశారు. ఆ తర్వాత మృతదేహాన్ని తిమ్మాపూర్ సమీపంలో పడవేశారు. మృతదేహం వద్ద మావోయిస్టు పార్టీ మద్దేడు ఏరియా కమిటీ పేరిట లేఖను వదిలారు. తిమ్మాపూర్ క్యాంప్ ఇన్‌చార్జ్ కమల్ కిశోర్ తిమ్మాపూర్‌లో కొందరు యువకులకు డబ్బు ఆశ చూపి ఇన్‌ఫార్మర్లుగా వాడుకుంటున్నాడని, అదేక్రమంలో తిమ్మాపూర్‌కు చెందిన మిచ్చా హిద్మాను లోబరచుకుని ఇన్‌ఫార్మర్‌గా మార్చారని ఆ లేఖలో పేర్కొన్నారు. హిద్మాను గతంలో హెచ్చరించినా తీరు మారకపోవడంతో ప్రజాకోర్టులో శిక్షించామని తెలిపారు. ఈమేరకు బుధవారం బాసగూడ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నకిలీ సంస్థలకు రాష్ట్ర ప్రాజెక్టులు

- చంద్రబాబు చేసిన పనే రేవంత్ చేస్తున్నారు
- బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపణ

సాక్షి, హైదరాబాద్: నకిలీ సంస్థలకు సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రాజెక్టులను అప్పగిస్తున్నారని, ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు అదే పనిచేశారని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. ఆయన బుధవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నకిలీ సంస్థలతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రచార ఆర్భాటం చేసుకుంటున్నారని విమర్శించారు. దావోస్‌కు వెళ్లి అదే పనిచేశారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు మెయిన్ హార్ట్ అనే సంస్థకు ప్రాధాన్యమిచ్చారని, ఇప్పుడు సీఎం రేవంత్ అదే సంస్థకు మూసీ అభివృద్ధి పనులు అప్పగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం చంద్రబాబు దారిలోనే రేవంత్ రెడ్డి నడుస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో ఎంపీ టిక్కెట్ల కోసం వారసత్వ పోరు జరుగుతోందని మన్నె క్రిశాంక్ తెలిపారు.

జీవితాన్ని గెలవాలన్న తపన ఉండాలి

ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్



మేడ్చల్ రూరల్: విద్యార్థులు, యువత జీవితంలో రాణించడమే కాకుండా ఎంచుకున్న లక్ష్యాన్ని, జీవితాన్ని గొప్పగా గెలవాలన్న తపన కలిగి ఉండాలని ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ అన్నారు. కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. జీవితం సవాళ్లతో, సమస్యలతో నిండి ఉంటుందని వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. విద్యార్థులు తమ ఎదుగుదలకు అవసరమయ్యే ఆలోచనా ధోరణిని అలవర్చుకోవాలన్నారు. అపజయాలు అందరికీ ఎదురవుతాయన్న ఆయన వాటిని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. మన వైఖరి మన జీవితాన్ని నిర్ణయిస్తుందన్నారు. జీవితంలో అడ్డంకులు రావడం సహజమని అధిగమించడం ముఖ్యమని తెలిపారు. తాను అంగ వైకల్యం నుండి మోటివేషనల్ స్పీకర్‌గా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందానన్నారు. విద్యార్థుల్లో ఉన్న అపోహలు, భయం, సందేహాలు, ఆలోచనలను స్పష్టమైన సమాధానాలతో వివరించారు. జీవితంలో ఇతరులపై ఆధారపడి బతకడం సరికాదన్నారు. విద్యార్థులు తమలో ఉండే పట్టుదలను ఒక మాత్ర(టాబ్లెట్)గా ఉపయోగించుకుని జీవితంలో ముందుకు సాగితే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. విజయాన్ని అడ్డుకునే అసాధ్యలను కూడా పలు రకాలుగా ఎదుర్కొంటే అడ్డంకులను సైతం అద్భుతాలుగా మార్చుకోవచ్చన్నారు. అనంతరం సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి ఆయను ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

మీరెలా చెబితే అలా..!

లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల పంపకాలపై బీజేపీ అగ్ర నేతలతో చంద్రబాబు

- రాత్రి 11.30 గంటలకు అమిత్ షా, జేపీ నడ్డాతో ఢిల్లీలో భేటీ
- 6 నుంచి 8 ఎంపీ సీట్లు, 25 వరకు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలన్న బీజేపీ నేతలు
- పొత్తులకు అంగీకరిస్తే ఎలాంటి షరతులకైనా సిద్ధమన్న బాబు
- పవన్‌తో మాట్లాడి కబురు పెడతామని చెప్పిన అమిత్ షా, నడ్డా



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఏపీలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో సుపరిపాలన అందిస్తూ పూర్తిస్థాయిలో ప్రజాదరణ పొందిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి టీడీపీ అధినేత చంద్రబాబు నానా తంటాలు పడుతున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తే పుట్టగతులుండవని తేలిపోవడంతో ఇప్పటికే జనసేన పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. ఆ బలమూ సరిపోకపోవడంతో బీజేపీ కాళ్లపై పడ్డారు. బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఢిల్లీ వచ్చారు. బుధవారం రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. ఎలాగైనా బీజేపీతో పొత్తు కుదుర్చుకోవాలన్న భావనతో సీట్ల సర్దుబాటులో వారెలా చెబితే అలా చేస్తానని చెప్పారు. రాత్రి ఏడున్నర గంటలకే ఈ భేటీ ఉంటుందని ప్రచారం జరిగినా, రాత్రి 11.30 గంటలకు అమిత్ షా నివాసంలో సమావేశమయ్యారు. ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం తనకు పూర్తి సహకారం అందిస్తే బీజేపీ ఎలా చెబితే అలా నడుచుకుంటానని బాబు స్పష్టం చేసినట్లు తెలిసింది. పార్టీ బలంగా ఉన్న చోట సైతం త్యాగాలు చేసేందుకు సిద్ధపడతాననే హామీ ఇచ్చినట్లుగా చెబుతున్నారు.

అనుకున్న దానికన్నా ఎక్కువ సీట్లే అడిగిన బీజేపీ పెద్దలు: ఈ చర్చల్లో పొత్తుతో బీజేపీకి లాభించే అంశాలు, ఓట్ల బదిలీ అవకాశాలు, జనసేన పార్టీ బలాబలాలు వంటి అంశాలపై బీజేపీ పెద్దలు ఆరా తీసినట్లు తెలిసింది. రాష్ట్రంలో వైసీపీ బలంగా ఉందని తమ నివేదికలు చెబుతున్నాయని, ఈ నేపథ్యంలో పొత్తులతో ఒనగూరే ప్రయోజనాలు ఏమిటన్న ప్రశ్నలనే నేతలు లేవనెత్తినట్లు సమాచారం. కచ్చితంగా పొత్తు అవసరమైతే బీజేపీకి 6 నుంచి 8 ఎంపీ సీట్లు, 25 వరకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని, అప్పుడే ఇరు పార్టీలకు ప్రయోజనకరంగా ఉంటుందని అమిత్‌షా, నడ్డా స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే బీజేపీకి ఆ స్థాయిలో అభ్యర్థులు లేరని, 10 నుంచి 15 స్థానాల వరకైతే అభ్యంతరం ఉండబోదని బాబు చెప్పినట్లుగా తెలిసింది. లోక్‌సభ స్థానాల్లో 5 లేదా 6 బీజేపీకి ఇచ్చేందుకు బాబు సిద్ధపడినట్లు తెలిసింది. పొత్తులకు అంగీకరిస్తే ఎలాంటి షరతులకైనా తాను సిద్ధమని బాబు అన్నట్లు సమాచారం. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో కూడా చర్చించిన అనంతరం పొత్తులు, సీట్ల సర్దుబాటుపై కబురు చేస్తామని వారు బాబుకు చెప్పినట్లు సమాచారం.

హోటల్‌లో రహస్య భేటీ

కాగా ఢిల్లీ చేరుకున్న వెంటనే చంద్రబాబు నేరుగా పార్టీ ఎంపీ గల్లా జయదేవ్ నివాసానికి వెళ్తారని అందరూ భావించారు. అయితే, బాబు అక్కడికి కాకుండా లీ మెరిడియన్ హోటల్‌కు వెళ్లారు. ఆయన వెంట ఉన్న ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, రఘురామకృష్ణరాజు, ఇతర నేతలు హోటల్ లాబీల్లోనే ఉండిపోయారు. బాబు ఒక్కరే హోటల్లోకి వెళ్లారు. గంటన్నర తర్వాత బయటకు వచ్చారు. చంద్రబాబు హోటల్‌లో ఎవరితో అంత రహస్యంగా భేటీ అయ్యారో టీడీపీ ఎంపీలు, ఇతర నేతలకు కూడా తెలియలేదు. హోటల్ నుంచి గల్లా ఇంటికి వెళ్లారు.

2050 నాటికి...నీటికి కటకటే!



ప్రపంచవ్యాప్తంగా నీటి కాలుష్యం, కొరత

మూడో వంతు నదులకు కాలుష్య ముప్పు | పరీవాహక ప్రాంత ప్రజలకు పెను ఇక్కట్లు | హెచ్చరిస్తున్న అంతర్జాతీయ అధ్యయనం

నీటి కొరతతో ఇప్పటికే ప్రపంచం అల్లాడుతోంది. పలు దేశాల్లో ఈ సమస్య ఉగ్ర రూపు దాలుస్తోంది. తాగునీటి సమస్య యూరప్, ఆఫ్రికాల్లో పలు దేశాల మధ్య వివాదాలకు కూడా దారి తీస్తోంది. కొరతకు నీటి కాలుష్యమూ తోడవడంతో కొన్నేళ్లుగా పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారింది. అయితే ఇదంతా ట్రైలర్ మాత్రమేనని, సమీప భవిష్యత్తులో ఈ సమస్య పెను ఊపు దాల్చవచ్చని తాజా అధ్యయనం తేల్చింది. 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏకంగా మూడో వంతు నదీ పరీవాహక ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటికి తీవ్ర కొరత నెలకొనడం ఖాయమని పేర్కొంది! ఇది కనీసం 300 కోట్ల జనాభాను తీవ్రంగా ప్రభావితం చేయబోతోందని అంచనా వేయడం గుబులు రేపుతోంది... నదీ పరివాహక ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటి లభ్యతపై నెదర్లాండ్స్‌లోని వాగెనింగెన్ యూనివర్సిటీ సారథ్యంలోని బృందం అధ్యయనం నిర్వహించింది. చైనా, మధ్య యూరప్, ఉత్తర అమెరికా, ఆఫ్రికాతో పాటు భారత్‌లోని మొత్తం 10 వేల పై చిలుకు నదీ బేసిన్లు, సబ్ బేసిన్లలో నీటి నాణ్యత తదితరాలపై సుదీర్ఘ కాలం లోతుగా పరిశోధన చేసింది. వాటిలో ఏకంగా మూడో వంతు, అంటే 3,061 నదీ బేసిన్ల పరిధిలో నీరు తాగేందుకు దాదాపుగా పనికిరాకుండా పోనుందని హెచ్చరించింది. ఆయా బేసిన్ల పరిధిలోని జల వనరుల్లో నైట్రోజన్ వచ్చి కలుస్తుండటం ఇందుకు ప్రధాన కారణమని వెల్లడించింది. వాటిలో నైట్రోజన్ పరిమాణం కొంతకాలంగా మరీ ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతోందని తేల్చింది. దీనికి నీటి కొరత తోడై పరిస్థితి పూర్తిగా చేయి దాటిపోవచ్చని స్పష్టం చేసింది. జర్నల్ నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురించిన ఈ పరిశోధన ఫలితాలు కలకలం రేపుతున్నాయి...

అధ్యయనం ఇలా...

- ఆయా నదీ బేసిన్లు, సబ్ బేసిన్లలో నీటి ప్రవాహం, పరిమాణాన్ని లెక్కలోకి తీసుకున్నారు.
- వాటిలో కలుస్తున్న నైట్రోజన్ పరిమాణాన్ని నీటి పరిమాణంతో పోల్చి కాలుష్య స్థాయిని లెక్కించారు.
- 2010 నుంచి చూస్తే గత 13 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపుగా అన్ని నదీ బేసిన్లు, సబ్ బేసిన్లలోనూ నైట్రోజన్ పరిమాణం క్రమంగా పెరుగుతూ వస్తున్నట్టు తేలింది.
- 2010లో నాలుగో వంతు బేసిన్లలో కనిపించిన ఈ సమస్య ఇప్పుడు మూడో వంతుకు విస్తరించింది. పైగా వాటి కాలుష్య కారకాల్లో నైట్రోజన్ పాత్ర ఏకంగా 88 శాతానికి పెరిగింది!

ఏం జరుగుతోంది...

నదీ బేసిన్లు, సబ్ బేసిన్లు కేవలం నీటి వనరులు మాత్రమే కాదు. భారీ స్థాయి పట్టణీకరణకు, ఆర్థిక కార్యకలాపాలకు కూడా కేంద్ర బిందువులు కూడా.


- ఫలితంగా భారీగా ఉత్పత్తయ్యే మురుగునీరు చాలామటుకు వాటిలోనే కలుస్తోంది.
- మురుగులోని నైట్రోజన్ కారణంగా నీటి వనరులు బాగా కలుషితమవుతున్నాయి.
- ఇది కూడా జల వనరుల కాలుష్యంలో పెద్ద కారకంగా మారుతోంది.
- దీనికితోడు బేసిన్ల పరిధిలో వ్యవసాయ కార్యకలాపాలు భారీగా సాగుతాయి. అది విచ్చలవిడి ఎరువుల వాడకానికి దారి తీస్తోంది.

పెను సమస్యే...

- అధ్యయనం జరిపిన 10 వేల పై చిలుకు నదీ బేసిన్లు ప్రధానంగా సాగుకు ఆటపట్టులు.
- ప్రపంచ జనాభాలో ఏకంగా 80 శాతం దాకా వాటి పరిధిలోనే నివసిస్తోంది!
- 2050కల్లా మూడో వంతు, అంటే కనీసం 300 కోట్ల పై చిలుకు జనం తాగునీటి సమస్యతో అల్లాడిపోతారు.
- ఈ నీటి వనరులు పూర్తిస్థాయిలో తాగటానికి పనికిరాకుండా పోతే సమస్య ఊహాతీతంగా ఉంటుందని అధ్యయనం హెచ్చరించింది.
- ఉత్తర అమెరికా, యూరప్, ఉత్తర ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, మధ్య ఆసియా, చైనాతో పాటు భారత్‌లోనూ పలు ప్రాంతాలు ఈ జాబితాలో ఉన్నాయి!

- సాక్షి, నేషనల్ డెస్క్

కాంగ్రెస్‌కు కాలం చెల్లింది



- రాజ్యసభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా
- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కాంగ్రెస్ ఎప్పటికీ వ్యతిరేకమే
- రిజర్వేషన్లను జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకించారు
- ఉత్తరం, దక్షిణం అంటూ దేశాన్ని విభజించడానికి కాంగ్రెస్ కుట్రలు
- వారంటీ తీరిపోయినవారి మాటలను దేశం వినిపించుకోదు
- యువరాజును లిఫ్ట్ చేసే యత్నాలన్నీ విఫలం.. ఆయనో నాన్–స్టార్టర్
- కాంగ్రెస్‌కు ఈసారి 40 సీట్లన్నా రావాలని ఆశిస్తున్నా
- 'మోదీ 3.0 సర్కారు' ఏర్పాటు దగ్గర్లోనే ఉందన్న ప్రధాని

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌కు కాలం చెల్లిపోయిందని, ఆ పార్టీకి వారంటీ లేదని ఎద్దేవా చేశారు. దేశాన్ని ఉత్తరం, దక్షిణం అంటూ రెండుగా విభజించానికి కాంగ్రెస్ కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధాని మోదీ బుధవారం సమాధానమిచ్చారు. దాదాపు 90 నిమిషాలపాటు మాట్లాడారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంట్‌లో ఇదే ఆయన చివరి ప్రసంగం కావడం విశేషం. కేంద్రంలో తాము వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని పునరుద్ఘాటించారు. 'మోదీ 3.0 ప్రభుత్వ' హయాంలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్ల తమ విజన్‌ను ఆవిష్కరించారు. వికసిత భారత్ పునాదిని పటిష్టం చేస్తామని ప్రకటించారు. మోదీ 3.0 సర్కారు ఏర్పాటు ఇక ఎంతోదూరంలో లేదని వ్యాఖ్యానించారు. రాజ్యసభలో ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

ప్రజాస్వామ్యాన్ని హత్య చేసిన కాంగ్రెస్

''దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు కాంగ్రెస్ ఎప్పటికీ వ్యతిరేకమే. బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లేకపోతే ఆయా వర్గాలకు రిజర్వేషన్లు దక్కేవే కావు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకించారు. ఈ మేరకు అప్పట్లో రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉంటే ప్రభుత్వ పరిపాలన దెబ్బతింటుందని నెహ్రూ చెప్పారు. ఓబీసీలకు కాంగ్రెస్ ఎప్పుడూ పూర్తిస్థాయి రిజర్వేషన్లు ఇవ్వలేదు. జనరల్ కేటగిరీలోని పేదలను కూడా పట్టించుకోలేదు. భారతరత్న పురస్కారానికి అంబేడ్కర్ అర్హుడని కాంగ్రెస్ భావించలేదు. సొంత కుటుంబ సభ్యులకు భారతరత్న అవార్డులు ఇచ్చుకున్న చరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. అలాంటి పార్టీ ఇప్పుడు మాకు నీతిపాఠాలు బోధిస్తోంది. మన దేశ భూభాగాలను శత్రు దేశానికి అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అంతర్గత భద్రతపై మాకు ఉపన్యాసాలు ఇస్తోంది. ఆ పార్టీ అధికారం కోసం ప్రజాస్వామ్యాన్ని గొంతుకోసి చంపేసింది. ఎన్నో రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై న ప్రభుత్వాలను రాత్రికి రాత్రే కూలదోసింది.

దయచేసి ఆ భాష మానుకోండి

''కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తోంది. భారత్‌ను ఉత్తర, దక్షిణంగా ముక్కలు చేయడానికి కొత్తకొత్త ప్రకటనలు చేస్తోంది. ఉత్తరం, దక్షిణం అనే విభజన రేఖ తీసుకురావడం కాంగ్రెస్, కర్ణాటక ప్రభుత్వం మానుకోవాలి. దేశ భవిష్యత్తుతో చెలగాటం వద్దు. 'మా పన్నులు, మా డబ్బులు' అంటూ మాట్లాడుతున్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ నుంచి ఇలాంటి భాష బాధగా ఉంది. దయచేసి ఆ భాష మానుకోండి. దీనివల్ల దేశానికి నష్టం తప్ప లాభం ఉండదు. దేశమంటే కొన్ని భూభాగాల సమ్మేళనం కాదు. ఒక అంగం పనిచేయకపోతే శరీరమంతా స్తంభిస్తుంది. అలాగే దేశంలో ఏదైనా ఒక ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా వదిలేస్తే దేశమంతా అభివృద్ధి చెందలేదు''.

వికసిత భారత్.. మా అంకితభావం

కాంగ్రెస్ పాలనలో దేశం సమస్యల వలయంలో చిక్కుకుంది. వాటి పరిష్కారానికే ప్రధానిగా నా రెండు టర్ములను వెచ్చించాను. వికసత భారత్ ఒక పదం కాదు. అది మా అంకితభావం. సబ్‌కా సాత్ అనేది నినాదం కాదు. అది మోదీ ఇస్తున్న గ్యారంటీ. వారంటీ తీరిపోయినవారు చెప్పే మాటలను దేశం వినిపించుకోదు. గ్యారంటీ బలాన్ని చూపించినవారినే దేశం విశ్వసిస్తుంది.

అన్ని వర్గాల సంక్షేమానికి పదేళ్లుగా కృషి

'యువరాజు' (రాహుల్)ను స్టార్టప్‌గా తయారు చేయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. కానీ, ఆయనొక నాన్–స్టార్టర్. ఎంత లిఫ్ట్ చేయాలని చూసినా ఫలితం ఉండడం లేదు. కాంగ్రెస్ ఆలోచనావిధానానికి కాలం చెల్లింది. అందుకే ఆ పార్టీ పనులను ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చారు. కాంగ్రెస్ నానాటికీ దిగజారిపోతుండడం మాకూ బాధగానే ఉంది. సొంత పార్టీ నేత పట్ల గ్యారంటీ లేని కాంగ్రెస్ మోదీ గ్యారంటీని ప్రశ్నిస్తుండడం హాస్యాస్పదం. పదేళ్ల యూపీఏ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది. నాటి ప్రధాని మన్మోహన్ సింగే దీన్ని అంగీకరించారు. దేశ సమస్యలేమిటో తెలిసినా వాటి పరిష్కారానికి కాంగ్రెస్ ఏనాడూ కృషి చేయలేదు. బ్రిటిష్ పాలన నుంచి స్ఫూర్తి పొంది బానిసత్వపు గుర్తులను దశాబ్దాల పాటు కొనసాగించింది. మేము అధికారంలోకి వచ్చాక సమస్యల సుడిగుండం నుంచి దేశాన్ని బయటపడేశాం.

మా గళానికి ప్రజలు బలమిచ్చారు

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దేశమంతటా 40 సీట్లు కూడా రావన్న సవాలు పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చింది. ఇప్పుడున్న 40 సీట్లను కాంగ్రెస్ మళ్లీ నిలబెట్టుకోవాలని నేను ప్రార్థిస్తున్నా. విపక్షాల ప్రతి మాటను మేం చాలా సహనంతో వింటున్నాం. కానీ, మేము చెప్పేది ప్రతిపక్షాలు వినడం లేదు. మా గళాన్ని మీరు అణచివేయలేరు. దానికి దేశ ప్రజలు చాలా బలమిచ్చారు''.

చేపల పడవలో దేశాలే దాటారు

యజమాని వేధింపులు భరించలేక కువైట్ నుంచి ముంబై వచ్చిన ముగ్గురు మత్స్యకారులు



ముగ్గురు భారత జాలర్లు కువైట్ నుంచి 10 రోజులు ప్రయాణించి ముంబై చేరిన పడవ

ముంబై: పరాయి దేశంలో పడరాని పాట్లు పడి, యజమాని పెట్టే హింసలు భరించలేక స్వదేశం వెళ్లే సాహసం చేశారు ముగ్గురు భారతీయులు. అనుకున్నదే తడవుగా యజమాని పడవనే తమ ప్రణాళికకు ప్రధాన ఆయుధంగా వాడుకున్నారు. ఎవరికీ చెప్పకుండా దొంగచాటుగా కువైట్ నుంచి బయల్దేరి సముద్ర మార్గం గుండా నేరుగా ముంబై తీర ప్రాంతానికి చేరుకున్నారు. పుట్టినగడ్డపై కాలుమోపేలోపే పోలీసులు అరెస్ట్‌చేశారు. ముగ్గురు తమిళనాడు వ్యక్తుల సాహసోపేత అక్రమ అంతర్జాతీయ సముద్ర ప్రయాణ ఉదంతం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఇదే తరహాలో అరేబియా సముద్ర జలాల మీదుగా ముంబైలో అడుగుపెట్టిన పాక్ ముష్కరులు మారణహోమం సృష్టించిన విషయం తెల్సిందే. దీంతో సముద్రజలాల మీద గస్తీపై నీలినీడలు కమ్ముకున్నాయి. మంగళవారం ఉదయం ముంబై సమీపంలో ఈ ఘటన జరిగింది. సంబంధిత వివరాలను పోలీసులు బుధవారం వెల్లడించారు.

జనవరి 28న ప్రయాణం షురూ

తమిళనాడులోని కన్యాకుమారి ప్రాంతానికి చెందిన 29 ఏళ్ల విజయ్ వినయ్ ఆంటోనీ, 29 ఏళ్ల జె.సహాయట్ట అనీశ్, రామనాథపురానికి చెందిన 31 ఏళ్ల నిట్సో డిటోలు రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లారు. వీరి వృత్తి చేపలుపట్టడం. కువైట్‌లోనూ అదే పనిచేసేవారు. కేరళలోని త్రివేండ్రమ్ నుంచి వీరు కువైట్‌కు వెళ్లారు. యజమాని నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. భారత్‌కు రానీయకుండా వారి పాస్‌పోర్టులను దాచేశాడు. ఎలాగైనా కువైట్ నుంచి బయటపడాలని నిర్ణయించుకుని అందుకు ఓనర్ చేపల బోటును ఎంచుకున్నారు. జనవరి 28వ తేదీన ప్రయాణం మొదలెట్టి సౌదీ అరేబియా, ఖతర్, దుబాయ్, మస్కట్, ఒమన్, పాకిస్తాన్ మీదుగా భారత జలాల్లోకి ప్రవేశించారు.

రంగంలోకి నేవీ, పోలీసులు

మంగళవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ముంబైలోని యెల్లో గేట్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది అరేబియా సముద్రంలో పెట్రోలింగ్ చేపట్టారు. ససూన్ డాక్ ప్రాంతంలో వీరి రాకను గమనించారు. ఈ చేపల పడవ నిర్మాణం భారతీయ పడవలతో పోలిస్తే విభిన్నంగా ఉండటంతో అనుమానమొచ్చి అడ్డుకున్నారు. అందులోని ముగ్గురికీ మరాఠా, హిందీ అస్సలు రాకపోవడం, పొడిపొడిగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతుండటంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే నేవీ అధికారులతోపాటు పోలీసులు మూడు పడవల్లో హుటాహుటిన చేరుకున్నారు. బాంబు స్క్వాడ్ సిబ్బంది సైతం రప్పించి తనిఖీలు చేయించారు. పేలుడుపదార్థాలు ఏవీ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారంటూ పాస్‌పోర్టు సంబంధిత సెక్షన్ కింద కేసు నమోదుచేసి అరెస్ట్‌చేశారు. ముంబైలోని కోర్టులో హాజరుపరచగా ఫిబ్రవరి 10వ తేదీదాకా పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఆదేశాలిచ్చారు. విదేశీ గడ్డపై వీళ్లు ఏదైనా నేరానికి పాల్పడ్డారో తెల్సుకోండని పోలీసులకు సూచించారు.

పడవలో జీపీఎస్

స్వాధీనం చేసుకున్న పడవను బాంబు స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీచేసింది. ఒక జీపీఎస్‌ను గుర్తించారు. సువిశాల సముద్రంలో దారి తప్పకుండా ఉండేందుకు వారు జీపీఎస్‌ను ఉపయోగించి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వీళ్లను కువైట్‌కు తీసుకెళ్లిన ఏజెంట్‌ను కెప్టెన్ మదన్‌గా పోలీసులు గుర్తించారు. ''అబ్దుల్లా షరీహీద్ అనే మాస్టర్ దగ్గర పనిచేసేవాళ్లం. జీతాలు సరిగా ఇచ్చేవాడు కాదు. అదేంటని అడిగితే చితకబాదేవాడు. ఇదే విషయమై కువైట్‌లోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాం. ఇండియన్ ఎంబసీలోనూ మా గోడు వెళ్లబోసుకున్నాం. ఫలితం శూన్యం. అందుకే ఇలా పారిపోయి వచ్చాం ''అని ఈ ముగ్గురు పోలీసులకు చెప్పారు. వీళ్ల కుటుంబీలకు ఇప్పటికే వీరి రాక సమాచారం చేరవేశామని పోలీసులు వెల్లడించారు.

మోదీవి పచ్చి అబద్ధాలు: ఖర్గే

న్యూఢిల్లీ: యూపీఏ ప్రభుత్వ పనితీరుపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలన్నీ పచ్చి అబద్ధాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. పదేళ్ల పాలనలో ఆయన సర్కారు సాధించిందేమీ లేకపోవడం వల్లే ఇలా జనం దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ''కాంగ్రెస్‌పై పసలేని ఆరోపణలు, విమర్శలు తప్ప మంగళ, బుధవారాల్లో పార్లమెంటు ఉభయ సభల్లో ఆయన చేసిన ప్రసంగంలో మరేమీ లేదు. ఎన్డీఏ అంటేనే నో డేటా అవేలబుల్ (ఏ గణాంకాలూ అందుబాటులో లేవు)! రాజ్యాంగంపై నమ్మకమే లేని వ్యక్తులు దేశ స్వాతంత్ర్యం కోసం ముందుండి పోరాడిన కాంగ్రెస్‌కు దేశభక్తి గురించి నీతులు చెబుతున్నారు'' అంటూ ఎద్దేవా చేశారు. అసమర్థ పాలనతో అన్ని రంగాల్లోనూ దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారంటూ మోదీపై నిప్పులు చెరిగారు. యూపీఏ హయాంలోని అభివృద్ధికి క్రెడిట్ కొట్టేస్తున్నారు.

కాశీ, అయోధ్య.. ఇక మథుర: యోగి

లఖ్‌నవూ: మథురలో చాలాకాలంగా వివాదాల్లో నలుగుతున్న మందిర్–మసీద్ వివాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అక్కడ షాహీ ఈద్గా స్థానంలో కృష్ణునికి ఆలయం నిర్మించడంపై గట్టిగా దృష్టి సారిస్తామని సంకేతాలిచ్చారు. ''కాశీ, అయోధ్య అనంతరం ఇప్పుడిక మథుర వంతు. అక్కడ మందిరం రూపుదిద్దుకోకుంటే కృష్ణుడు కూడా ఒప్పుకునే పరిస్థితి లేదు'' అంటూ వ్యాఖ్యలు చేశారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై చర్చ ఇందుకు వేదికైంది. ''కాశీ, అయోధ్య, మథుర విషయంలో మొండితనం, రాజకీయాలు కలగలిసి ఓటు బ్యాంకు రాజకీయాలుగా మారి పరిస్థితిని సంక్లిష్టంగా మార్చేశాయి'' అంటూ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలపై విమర్శలు గుప్పించారు. మథురలో కృష్ణుని పురాతన ఆలయాన్ని కూల్చి మసీదు నిర్మించారన్న వివాదం ప్రస్తుతం కోర్టులో ఉన్న విషయం తెలిసిందే.



పేలుడు అనంతరం ఘటనాస్థలి వద్ద భీతావహ పరిస్థితి

పాక్‌లో పేలుళ్లు.. 30 మంది బలి

కరాచీ: సార్వత్రిక ఎన్నికలకు పాకిస్తాన్ సిద్ధమవుతున్న వేళ బుధవారం జంట పేలుళ్లతో పాకిస్తాన్ దద్దరిల్లింది. వేర్వేరు చోట్ల జరిగిన ఈ బాంబు పేలుడు ఘటనల్లో మొత్తంగా 25 మంది మరణించారు. 42 మంది గాయపడ్డారు. పర్వతమయమైన బలూచిస్తాన్ ప్రావిన్స్‌లోని వేర్వేరు పార్టీ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని ఈ జంట పేలుళ్లు జరిపారని స్థానిక మీడియాలో వార్తలొచ్చాయి. అయితే ఈ పేలుళ్లు జరిపింది తామేనని ఇంతవరకు ఏ ఉగ్రసంస్థ ప్రకటించుకోలేదు. తొలి పేలుడు పిషిన్ జిల్లాలోని స్వతంత్ర అభ్యర్థి అస్ఫాందర్ ఖాన్ కకర్ ఆఫీస్ బయట జరిగింది. ఈ పేలుడులో 20 మంది మరణించారు. 30 మంది గాయపడ్డారు. ఒక గంట తర్వాత కిల్లా అబ్దుల్లా ప్రాంతంలోని జమియత్ ఉలేమా ఇస్లామ్–పాకిస్తాన్ పార్టీ కార్యాలయం బయట జరిగింది. ఈ ఘటనలో పది మంది ప్రాణాలు కోల్పోయారు. ఎన్నికల ప్రక్రియల్లో పౌరుల భాగస్వామ్యాన్ని తగ్గించేందుకే ఇలా ఉగ్రవాదులు బాంబు దాడులతో భయపెడుతున్నారని బలూచిస్తాన్ పంజ్‌ఘర్ సీనియర్ పోలీసు అధికారి అబ్దుల్లా చెప్పారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బాంబుపేలుళ్ల జరగడంతో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను పటిష్టం చేశారు.

బలూచిస్తాన్‌లో పెరిగిన దాడులు

అఫ్గానిస్తాన్, ఇరాన్‌లతో సరిహద్దులు పంచుకుంటున్న పర్వతమయ బలూచిస్తాన్‌లో ఇటీవల బాంబు దాడులు ఎక్కువయ్యాయి. మంగళవారం సైతం 10 గ్రనేడ్ దాడులు జరిగాయి. వేర్వేరు ప్రావిన్స్‌లలోని భద్రతా పోస్టులు, ఎన్నికల ప్రచార కార్యాలయాలు, ర్యాలీలపై ఈ దాడులు జరిగాయి. ఆదివారం నుంచి లెక్కిస్తే ఈ సంఖ్య ఏకంగా 50కి చేరింది. చాన్నాళ్ల నుంచి బలూచిస్తాన్‌లో వేర్పేరువాద శక్తుల క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. సైన్యం ఏరివేత చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జనవరిలో 24 మంది ఉగ్రవాదులు హతమయ్యారు.

పాక్‌లో నేడే సార్వత్రిక ఎన్నికలు

ఇస్లామాబాద్: పెచ్చరిల్లిన హింస, పెట్రేగిన ఉగ్రదాడులు, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఊచలు లెక్కపెడుతున్న వేళ ఆరేళ్ల ప్రవాసం నుంచి తిరిగొచ్చిన మరో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సైన్యం దన్నుతో అధికార పగ్గాలు చేపట్టే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే 74 ఏళ్ల షరీఫ్ రికార్డుస్థాయిలో నాలుగోసారి పాక్ ప్రధాని అవుతారు. నవాజ్‌కు చెందిన పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్ పార్టీ అత్యధిక సీట్లు సాధించేలా కన్పిస్తోంది. ఇమ్రాన్ పార్టీ పీటీఐ ఎన్నికల గుర్తు క్రికెట్ బ్యాట్‌పై ఈసీ నిషేధం విధించింది. దాంతో పీటీఐ అభ్యర్థులంతా స్వతంత్రులుగా బరిలో దిగారు. బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) సైతం ఈసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. 12.85 కోట్ల ఓటర్లు ఈసారి ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకోనున్నారు. బుధవారమే బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు జంట బాంబుదాడులతో పదుల సంఖ్యలో ప్రాణాలు బలి తీసుకున్న నేపథ్యంలో 6.5 లక్షల మంది భద్రతా సిబ్బందితో పోలింగ్‌స్టేషన్ల వద్ద భద్రతను కట్టుదిట్టంచేశారు. నేషనల్ అసెంబ్లీ(పార్లమెంట్) ఎన్నికల్లో ఈసారి 5,121 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 336 సీట్లకుగాను 266 సీట్లకు బుధవారం పోలింగ్ జరగనుంది. మరో 60 సీట్లు మహిళలకు రిజర్వ్‌చేశారు. మరో 10 సీట్లు మైనారిటీలకు రిజర్వ్‌చేశారు. ఇంకొన్ని సీట్లు పార్టీలు గెలిచిన సీట్లను బట్టి దామాషా పద్ధతిలో కేటాయిస్తారు. కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ గురువారమే ఎన్నికలు జరుగుతున్నాయి.



బుధవారం ఢిల్లీ మెట్రో రైల్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మరో భారతీయ విద్యార్థి అమెరికాలో దుర్మరణం



సమీర్ కామత్

న్యూయార్క్: ఎన్నో ఆశలతో అమెరికాలో అడుగుపెడుతున్న కొందరు భారతీయ విద్యార్థుల భవిత అర్ధంతరంగా ముగిసిపోతోంది. ఆ విషాదపర్వంలో మరో ఉదంతం తాజాగా చోటుచేసుకుంది. భారతీయ మూలాలున్న విద్యార్థి సమీర్ కామత్ సోమవారం సాయంత్రం ఇండియానా రాష్ట్రంలో విగతజీవిగా కనిపించారు. 23 ఏళ్ల సమీర్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. క్రోప్స్ గ్రో ప్రాంతంలోని స్థానిక నేచర్ ప్రిసర్వ్‌లో సమీర్ మృతదేహాన్ని కనుగొన్నట్లు వారెంట్ కౌంటీ అధికారి వెల్లడించారు. పోస్ట్‌మార్టమ్ నివేదిక వచ్చాకే మరణానికి కారణాలపై అంచనాకు రాగలమన్నారు.

హైదరాబాద్ విద్యార్థిపై దాడి

అమెరికాలో భారతీయ విద్యార్థులపై దాడుల పరంపర కొనసాగుతోంది. తాజాగా హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ మజహర్ అలీ అనే విద్యార్థిపై దుండగులు దాడికి పాల్పడ్డారు. అతను ఇండియానా వెస్లియాన్ యూనివర్సిటీలో ఐటీలో మాస్టర్స్ చదువుతూ షికాగోలో నివసిస్తున్నాడు. ఈ నెల 4న ఇంటి సమీపంలో ముగ్గురు దుండగులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఇటీవల పలువురు భారత విద్యార్థులు అమెరికాలో హత్యకు గురవడం తెలిసిందే.

17న మా ముందు హాజరు కండి

ఈడీ ఫిర్యాదుపై కేజ్రీవాల్‌ను ఆదేశించిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం కుంభకోణం కేసులో ఐదుసార్లు సమన్లు ఇచ్చినా ఆప్ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విచారణకు రావడం లేదంటూ ఈడీ బుధవారం ఢిల్లీ కోర్టును ఆశ్రయించింది. దాంతో ఫిబ్రవరి 17న వ్యక్తిగతంగా తమ ఎదుట హాజరవాలని కేజ్రీవాల్‌ను ఢిల్లీ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దివ్య మల్హోత్రా ఆదేశించారు. ఈ మేరకు ఆయనకు సమన్లు జారీ చేశారు. వీటిపై చట్టపరంగా ముందుకెళ్తామని ఆప్ ప్రకటించింది.

కేసు ఫైళ్లలో కులం, మతం వద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: కేసు ఫైళ్లలో కక్షిదారుల కులం గానీ, మతం గానీ ప్రస్తావించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు బుధవారం పునరుద్ఘాటించింది. ఈ విషయంలో ఇప్పటికే జారీ చేసిన ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని రిజిస్ట్రీ అధికారులతో పాటు అన్ని కోర్టులనూ ఆదేశించింది.

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ–శరద్‌చంద్ర పవార్

శరద్ పవార్ వర్గానికి పేరును కేటాయించిన ఈసీ

న్యూఢిల్లీ: ఎన్సీపీ పేరు, పార్టీ ఎన్నికల గుర్తు అజిత్ పవార్ వర్గం పరమైన నేపథ్యంలో శరద్‌పవార్ వర్గానికి కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం కొత్త పేరు కేటాయించింది. ఈసీకి అది సూచించిన మూడు పేర్లలో 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ–శరద్‌చంద్ర పవార్' పేరును ఖరారు చేసింది. తమ ఎన్నికల గుర్తు మర్రిచెట్టు అయితే బాగుంటుందని శరద్ వర్గం భావిస్తోంది.

కలుషితాహారంతో 2,000 మందికి అస్వస్థత

ఛత్రపతి శంభాజీనగర్: మహారాష్ట్రలో నాందేడ్ జిల్లాలో కోష్టవాడీ గ్రామంలో మంగళవారం మతపర కార్యక్రమంలో కలుషిత ఆహారం తిన్న ఘటనలో 2,000 మంది ఆస్పత్రుల పాలయ్యారు. బుధవారం తెల్లవారుజామున వాంతులు, విరేచనాలతో తొలుత 150 మంది ఆస్పత్రులపాలయ్యారు. తర్వాత సంఖ్య 2,000కు చేరింది. అయితే ఇప్పటిదాకా ఎవరూ చనిపోలేదు.

సాక్షి
కరీంనగర్
గురువారం । 8 ఫిబ్రవరి । 2024



పత్తి ధర రూ.6,650

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో క్వింటాల్ పత్తి గరిష్టంగా రూ.6,650 పలికింది. మార్కెట్‌కు 83 వాహనాల్లో 758 క్వింటాళ్ల పత్తి వచ్చింది. మోడల్ ధర రూ.6,500, కనిష్ట ధర రూ.6వేలు పలికింది.



ఏర్పాట్లు పరిశీలన

విద్యానగర్: మేడారం జాతరకు కరీంనగర్ బస్‌స్టేషన్‌లో చేస్తున్న ఏర్పాట్లను ఆర్‌ఎం సుచరిత పరిశీలించింది. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా వసతులు కల్పించాలని ఆదేశించారు.

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దండి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్

కొత్తపల్లి(కరీంనగర్): ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా కొత్తపల్లి మండలం మల్కాపూర్‌ను బుధవారం సందర్శించారు. గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించారు. వీధులు, మురికికాల్వలు, మంచినీటి వనరుల శుభ్రత, తడి–పొడి చెత్త నిర్వహణపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని ఆదేశించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య సందర్శించారు. రోడ్లపై నిల్వచేసిన సామగ్రిని తొలగించాలని, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మల్కాపూర్ గ్రామాన్ని 'ప్లాస్టిక్ రహిత– ఆదర్శ' గ్రామంగా తీర్చిదిద్దుతామని తీర్మానం చేశారు. యునిసెఫ్‌ప్రాజెక్టు సమన్వకర్త కిషన్‌స్వామి, స్వచ్ఛభారత్ మిషన్ సమన్వకర్తలు రమేశ్, వేణు తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిపై వివక్ష చూపొద్దని, హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని, జాగ్రత్తలు పాటించకపోతే ఎవరికైనా సోకే ప్రమాదం ఉందని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగార్జున అన్నారు. బుధవారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, నాకో వారి సహకారంతో అవుట్ ఆఫ్ స్కూల్ యూత్ నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అసిస్టెంట్ డైరెక్టర్ జే.సేతుమాధవ్ హెచ్‌ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ సురేందర్‌రెడ్డి, నెహ్రూయువ కేంద్ర జిల్లా యువజన అధికారి ఎం.వెంకటరాంబాబు, శ్రీనివాస్, రవీందర్, శివ పాల్గొన్నారు.

'మధ్యాహ్న' బియ్యంలో పురుగులు



ముక్కిన బియ్యంలో కనిపిస్తున్న పురుగులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్ జెడ్పీ పాఠశాలకు మధ్యాహ్న భోజనం పథకం కోసం సరఫరా చేసిన బియ్యంలో పురుగులున్న విషయం గ్రామప్రత్యేక అధికారి రామకృష్ణ తనిఖీల్లో వెలుగుచూసింది. బుధవారం రామకృష్ణ పాఠశాలను సందర్శించారు. కిచెన్‌షెడ్, టాయిలెట్లను తనిఖీ చేశారు. మధ్యాహ్నభోజన బియ్యం పరిశీలించగా పురుగులున్నట్లు గుర్తించారు. గతనెలలో సరఫరా చేసిన 9క్వింటాళ్ల బియ్యంలో పురుగులున్నాయని, కొత్త బియ్యం పంపించాలని కోరుతూ ఎంఈవోకు వినతిపత్రం ఇచ్చినట్లు హెచ్‌ఎం పరబ్రహ్మమూర్తి తెలిపారు. పురుగుల బియ్యం పక్కకు పెట్టాలని, వేరే బియ్యం వాడాలని హెచ్‌ఎంకు రామకృష్ణ సూచించారు.

రైతులకు రశీదులు ఇవ్వాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో ప్రియదర్శిని

గంగాధర: రైతులు కొనుగోలు చేసే ఎరువులు, పురుగుల మందులకు దుకాణదారులు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రియదర్శిని సూచించారు. మండలంలోని ఆగ్రోస్‌రైతు సేవాకేంద్రం, మధురానగర్‌లోని కెడీసీఎంఎస్, కురిక్యాల పీఏసీఎస్ ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. ఎరువులు ఈ పాస్ ద్వారానే విక్రయించాలని తెలిపారు. ఎంఆర్‌పీ ధరకు మించి అమ్మితే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎరువులు, మందుల స్టాక్ వివరాలు రిజిష్టర్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. స్టాక్ వివరాలు బోర్డుపై సూచించాలని అన్నారు.

20 రోజులు.. 660 ఫిర్యాదులు



- సీపీ కార్యాలయానికి భూ బాధితుల క్యూ
- కబ్జాదారులపై పోలీసుల ఉక్కుపాదం
- ఇప్పటికే 4 కేసుల్లో ఏడుగురి అరెస్టు
- రోజుకు 30 దాటుతున్న దరఖాస్తుల సంఖ్య
- అత్యధిక ఆరోపణలు ప్రజాప్రతినిధులపైనే

సాక్షిప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్‌క్రైం: కరీంనగర్ నగరంతోపాటు శివారుల్లో భూకబ్జాలు పెరిగిపోతున్నాయి. అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు రావడం, స్మార్ట్‌సిటీగా ఆవిర్భవించడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీనిని అవకాశంగా తీసుకున్న కబ్జాదారులు.. ఖాళీ భూములను ఆక్రమించడం లేదా నకిలీ డాక్యుమెంట్లు చూపించి బెదిరిస్తూ రూ.కోట్లు కొట్టేస్తున్నారు. కొందరు ఓ అడుగు ముందుకేసి అడిగినంత ఇవ్వని వారిఇళ్లు బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టీములనే ఏర్పాటు చేసుకున్నారంటే అతిశయోక్తి కాదు. వీరి అరాచకాలు తారస్థాయికి చేరడంతో కమిషనరేట్‌లో సీపీ అభిషేక్ మహంతి 'ఎకనామిక్స్ అఫెన్సెస్ వింగ్ (ఈవోడబ్ల్యూ) ఏర్పాటు చేశారు. ఏసీపీ ర్యాంక్ ఆఫీసర్ దీనికి నేతృత్వం వహిస్తున్నారు. దీంతో సీపీ కార్యాలయానికి కొద్దిరోజులుగా బాధితుల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. అందులో అత్యధికంగా ప్రజాప్రతినిధులపైనే ఉంటున్నాయి. నెలరోజుల్లో భూ కబ్జాలకు సంబంధించి నాలుగు కేసులు నమోదవగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఒకటి, రూరల్ పోలీసుస్టేషన్‌లో రెండు, కొత్తపల్లిలో మరోటి నమోదైంది. ఈ కేసుల్లో ఇప్పటిదాకా ఏడుగురిని పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు. ఇందులో కొందరు బెయిల్‌పై విడుదలయ్యారు. సీపీ కార్యాలయానికి ఇప్పటిదాకా సుమారు 660 పైగానే ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. జనవరి 20 తర్వాత బాధితులపై పోలీసులు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. దీంతో రోజూ సగటున 30 మందికిపైగా బాధితులు కమిషనరేట్ గడప తొక్కుతున్నారు.

పక్కా ఆధారాలతో కోర్టుకు..

భూ కబ్జాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులు బెయిల్ మంజూరు కోసం హైదరాబాద్‌లోని లాయర్లను సంప్రదిస్తున్నారు. ఓ కార్పొరేటర్‌ను అరెస్టు చేసిన సమయంలో నాలుగు ఖరీదైన కార్లలో న్యాయవాదులు కరీంనగర్‌కు చేరుకోవడం, ఆయనకు బెయిల్ మంజూరు కోసం వారు ఎంతో శ్రమించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అయితే, పోలీసులు పక్కా ఆధారాలు, నేరాన్ని నిరూపించేందుకు కావాల్సిన డాక్యుమెంట్లు, ఇతర సాక్ష్యాలను కోర్టు ఎదుట ఉంచుతున్నారు. దీంతో నిందితులు ప్రజాప్రతినిధులైనా సరే తొలుత రిమాండ్‌కు ఆపై పోలీసు కస్టడీకి వెళ్లాల్సిన అనివార్య పరిస్థితులు నెలకొంటున్నాయని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. మొత్తానికి బెయిల్ కోసం.. నిందితులైన ప్రజాప్రతినిధుల లాయర్లకు భారీగా ఖర్చులు చేసి చేతిచమురు వదుల్చుకోవడంపై నగరంలో చర్చ సాగుతోంది.

కబ్జాదారులపై పోలీసుల కొరడా..

అమాయకుల భూములు లాక్కొనేందుకు ప్రయత్నం చేసిన వారిపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. రాజకీయ నాయకులు, చోటామోటా నేతలు, పలుకుబడి కలిగిన వారనే తేడాలు లేకుండా నిందితులపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. సీపీ అభిషేక్ మహంతి ప్రత్యేక దృష్టి సారించడంతో బాధితులకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. కబ్జాదారులకు వత్తాసు పలికి, నాయకులకు అనుకూలంగా పనిచేసిన కొందరు పోలీసు అధికారులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటూ, సరెండర్ చేస్తున్నారు. కమిషనరేట్ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారు. అలాగే గతంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని నేరుగా ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తున్నారు. పోలీసులపై రాజకీయ నాయకుల ఒత్తిడి లేకపోతే బాధితులకు ఇలా న్యాయం జరుగుతుందనే సంతోషం సర్వత్రా వ్యక్తమవుతోంది.

నగరంలోని తీగలగుట్టపల్లిలో ఓ వ్యక్తి తన భూమిలో కట్టుకున్న నిర్మాణాన్ని రాత్రి రాత్రికే కొందరు కూల్చారు. కబ్జా చేసేందుకు యత్నించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకరిని అరెస్ట్‌చేసి జైలుకు తరలించారు.

నగరంలోని రేకుర్తికి చెందిన భూ విషయంలో రూ.40 లక్షలు డిమాండ్ చేస్తూ బెదిరించారనే కారణంతో ఓ కార్పొరేటర్‌పై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అతడిపై ఇప్పటికే పలు కేసులు నమోదై ఉండడంతో కరీంనగర్ రూరల్ ఏసీపీ ఆధ్వర్యంలో రౌడీషీట్ తెరిచారు.

పోలీసుల కస్టడీకి ఇద్దరు

కరీంనగర్‌క్రైం: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, అక్రమంగా భూకబ్జాకు పాల్పడిన కేసులో అరెస్టుఅయి కరీంనగర్ జైలులో ఉన్న మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, గుంజలక్ష్మణ్‌లను కోర్టు ఆదేశాల మేరకు బుధవారం కరీంనగర్ రూరల్ పోలీసులు 24 గంటల కస్టడీకి తీసుకున్నారు. తీగలగుట్టపల్లిలోని కొమ్ము భూమయ్య, గుంజ లక్ష్మణ్‌ల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. విలువైన డాక్యుమెంట్లు, ఆధారాలు సేకరించినట్లు సమాచారం.



విచారణ చేస్తున్న కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్

ప్రజా చైతన్యం కోసమే 'గావ్ చలో అభియాన్'

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



పాలకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీ సంజయ్

హుజూరాబాద్: ప్రజలను చైతన్య పరచడం కోసమే 'గావ్ చలో అభియాన్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ వివరించారు. బుధవారం హుజూరాబాద్ మండలం రంగాపూర్‌లో 'గావ్ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తూ కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఈనెల 10 నుంచి మేడిపల్లి నుంచి ప్రజాహిత యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. 15 వరకు తొలిదశ యాత్ర పూర్తి చేస్తామని, 20 నుంచి మలిదశ యాత్ర కొనసాగిస్తామని అన్నారు. దేశమంతా మోదీ గాలి వీస్తోందని, తెలంగాణలో 17కు 17 స్థానాలు గెలుస్తామన్నారు. వినోద్ కుమార్ కరీంనగర్ ఎంపీగా ఉన్నప్పుడు ఎన్నడైనా ప్రజలను కలిశారా? పైసలు సంపాదించుకోవడం, కేసీఆర్ కుటుంబానికి దోచి పెట్టడం తప్ప సాధించిందేమిటని ప్రశ్నించారు. కరీంనగర్–వరంగల్ హైవే నిధులు ఎవరు తెచ్చారు? సిద్దిపేట–ఎల్కతుర్తి హైవే నిధులెవరు తెచ్చారు? స్మార్ట్‌సిటీ నిధులు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తే ఎందుకు నోరు విప్పలేదన్నారు. తనకు ఈటలతో విభేదాలు లేవని, పార్టీ ఆదేశాల మేరకు పనిచేయడమే తప్ప మరో ఆలోచనకు తావివ్వమని స్పష్టం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బింగి కరుణాకర్, నేరెళ్ల మహేందర్‌గౌడ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు, కుమార్ పాల్గొన్నారు.

12 నుంచి దూరవిద్య పరీక్ష ఫీజు చెల్లింపు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్ష రుసుం ఈ నెల 12నుంచి 21వరకు చెల్లించవచ్చని డీఈవో జనార్దన్‌రావు తెలిపారు. పదో తరగతి సబ్జెక్టుకు రూ.100, ఇంటర్‌కు రూ.150 చెల్లించాలన్నారు. గతంలో ఉత్తీర్ణులు కాని వారుసైతం ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.25 అపరాధ రుసుంతో ఈ నెల 27వరకు, రూ.50 అపరాధ రుసుంతో మార్చి 4వరకు ఫీజు చెల్లించవచ్చునని వివరించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కలిసిరావాలి



కాంగ్రెస్‌లో చేరుతున్న భాస్కర్‌రెడ్డి, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్

- బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాత మిత్రులు కలిసి రావాలని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఇతర పార్టీల నుంచి పోటీ చేయని పాత కాంగ్రెస్ నాయకులు తిరిగి పార్టీలోకి రావాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ పాటుపడుతుంటే, కొంతమంది మతం పేరిట, దేవుళ్ల ఫొటోలతో గెలవాలనుకుంటున్నారని విమర్శించారు. సీనియర్ నాయకుడైన భాస్కర్‌రెడ్డి, తిరిగి పార్టీలోకి రావడం సంతోషకరమన్నారు.

సొంత గూటికి ఆకారపు భాస్కర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి సొంత గూటికి చేరుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడైన ఆయన, కొన్ని సంవత్సరాల క్రితం బీఆర్‌ఎస్‌లో చేరారు. బుధవారం బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జీ రోహిత్ చౌదరి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. బీఆర్‌ఎస్‌లో సీనియర్ నాయకులకు గుర్తింపు లేదని ఆకారపు భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పురుమల్ల శ్రీనివాస్, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మేనేని రోహిత్ రావు, మూల వెంకట రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం పెంచేందుకే కులసంఘ భవనాలు

- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: కుల సంఘాల ఆత్మగౌరవం పెంచేందుకే సంఘ భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. నగరంలోని 14వ డివిజన్ గంగాపరమేశ్వర ఆలయంలో రూ.21 లక్షలతో చేపట్టిన ప్రహరీ, షటర్ల నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ దిండిగాల మహేశ్‌తో కలిసి బుధవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సహకారంతో నగరంలో కుల సంఘ భవనాలు నిర్మిస్తూ, కులాలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. రూ.1000కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో నగరాన్ని ఆధునీకరించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా నగర అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలలో నగరపాలక సంస్థకు రూ.200 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, చాడగొండ బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏవీ.రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లో ఆలయాల అభివృద్ధికి సహకరిస్తానని మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. 33వ డివిజన్ పరిధిలోని జెడ్పీ క్వార్టర్స్ సమీపంలో ఉన్న హరిహర అయ్యప్ప ఆలయాన్ని సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఆధునీకరణ పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవో కొన్న కాంతారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

బాలికలు చురుగ్గా ఉండాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



తాను గీసిన బాలిక చిత్రం వద్ద కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్, వివిధశాఖల అధికారులు

కరీంనగర్: భవిష్యత్తుకు పునాదివేసే ప్రతీ కార్యక్రమంలో బాలికలు చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని జ్యోతిబాపూలే మైదానంలో సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ గర్ల్‌చైల్డ్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో సుమారు 261మంది బాలికలు పాల్గొని వివిధ రకాల చిత్రాలు గీయగా, వారితో పాటు కలెక్టర్ సైతం బాలిక చిత్రాన్ని గీశారు. నేషనల్ గర్ల్ చైల్డ్ డే శుభాకాంక్షలు తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ వెంకటేశ్ మాట్లాడుతూ.. అమ్మాయిలు అన్ని రంగాలల్లో రాణించాలని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బాలిక సాధికారత దిశగా జిల్లాలో స్నేహిత కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. సంక్షేమ అధికారి సరస్వతి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, డీఈవో జనార్దన్‌రావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఈవీఎం ఎఫ్‌ఎల్‌సీ

కరీంనగర్ అర్బన్: ఈవీఎం యంత్రాల మొదటి స్థాయి తనిఖీ పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల క్రమంలో ఎఫ్‌ఎల్‌సీ, వెబ్ కాస్టింగ్, ఈవీఎంలు భద్రపరచడం, వెబ్ కాస్టింగ్ గదులను బుధవారం పరిశీలించారు.

రైతులు పంట మార్పిడి చేసుకోవాలి

మానకొండూర్: రైతులు పంట మార్పిడి చేసుకుని అధిక లాభాలు పొందాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. చిగురుమామిడి మండలంలోని ఆయిల్‌ఫాంను సందర్శించారు. రైతులు ఆయిల్‌ఫాం సాగు చేపట్టాలని సూచించారు. జిల్లా ఉద్యానశాఖ, పట్టు పరిశ్రమశాఖ అధికారి బండారి శ్రీనివాస్ ఆయిల్‌ఫాం పథకాన్ని గురించి కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,683 ఎకరాల్లో 98,161 మొక్కలు నాటడం జరి గిందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రీడలు మనిషిలో మానసికోల్లాసం, శారీరక శక్తిని పెంపొందిస్తాయని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమశాఖ అధ్వర్యంలో నిర్వహించిన క్రీడాపోటీలను ప్రారంభించారు. ప్రతీఒక్కరు ఏదో ఒక్క క్రీడలో రాణించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి' సర్వే షురూ..

- ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్న విద్యుత్ సిబ్బంది
- ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా పరిశీలన

కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి(కరీంనగర్): కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత కరెంట్ అమలు చేసేందుకు ముందుడుగు పడింది. ప్రజాపాలనలో భాగంగా ప్రజలు సమర్పించిన గృహజ్యోతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను విద్యుత్‌శాఖ ప్రారంభించింది. విద్యుత్ అధికారులతో పాటు సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ దరఖాస్తులో పొందుపర్చిన విద్యుత్ మీటర్ నంబర్, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్, ఎఫ్‌ఎస్‌సీ కార్డు వివరాలు తెలుసుకుంటూ వివరాలు సేకరిస్తున్నారు. మంగళవారం ప్రారంభమైన ఈ ప్రక్రియ ఫిబ్రవరి 15వ తేదీలోగా పూర్తికానుంది. విద్యుత్ సర్వీసుల పరిశీలన పూర్తయిన తర్వాత వివరాలన్నింటినీ ప్రభుత్వానికి అందిస్తారు. వాటి ఆధారంగా ఉచిత విద్యుత్ పథకం ఎప్పుడు అమలవుతుందన్న అంశం ప్రభుత్వం నిర్ణయిస్తుంది.

3,47,000 మంది వినియోగదారులు

టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలో 3,47,000మంది వినియోగదారులుండగా.. అందులో ఎఫ్‌ఎస్‌సీ కార్డు కలిగిన వినియోగదారులు ఈ గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను పొందే అవకాశం ఉంది. బుధవారం కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, దుర్శేడ్, చామనపల్లి, గోపాల్‌పూర్, నగునూరు, తీగలగుట్టపల్లిలో స్పాట్ బిల్లింగ్ సిబ్బంది సర్వే చేశారు. నగునూరులో సర్వేను కరీంనగర్‌రూరల్ డీఈ రాజం, ఏడీఈ రాజు పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా వివరాలను సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు వినియోగదారులు ఆధార్, రేషన్‌కార్డు, సెల్‌ఫోన్ నంబర్లతో పాటు ప్రజాపాలనలో చేసిన దరఖాస్తు రశీదు ఇచ్చి సహకరించాలని వారు కోరారు.



నగరంలో సర్వే చేస్తున్న విద్యుత్ సిబ్బంది

సర్వేకు సహకరించండి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహజ్యోతి పథకం అమలుకు వివరాల సేకరణ చేపట్టాం. విద్యుత్ సిబ్బంది ఇంటికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, ఎఫ్‌ఎస్‌సీ కార్డు, ఫోన్‌నంబర్ అందించి సహకరించాలి. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా విద్యుత్ సర్వీసు నంబర్‌తో పాటు తదితర వివరాలను సిబ్బంది సేకరించి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ స్కీంలో నమోదు చేస్తారు.

– వడ్లకొండ గంగాధర్, ఎస్‌ఈ కరీంనగర్ సర్కిల్

జనశక్తి మాజీ నక్సలైట్‌పై పీడీయాక్టు


కుంటయ్యకు పీడీయాక్టు ఉత్తర్వు కాపీ అందిస్తున్న సీఐ కరుణాకర్

సిరిసిల్ల క్రైం: జనశక్తి మాజీ నక్సలైట్ మానుక కుంటయ్యపై పీడీయాక్టు నమోదు చేసినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేములవాడ మండలంలోని తిప్పాపూర్‌కు చెందిన కుంటయ్య గతంలో జనశక్తి పార్టీలో పని చేసి, అనంతరం లొంగిపోయాడు. భూ వివాదాల్లో జోక్యం చేసుకుంటూ యజమానులను బెదిరించి, డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఇప్పటికే అతనిపై 8 కేసులు నమోదవగా.. తీరు మార్చుకోకపోవడంతో పోలీసులు ఇటీవల రౌడీషీట్ ఓపెన్ చేశారు. అయినప్పటికీ ప్రవర్తనలో మార్పు లేకపోవడంతో కలెక్టర్ అనురాగ్ జయంతి ఉత్తర్వులు, ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో పీడీయాక్టు అమలు చేశారు. సంబంధిత ఉత్తర్వు కాపీని సీఐ కరుణాకర్ బుధవారం కుంటయ్యకు అందించి, చర్లపల్లి జైలులో అప్పగించారు.

సారంగాపూర్ అటవీ ప్రాంతంలో మంటలు


రోడ్డు వెంట వ్యాపిస్తున్న మంటలు

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్ అటవీ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం మంటలు అంటుకొని, క్షణాల్లో వ్యాపించాయి. రోడ్డువెంట వెళ్లేవారు, పశువులు, గొర్రెల కాపరులు తాము తాగిన చుట్ట, బీడీ, సిగరెట్లను ఆర్పివేయకుండా పడేయడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి రవికుమార్ తెలిపారు. చాలా ఏళ్లుగా అడవుల్లో రోడ్ల వెంట ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి, మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తాగిన చుట్ట, బీడీ, సిగరెట్లను ఆర్పివేయాలని, ఎట్టిపరిస్థితుల్లో అడవుల్లో పడేయొద్దని కోరారు. లేకపోతే మంటలు చెలరేగి, అడవిలో ఎదుగుతున్న మొక్కలకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి


మాట్లాడుతున్న వెంకటేశం

కరీంనగర్: ప్రధాని నరేంద్ర మోదీకి దళితుల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో ఉపకులాలన్నింటినీ 'ఎ' వర్గంలో చేర్చి, సామాజిక న్యాయం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం ధర్మాసనం ముందు రాష్ట్ర ప్రభుత్వ వాదన వినిపించేందుకు మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో బృందాన్ని ఢిల్లీకి పంపినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకులు రాయిల లక్ష్మీనర్సయ్య, సిరిపాటి వేణు, బుడగజంగాల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్ గోసంగి, ఉపాధ్యక్షులు తల్వారే పరమేశ్వర్ మాంగ్, చింతల అంజి తదితరులున్నారు.

క్లుప్తంగా

డీసీఆర్బీ సీఐగా బాధ్యతలు



జగిత్యాల క్రైం: జగిత్యాల డీసీఆర్బీ సీఐగా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.

బీర్‌పూర్ మండల ప్రత్యేక అధికారిపై ఫిర్యాదు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల ప్రత్యేక అధికారి, డీఆర్డీఏ అడిషనల్ పీడీ సుధీర్‌పై ఎంపీపీ మసర్తి రమేశ్ బుధవారం సాయంత్రం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వివరాల ప్రకారం.. మండల ప్రత్యేక అధికారి ప్రభుత్వం ప్రారంభించిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలపై గ్రామాల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిపై ఎంపీపీకి కనీస సమాచారం ఇవ్వలేదు. గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలోనూ ఆహ్వానించడం లేదు. ఈ విషయమై అడుగుతున్నా తనను అవమానిస్తూనే ఉన్నారని ఎంపీపీ పేర్కొన్నారు. ప్రత్యేకాధికారిని తక్షణమే విధుల నుంచి తప్పించి, మరో అధికారికి బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

బాలిక కిడ్నాప్ కేసులో వ్యక్తికి జైలు

వేములవాడ: బాలికను కిడ్నాప్ చేసి, అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు స్పెషల్ జడ్జి ఎస్.ప్రేమలత తీర్పు చెప్పారని వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేములవాడ పట్టణానికి చెందిన యారం సాయికిరణ్ 2016 అక్టోబర్ 7న స్థానిక బాలికను కిడ్నాప్ చేసి, ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై బాధితురాలి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసి, అతన్ని రిమాండ్‌కు తరలించారు. విచారణ అధికారి ఎ.శ్రీనివాస్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సైలు శ్రీకాంత్, శ్రవణ్‌యాదవ్, కానిస్టేబుళ్లు మహేందర్, నరేందర్ 14 మంది సాక్షులను కోర్టులో హాజరుపరచగా స్పెషల్ పీపీ పెంట శ్రీనివాస్ వాదనలు వినిపించారు. న్యాయమూర్తి కేసు పూర్వాపరాలను పరిశీలించారు. నేరం రుజువు కావడంతో సాయికిరణ్‌కు బుధవారం శిక్ష ఖరారు చేశారు.

పేకాట స్థావరంపై దాడి

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని ఓ ఇంట్లో మంగళవారం రాత్రి పేకాడుతున్నారన్న సమాచారంతో సీఐ రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేపట్టారు. పేకాడుతున్న ఐదుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షలు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపైనా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వారంలో రెండు సైబర్ మోసాలు

- రూ.7.49 లక్షలు పోగొట్టుకున్న వీణవంక మండల యువకులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

వీణవంక మండలంలోని దేశాయిపల్లి శివారు ఐలబాద్ గ్రామానికి చెందిన పురంశెట్టి వెంకటేశ్ బిట్ కాయిన్‌లో భారీగా డబ్బు పోగొట్టుకున్నాడు. ఇందులో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని అతని మొబైల్‌కు గత జనవరి 27న ఓ లింక్ వచ్చింది. నమ్మిన వెంకటేశ్ రూ.6.42 లక్షలు అపరిచిత వ్యక్తికి పంపించాడు. తర్వాత ఎలాంటి సమాచారం లేకపోవడంతో మోసపోయానని గ్రహించి, 31న పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇదే మండలంలోని ఘన్ముక్కుల గ్రామానికి చెందిన వడ్లూరి రాజు క్రిప్టో కరెన్సీ మాయలో పడి, మోసపోయాడు. అమిటల్ మార్కెటింగ్‌లో జాబ్ ఉందని, పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని అతని సెల్‌ఫోన్‌కు ఓ లింక్ వచ్చింది. దీంతో అతను రూ.1.7 లక్షలు అపరిచిత వ్యక్తికి పంపించాడు. తీరా చూస్తే జాబ్ లేదు.. డబ్బులు తిరిగిరాలే. మోసపోయానని గ్రహించి, ఈ నెల 5న పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ జీవన్‌రెడ్డి

వీణవంక: మండలంలో వారం రోజుల్లో రెండు సైబర్ కేసులు నమోదవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో వీణవంక ఎస్సై వంశీకృష్ణ గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దంటూ అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ మోసగాళ్ల నుంచి లింక్‌లు వస్తే 1930 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. గ్రామీణులకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన లేకపోవడం, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చన్న ఆశతో పలువురు నష్టపోతున్నారని అంటున్నారు. బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ తదితరాలకు సంబంధించిన లింక్‌లు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో పాస్‌వర్డ్, ఓటీపీలు ఇతరులకు పంపించొద్దని చెబుతున్నారు.

ఆన్‌లైన్ పేకాటతోనూ..

ఆన్‌లైన్ పేకాట కూడా గ్రామాల్లో విచ్చలవిడిగా నడుస్తోంది. చిన్నాపెద్ద తేడా లేకుండా ఫోన్లలో పేకాడుతున్నారు. రాష్ట్రంలో దీన్ని నిషేధించినా ఇతర రాష్ట్రాల జీపీఎస్‌తో డౌన్‌లోడ్ చేసుకొని, ఆడుతున్నారని పోలీసులు చెబుతున్నారు. ఇలా వీణవంక మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు ఇటీవల రూ.లక్షకు పైగా పోగొట్టుకున్నాడని తెలిపారు.

లింక్‌లు ఓపెన్ చేయొద్దు

కొంత పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు లింక్‌లు పంపుతుంటారు. ఎట్టిపరిస్థితుల్లో వాటిని ఓపెన్ చేయొద్దు. ఆన్‌లైన్ మోసాలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఆన్‌లైన్ పేకాట ఆడి, కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకోవద్దు.

– వంశీకృష్ణ, ఎస్సై, వీణవంక

సైబర్ భద్రతపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న సైబర్ సెల్ డీఎస్పీ రంగారెడ్డి

జగిత్యాల క్రైం: సైబర్ భద్రతపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని సైబర్ సెల్ డీఎస్పీ డీవీ.రంగారెడ్డి అన్నారు. సైబర్ జాగృత దివస్‌లో భాగంగా బుధవారం జిల్లావ్యాప్తంగా సైబర్ భద్రత, నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడం ద్వారా సైబర్ నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ తదితరాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులు పిల్లలకు వివరించాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణలో ఉపాధ్యాయులు కూడా తమ పాత్ర పోషించాలన్నారు.

సైబర్ నేరాల విషయంలో జాగ్రత్త

మెట్‌పల్లి: సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలు యాప్‌ల ఆధారంగా సైబర్ నేరాలు జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. ఫోన్లకు వచ్చే ఓటీపీలను గుర్తు తెలియని వ్యక్తులకు చెప్పవద్దన్నారు. ఒకవేళ సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై చిరంజీవి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేందర్, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీ



ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ర్యాకల్‌దేవుపల్లిలో బుధవారం తెల్లవారుజామున దుండగులు 25 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరు చోరీ చేసినట్లు ఏఈ సంపత్‌కుమార్ తెలిపారు. దాని విలువ రూ.20 వేలు ఉంటుందన్నారు. కానీ, విద్యుత్ వైర్లు కట్ చేసి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. మళ్లీ కొత్తది బిగించాల్సి ఉంటుందని, ఇందుకు రూ.లక్ష వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- విషం తాగి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి
- మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు


లాస్య (ఫైల్)

సిరిసిల్లక్రైం: అత్తారింటి వేధింపులకు ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిరిసిల్లలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కేశవపూర్‌కు చెందిన బొమ్మగాని స్రవంతి(లాస్య)కి కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన రావుల నాగరాజుతో 2018లో వివాహమైంది. సిరిసిల్ల బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే రావుల నాగరాజు, లాస్యకు ఆరేళ్ల పాప, రెండేళ్ల బాబు ఉన్నారు. కానీ భార్యభర్తలిద్దరు మాత్రమే సిరిసిల్ల రాళ్లభావి వద్ద ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. కుటుంబంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. నాగరాజు మంగళవారం తన విధుల నిమిత్తం బయటకు వెళ్లాడు. అదే సమయంలో లాస్య ఇంట్లోనే ఉంది. తర్వాత కొద్ది సేపటికి విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన ఇంటి యజమాని వెంటనే నాగరాజుకు తెలిపాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న భార్యను నాగరాజు ముందుగా సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌కు తీసుకెళ్లాడు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించాడు. లాస్య అక్కడే చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. అత్తారింటి వాళ్లు కొద్ది రోజులుగా అదనంగా రూ.10 లక్షలు కట్నం తేవాలని వేధించడంతోనే తన కూతురు విషం తాగిందని మృతురాలి తండ్రి బొమ్మగాని రాజేశం ఫిర్యాదు చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతి తెలిపారు.

రైలు కిందపడి రైల్వే ఉద్యోగి మృతి


పరమేశ్వర్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): రైల్వే ఉద్యోగి మోడెం పరమేశ్వర్ (56) రైలు కిందపడి మృతి చెందారు. మంచిర్యాల్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణానికి చెందిన పరమేశ్వర్ స్థానిక రైల్వే క్వార్టర్స్‌లో ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై ఆయన మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఇంకా రాలేదు. ఆయన మృతికి గల కారణాలు తెలియలేదు. జీఆర్పీ ఎస్సై సుధాకర్ ఆదేశాలతో మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం: హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేటకు చెందిన రాజు తనకు భూ సమస్య ఉందని, పరిష్కరించాలని స్థానిక విలేకరి రమణారెడ్డిని సంప్రదించాడు. అతను రూ.3 లక్షలు, ఆ భూమిలో వంద గజాలు ఇవ్వాలన్నాడు. దీంతో రాజు ముందుగా రూ.లక్ష ఇచ్చాడు. కానీ భూ సమస్య పరిష్కరించకుండానే రమణారెడ్డి మళ్లీ డబ్బులు కావాలని అడిగాడు. అంతేకాకుండా ఈ నెల 5న రాజు చంద్రంపేట నుంచి వేములవాడ వెళ్తుండగా బెదిరించి, కులం పేరిట దూషించి, హత్యాయత్నం చేశాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న రమణారెడ్డి మంగళవారం కోర్టులో లొంగిపోగా జడ్జి ఆదేశాల మేరకు అతన్ని రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సివిల్ గొడవల్లో తలదూర్చి, బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

'వాగేశ్వరి'లో ఐసీటీ వర్క్‌షాప్ ప్రారంభం



తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో పేపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐసీటీ అకాడమీ వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. సర్టిఫికెట్ కోర్స్ ఆన్ డాటా అనలిటిక్స్‌ను ఫైనలియర్ విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ వర్క్‌షాప్ 3 వారాలు కొనసాగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎస్.శర్మ, ఐసీటీ అకాడమీ తెలంగాణ హెడ్ బి.గోపాల్ హాజరై, మాట్లాడారు. ఐటీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఇందుకు ఇలాంటి వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ కోర్సు మార్చి 21 వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్పొరేట్ రంగంలో డాటా అనలిటిక్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. టెక్నాలజీ ప్రాముఖ్యతకు అనుగుణంగా విద్యార్థులు శిక్షణ పొందాలన్నారు. కళాశాల సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, కళాశాల ఐసీటీ కో–ఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారమిత స్కూల్లో వీడ్కోలు హంగామా


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్(మానకొండూర్): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అల్గునూర్ పారమిత వరల్డ్ స్కూల్లో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకను స్వస్తి పేరిట బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాదరావు జ్యోతిప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. భవిష్యత్తులో సవాళ్లను ఎదుర్కొంటూ సమాజంలో ప్రత్యేక స్థానం సంపాదించుకోవాలని సూచించారు. పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, వినోద్‌రావు, రష్మిత, రాకేశ్, అనూకర్‌రావు, వి.యు.ఎం. ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీకర్, కో–ఆర్డినేటర్ నాగరాజు, ప్రోగ్రాం ఇన్‌చార్జి నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ బలవన్మరణం

- మృతుడిది సిద్దిపేట జిల్లా కల్లెపల్లి


కరుణాకర్ (ఫైల్)

కరీంనగర్ క్రైం: అప్పుల బాధతో ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కల్లెపల్లి గ్రామానికి చెందిన బుర్ర కరుణాకర్(44) ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం తన భార్య పావని, కుమారుడు, కూతురితో కలిసి, కరీంనగర్ వచ్చాడు. స్థానిక రాంనగర్‌లో ఉంటూ ఆటో నడుపుతున్నాడు. ఉచిత బస్సు ప్రయాణంతో గిరాకీ లేక ఆటో ఫైనాన్స్ చెల్లించలేక, అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం రాంనగర్‌లోని మార్క్‌ఫెడ్ వద్ద క్రిమిసంహారక మందు తాగి, భార్యకు ఫోన్ చేసి, విషయం చెప్పాడు. ఆమె ఆటోడ్రైవర్ల సంఘం నాయకులతో కలిసి, సంఘటన స్థలానికి వెళ్లగా అతను కింద పడిపోయి ఉన్నాడు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం: వ్యాపారంలో నష్టాలు వచ్చి, అప్పులపాలైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సాహెత్‌నగర్‌కు చెందిన అమీర్ బిన్ సుల్తాన్ జాత్ర(36) బతుకుదెరువు కోసం ఆరేళ్ల క్రితం సౌదీ వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి వ్యాపారం ప్రారంభించాడు. నష్టాలు రావడంతో అప్పులయ్యాయి. అతని కుటుంబసభ్యులు ఇంటి నుంచి రూ.6.5 లక్షలు పంపించగా మరో రూ.8 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో 6 నెలల క్రితం కరీంనగర్ వచ్చి, ఇంట్లోనే ఉంటున్నాడు. ఇక్కడే ఏదైనా వ్యాపారం పెట్టుకోవాలన్న ఆలోచనలో ఉన్నాడు. కానీ, గతంలో జరిగిన నష్టాన్ని ఆలోచిస్తూ మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన గదిలో ఉరేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పెద్దపల్లిలో ఒకరు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని అమర్‌నగర్‌కు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై రవీందర్‌రావు వివరాల ప్రకారం.. చుంచు సాయికుమార్(23) హమాలీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. తన సోదరి పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలోనన్న బెంగతో బుధవారం క్రిమిసంహార మందు తాగాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

100 గ్రాముల గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం: ఇద్దరు యువకుల వద్ద గంజాయి పట్టుకున్నట్లు కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై చీనానాయక్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం రాత్రి స్థానిక తెలంగాణచౌక్‌లో తనిఖీలు చేపట్టారు. కశ్మీర్ గడ్డకు చెందిన మాతంగి వంశీ, జ్యోతినగర్‌కు చెందిన అవునూరి వంశీ అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంటపడి, పట్టుకున్నారు. తనిఖీ చేయగా వారి వద్ద 100 గ్రాముల గంజాయి దొరికింది. తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు విచారణలో ఒప్పుకున్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి, బుధవారం కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

కొత్తపల్లి(కరీంనగర్): వీణవంక మండలంలోని చల్లూరుకు చెందిన శివరాత్రి శంకర్‌కు విద్యుత్ చౌర్యం కేసులో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీవాణి జరిమానా విధించినట్లు విద్యుత్ విజిలెన్స్ ఎస్సై నరేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శంకర్ అనుమతి లేకుండా తన ఇంటికి కరెంటు వాడుతున్నాడు. విద్యుత్ శాఖ అధికారులు పట్టుకొని, మొదటి నేరంగా భావించి, రూ.1,000 జరిమానా విధించారు. అయినా, మళ్లీ అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండగా పట్టుకొని, విజిలెన్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి, అతన్ని బుధవారం జిల్లా న్యాయస్థానంలో హాజరుపర్చగా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో జడ్జి రూ.4,224 జరిమానా చెల్లించాలని లేదంటే 3 నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారు.

15న జేఎల్ఎం అభ్యర్థులకు స్తంభం ఎక్కే పరీక్ష

కొత్తపల్లి(కరీంనగర్): టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 15న ఐదోవిడత జేఎల్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహిస్తున్నట్లు సర్కిల్ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. అభ్యర్థులకు రిజిష్టర్ పోస్టు ద్వారా కాల్ లెటర్లు పంపించామన్నారు. రానివారు సర్కిల్ ఆఫీస్‌కు వచ్చి, తీసుకోవాలని సూచించారు.

సిరిసిల్లలో చిన్నారి కిడ్నాప్ కలకలం!

- చాక్లెట్ చూపించి ఎత్తుకెళ్లే ప్రయత్నం
- చేతిని కొరికి తప్పించుకున్న వైనం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు
- సిరిసిల్లలో చర్చనీయాంశం

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పాతబస్టాండ్ సమీపంలోని ఓ పాఠశాలలో మూడో తరగతి విద్యార్థినికి చాక్లెట్ ఆశ చూపి కిడ్నాప్ చేసేందుకు యత్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాలు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివే ఎనిమిదేళ్ల చిన్నారి ఉదయం ఇంటర్‌వెల్ సమయంలో తోటి విద్యార్థులతో కలిసి తరగతిగది నుంచి బయటకొచ్చింది. తల్లిదండ్రుల మాదిరి ఒకరు పాఠశాల పరిసరాలకు చేరి చిన్నారిని రావాలంటూ చేతిలో చాక్లెట్ పట్టుకుని పిలవడంతో దగ్గరకెళ్లింది. చాక్లెట్ ఇచ్చినట్లే ఇచ్చి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించడంతో.. అప్రమత్తమైన చిన్నారి ఆ ఆగంతకుని చేతిని కొరికి స్కూల్‌లోకి పరుగెత్తింది. దీన్ని గమనించిన స్కూల్ పీఈటీ అక్కడికొచ్చిన వారిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. స్కూల్ పరిసరాల్లో సంచరించిన ఆగంతకులను పట్టుకొని పోలీసులకు అప్పజెప్పామని విద్యార్థులకు యాజమాన్యం తెలిపిందని తెలిసింది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా చిన్నారి కిడ్నాప్‌నకు యత్నం జరిగిన విషయం తమకు తెలియదని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు భయాందోళన చెందుతున్నట్లు తెలిసింది.

రేషన్ బియ్యం పట్టివేత

మానకొండూర్: అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి వరంగల్ నుంచి మహారాష్ట్రకు లారీలో రేషన్ బియ్యం తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో మానకొండూర్‌లో తనిఖీలు చేపట్టి, లారీని పట్టుకున్నారు. నిందితులు వరంగల్‌కు చెందిన తడక సతీశ్, మహారాష్ట్రకు చెందిన షేక్ అన్వర్, గణేశ్ గోడ్‌బోరేలపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

చెరువులో వృద్ధుడి మృతదేహం

రాయికల్(జగిత్యాల): పట్టణానికి చెందిన దాసరి చిన్న నర్సయ్య (70) స్థానిక జన్మయ చెరువులో శవమై కనిపించాడని ఎస్సై అజయ్ తెలిపారు. మతిస్థిమితం సరిగా లేని ఆయన ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆయన కోసం కుటుంబ సభ్యులు వెదుకుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి చెరువులో శవమై కనిపించాడని ఎస్సై పేర్కొన్నారు. చిన్న నర్సయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎలిగేడు(పెద్దపల్లి): ధూళికట్ట గ్రామానికి చెందిన కసువోజ్వల రామ్మూర్తి(50) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. రామ్మూర్తి తన కుమారుడు సుబ్రహ్మణ్యంను తీసుకుని ఈనెల 3న కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్తున్నాడు. ఈక్రమంలో సుల్తాన్‌పూర్ ఎస్సీ కాలనీ వద్ద ఎదురుగా వేగంగా వచ్చిన ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. దీంతో రామ్మూర్తి, అతడి కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకోసం వెంటనే వారిని కరీంగనర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామ్మూర్తి మంగళవారం రాత్రి మృతి చెందాడు. అతడి కుమారుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. రామ్మూర్తికి భార్య, గాయాలపాలైన సుబ్రహ్మణ్యం ఉన్నారు.

క్లుప్తంగా

బీసీల పేరుతో కవిత కొత్త నాటకం

కరీంనగర్‌కార్పొరేషన్: బీసీల పేరుతో బీఆర్ఎస్ నాయకురాలు కవిత కొత్త నాటకానికి తెరతీశారని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్ ఒక ప్రకటనలో విమర్శించారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ హయాంలో బీసీలకు చేసిందేమిటో ముందు కవిత వెల్లడించాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీలను పట్టించుకోని కవిత.. అధికారం పోగానే బీసీ రాగం ఎత్తుకున్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆర్భాటంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేతో బీసీలకు చేసిన మేలు ఏమిటో చెప్పాలని అన్నారు. కేవలం పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందడానికే బీసీ పాట పాడుతున్నారని ధ్వజమెత్తారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు 11కె.వి. కలెక్టరేట్ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని బస్టాండ్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, మార్వాడి దేవాలయం, దోబీవాడ ప్రాంతాలతో పాటు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కె.వి. ఆటోనగర్ ఫీడర్ పరిధిలోని అంబేడ్కర్ స్టేడియం, హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్, కమాన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11కె.వి. వెంకటసాయి ఫీడర్ పరిధిలోని లక్ష్మీనగర్, కేతఎస్ గార్డెన్, వాసవికాలనీ, రాఘవేంద్రనగర్, కమాన్ నుంచి హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

సీసీ రోడ్డు పరిశీలన



రోడ్డు పరిశీలిస్తున్న శ్రీలత

కొత్తపల్లి: ఆసిఫ్‌నగర్‌లో గ్రామ పంచాయతీ వర్క్ ఆర్డర్ లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా సీసీ రోడ్డు వేశారని ఎంపీటీసీ కమలమనోహర్ ఫిర్యాదు మేరకు బుధవారం డీఆర్డీవో శ్రీలత పరిశీలించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనున్నట్లు ఆమె చెప్పారు. ప్రత్యేకాధికారి రంజిత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సభ్యత, సంస్కారం లేని బీఆర్ఎస్ నాయకులు



మాట్లాడుతున్న కొరివి వేణుగోపాల్

విద్యానగర్(కరీంనగర్): ఓటమిని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. బుధవారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హరీశ్‌రావు, కవిత, కేటీఆర్, బాల్క సుమన్‌కు పూర్తిస్థాయిలో మతి భ్రమించిందన్నారు. కృష్ణా నదిపై చర్చకు రావాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్‌కు భయపడి నాన్ పార్లమెంటరీ పదాలు వాడుతూ దుషించడాన్ని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ప్రజలను, నాయకులను కేసీఆర్ తెలంగాణ యాష, భాషలో సభ్యత లేకుండా ఎలా మాట్లాడారో ప్రజలందరికి తెలుసు గనకే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి నియంత పాలనకు స్వస్తి చెప్పారన్నారు. ఓటమిపాలైన బీఆర్ఎస్ నాయకులకు ఇంకా బుద్ధి రాకపోవడం శోచనీయమని అన్నారు. బీఆర్ఎస్ పెద్దలు ఇదేవిధంగా వ్యవహరిస్తే ప్రజలు తిరుగుబాటు చేసి తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. బోయినపల్లి చంద్రయ్య, చిగిరి శ్రీధర్, బాపురెడ్డి, రామ్మూర్తి, కిషన్, గజ్జల రవి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి ప్రదానం



విష్ణుగుప్తను అభినందిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, డీఈవో

కరీంనగర్: నేషనల్ గర్ల్ చైల్డ్ డే సందర్భంగా జిల్లాస్థాయిలో విద్యార్థులకు డ్రాయింగ్ చిత్రలేఖనం కాంపిటీషన్స్‌ను జ్యోతిరావుపూలే గ్రౌండ్‌లో నిర్వహించారు. జిల్లాస్థాయి మొదటి బహుమతిని రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బి.విష్ణుగుప్త(ఆరోతరగతి)కు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో జనార్దన్‌రావు చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భద్రయ్య, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

నిలువెత్తు బంగారం

- కిటకిటలాడిన బెల్లం దుకాణాలు
- జోరుగా సాగుతున్న అమ్మకాలు
- కిలో రూ.37 నుంచి 40 వరకు..



బెల్లం తూకం వేసుకుంటున్న భక్తులు

విద్యానగర్(కరీంనగర్): గుడి లేదు.. గోపురం లేదు.. గుడి తలుపుల్లేవు.. ఆరాధించడానికి విగ్రహాల్లేవు.. అయినా తెలంగాణలోని లక్షలాది భక్తుల ఆరాధ్య వనదేవతలు సమ్మక్క, సారలమ్మ. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ప్రతి రెండు సంవత్సరాలకోసారి జాతర జరుగుతుంది. తెలంగాణ కుంభమేళా అయిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఈనెల 21 నుంచి 24 వరకు మేడారంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో జరిగే జాతరలో అమ్మవార్లను దర్శించుకొని నిలువెత్తు బంగారం సమర్పించడం ఆనవాయితీ. భక్తులు తమ సమస్యలు పోతే, అనుకున్న పనులు నెరవేరితే, కోరిన కోరికలు తీరితే, పిల్లాపాప ఇంటిల్లిపాది చల్లంగుంటే తమ ఎత్తు బంగారం సమర్పిస్తామని సమ్మక్క, సారలమ్మకు మొక్కడం ఆచారం. మాట తప్పకుండా జాతర రోజుల్లో అమ్మవార్లను దర్శించుకొని తమ ఎత్తు బంగారాన్ని(బెల్లం), కొంతమంది పంచదార, కొందరు సగం బెల్లం, సగం పంచదారను సమర్పించుకుంటారు.

నగరంలో సందడి

రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం సమ్మక్క, సారలమ్మ జాతర సందడి కరీంనగర్‌లో ప్రారంభమైంది. నగరంలోని గంజ్‌తో పాటు వివిధ వాడల్లోని బెల్లం దుకాణాలు ఎత్తు బంగారం ఇస్తామని మొక్కుకున్న వారితో కిటకిటలాడుతున్నాయి. భక్తులు బెల్లం దుకాణాల వద్దకు వచ్చి తమ ఎత్తు బంగారం తూకం వేసుకొని తీసుకెళ్తున్నారు.

ఇల్లు పూర్తయింది



ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేస్తున్నా. నేను కట్టుకున్న ఇల్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తయితే నా ఎత్తు బంగారం, చక్కెర కలిపి ఇస్తానని మొక్కుకున్న. మొక్కిన విధంగా ఇల్లు పూర్తయింది. అందుకే మొక్కు చెల్లించుకోవడానికి నాఎత్తు బంగారం, చక్కెర కొనుగోలు చేస్తున్నాం. సమ్మక్క, సారలమ్మకు సమర్పించి మొక్కు చెల్లించుకుంటా.

– రమేశ్, ఆర్టీసీ డ్రైవర్, తిరుమలనగర్, కరీంనగర్

ప్రతిసారి వెళ్తాం



మా అమ్మవాళ్ల నా చిన్నప్పటి నుంచి సమ్మక్క, సారక్క జాతరకు వెళ్లడం ఆనావయితీ. అదే ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. ఇంటిల్లిపాది మేడారం వెళ్లి సమ్మక్క, సారక్కకు శక్తికొద్ది బంగారాన్ని సమర్పిస్తాం. అమ్మవారికి బంగారం సమర్పిస్తే అంతా మంచే జరుగుతుంది.

– అవుదరి మణెమ్మ, రాంనగర్, కరీంనగర్

అమ్మకాలు బాగున్నాయి



ప్రతి జాతరకు బెల్లం అమ్మకాలు బాగుంటాయి. ఈసారి అమ్మకాలు మరీ ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడిప్పుడే అమ్మకాలు జోరందుకున్నాయి. గత జాతర కంటే ఎక్కువగా జరుగుతున్నాయి.

– పవన్‌కుమార్, లక్ష్మీభవానీ కిరాణం, శాస్త్రీరోడ్, కరీంనగర్

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

కరీంనగర్‌రూరల్: చామనపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం గడువు ఇటీవల ముగియడంతో బుధవారం గ్రామస్తులు మాజీ సర్పంచ్ బోగొండ లక్ష్మి-ఐలయ్య, ఉప సర్పంచ్ దావు నిర్మల-మహిపాల్‌రెడ్డి దంపతులతో పాటు వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు. ఐదేళ్లుగా గ్రామాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడుతూ శాలువా కప్పి సత్కరించారు. అనంతరం మాజీ సర్పంచ్ లక్ష్మి-ఐలయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు, వైద్య, అంగన్వాడీ, విద్యుత్ సిబ్బందికి సన్మానం చేశారు. మహిళలకు చీరలను కానుకగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, లైన్‌మెన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్శేడ్‌లో..

దుర్శేడ్ గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులను బుధవారం పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రత్యేక అధికారి రామకృష్ణ, కార్యదర్శి సంజీవరెడ్డి, కారోబార్ మురళి, మాజీ సర్పంచులు గాజుల వెంకటమ్మ, అంజయ్య, ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, వార్డు సభ్యులు కె.అశోక్, వెంకటేశ్వర్‌రావు, మురళి, సుజాత, వాణి, స్వప్న, రమాదేవి, సింగిల్‌విండో డైరెక్టర్ తోట తిరుపతి, కాంగ్రెస్, బీఆర్ఎస్ గ్రామ శాఖల అధ్యక్షులు హరీష్‌గౌడ్, ఎస్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌పై అవగాహన సదస్సు

కరీంనగర్‌రూరల్: నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బుధవారం రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ వారు సింజిన్, బయోకాన్ ఫౌండేషన్ లింకేజీలో భాగంగా ఉమెన్ ఇన్ స్టెమ్ ద్వారా విద్యార్థుల స్కాలర్‌షిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బిజినెస్ అసోసియేట్ ఇన్ఫర్మేషన్ అనాలిస్ట్‌లు అబోలి ఇంగల్, నీరజ సుంకర హాజరయ్యారు. బయోసైన్స్ విద్యార్థినులకు రెడ్డి లాబొరేటరీస్, భారత్ బయోటెక్, సీసీఎంబీ, బయోకాన్ తదితర ఫార్మాస్యూటికల్ సంస్థల్లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో ఇంటర్న్‌షిప్ అవకాశముంటుందని వివరించారు.

జీటీఏ క్యాలెండర్ ఆవిష్కరించిన డీఈవో



సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ సుధాకర్, మోతె చంద్రశేఖర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు గాజుల రవీందర్, లక్ష్మీపతి, నటరాజచారి, మల్లయ్య, కృష్ణమూర్తి, లింగారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

కరీంనగర్: మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో, ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్, చల్మెడ క్యాన్సర్ ఇన్సిట్యూట్ వారి సహకారంతో కరీంనగర్ టీటీడీ కల్యాణ మండపంలో ఈనెల 4నుంచి బుధవారం వరకు నిర్వహించిన మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన, నిర్ధారణ పరీక్షల శిబిరం బుధవారంతో ముగిసింది. వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి పర్యవేక్షణలో నాలుగు రోజుల పాటు పరీక్షలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు 846 మందికి పరీక్షలు చేశామని మాధవి తెలిపారు. వీటిలో పాప్స్మియర్ 486, సోనోగ్రఫీ 316, కాల్పోస్కోపి63, మామోగ్రఫీ 116 పరీక్షలు నిర్వహించడం జరిగిందని అన్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఈనెల 12న ఫలితాలకు సంబంధించిన పత్రాలు అందిస్తామని వెల్లడించారు.

కరీంనగర్‌సిటీ: కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు బుధవారం మహిళా సాధికారిక విభాగం, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిమ హాస్పిటల్ కరీంనగర్ వారిచే క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి పాల్గొని విద్యార్థులకు సర్వైకల్ క్యాన్సర్, వివిధ రకాల క్యాన్సర్లు, పాప్ స్మియర్ టెస్ట్, క్యాన్సర్ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించొచ్చని, జీవన విధానం, ఆహార అలవాట్లను తగువిధంగా మలచుకుంటే క్యాన్సర్‌ను తరిమేయొచ్చని సూచించారు.

ఓటరు జాబితా సరిచూసుకోవాలి



మాట్లాడుతున్న స్వరూపరాణి

కరీంనగర్‌కార్పొరేషన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను సరిచూసుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి బీఎల్‌వోలను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఓటరు నమోదు ప్రక్రియతో పాటు జాబితాలో చేర్పులు, మార్పులు, లోటుపాట్ల విషయంలో బీఎల్‌వోలతో చర్చించారు. ఓటరు జాబితా విషయంలో అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. నగరంలోని డివిజన్ల వారీగా ప్రాతినిథ్యం వహిస్తున్న బీఎల్‌వోలు తమ డివిజన్లలో ఓటరు జాబితా సరిగా ఉందా అనేది ముందుగా పరిశీలించుకోవాలన్నారు. ఏదైనా కుటుంబంలో ఎవరి ఓట్లయినా లేకుంటే, వేరేచోట ఉంటే అలాంటి వాటిని గుర్తించి సరిచేయాలని అన్నారు. ఫారం 7, 8ని పూర్తిస్థాయిలో పూరించి జాబితాలో మార్పులు చేర్పులున్నా, లోటుపాట్లు ఉన్నా వాటిని సరిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ నరేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వెల్కం పార్టీ

కరీంనగర్‌సిటీ: కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థుల వెల్కం పార్టీ బుధవారం అట్టహాసంగా జరిగింది. విద్యార్థులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని శాతవాహన యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఈ మనోహర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. దేశానికి యువత వెన్నుముక లాంటిదని, యువత క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడు నవనిర్మాణ భారతదేశాన్ని ఆవిష్కరించొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ రత్న గోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, లింగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, రమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మనోహర్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి



మాట్లాడుతున్న సీఐ శ్రీలత

కరీంనగర్‌క్రైం: బాధిత మహిళలు మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదులు చేయడానికి ముందుకు రావాలని కరీంనగర్ షీ టీం ఇన్‌చార్జి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీలత సూచించారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన షీ టీం అవగాహనా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. షీ టీంల ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాలలు, రద్దీ ఉండే ప్రదేశాలు, బస్టాండ్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రద్దీ ఉండే ప్రదేశాల్లో షీ టీం సిబ్బంది మఫ్టీలో ఉంటారని, మహిళలను వేధింపులకు గురి చేసే ఆకతాయిలను గుర్తించి పట్టుకుంటామని, చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వేధింపులకు గురైన వారు వెంటనే డయల్ 100 లేదా షీ టీం వాట్సాప్ నెంబర్ 8712670759లో ఫిర్యాదు చేయాలని అన్నారు. బాధిత మహిళలు లేదా సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఏఎస్ఐ విజయమణి, కళాశాల సిబ్బంది, షీ టీం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం



కరీంనగర్‌రూరల్: దుర్శేడ్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుష్పక మిత్ర సంస్థ సభ్యులు అందజేసిన 500 పుస్తకాలతో పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు బుధవారం ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యురాలు పురుమల్ల లలిత, జిల్లా విద్యాధికారి పాఠశాల ప్రహరీ పనులను ప్రారంభించారు. జెడ్పీటీసీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పరబ్రహ్మమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామప్ప ఆలయం సందర్శన

కరీంనగర్‌సిటీ: ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ఎంఏ తెలుగు విద్యార్థులు ప్రసిద్ధ యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయం సందర్శించారు. అక్కడి చారిత్రక సాంస్కృతిక విశేషాలు, శిలా శాసనాల చెక్కడాలను తెలుసుకున్నారు. కోటగుళ్లు, రామప్ప చెరువు, లక్నవరం చెరువు సందర్శించి రికార్డు చేశారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ప్రమోద్‌కుమార్, డాక్టర్ విశ్వప్రసాద్, డాక్టర్ శారద, డాక్టర్ అశోక్, డాక్టర్ చైతన్య, నిరోష, మహేశ్, వెంకటేశ్, 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

వ్యక్తిత్వ వికాసానికి వారధి ఎన్ఎస్ఎస్



కరీంనగర్‌సిటీ: విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎన్ఎస్ఎస్ వారధిగా నిలుస్తుందని శాతవాహన యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ మనోహర్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణ పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలోని గణతంత్ర దినోత్సవ కవాతులో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్, ఎస్సారార్ కళాశాల విద్యార్థిని మారుపాక కీర్తిని బుధవారం కళాశాల ఆవరణలో సన్మానించారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం మనోధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు జాతీయసేవా పథకం వేదికగా నిలుస్తుందని అన్నారు. కీర్తిని ఘనంగా సత్కరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు బి.సురేశ్ కుమార్, నాయుడు, చంద్రమౌళి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి



బొమ్మకల్ గ్రామసభలో మాట్లాడుతున్న నవీన్‌కుమార్

కరీంనగర్‌రూరల్: గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక అధికారులకు ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులందరూ సహకరించాలని బొమ్మకల్ గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ నవీన్‌కుమార్ కోరారు. బుధవారం ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా తొలిరోజున బొమ్మకల్‌లో తహసీల్దార్ నవీన్‌కుమార్, నగునూరులో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, గోపాల్‌పూర్‌లో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, చామనపల్లిలో పీఆర్ ఏఈ రమణారెడ్డి, చెర్లభూత్కూర్‌లో సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, మొగ్దుంపూర్‌లో మండల వ్యవసాయాధికారి సత్యం ఆధ్వర్యంలో గ్రామసభలను నిర్వహించారు. అయితే పలు గ్రామాల్లో పదవీకాలం ముగిసిందనే కారణంతో పలువురు మాజీ సర్పంచులు గ్రామ సభలకు గైర్హాజరు కాగా.. కొన్ని గ్రామాల్లో అందుబాటులో ఉన్న ప్రజలతో అధికారులు మొక్కుబడిగా సభలను పూర్తి చేశారు. స్వచ్ఛ గ్రామాలుగా చేసేందుకే ప్రభుత్వం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఎంపీటీసీ సభ్యులు బుర్ర తిరుపతిగౌడ్, వెంగల్‌దాసు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకటనలో జాప్యం

ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమానికి సంబంధించిన రోజువారీ పనుల షెడ్యూల్‌ను ప్రకటించడంలో ప్రభుత్వం జాప్యం చేసింది. అయితే ఎట్టకేలకు మంగళవారం రాత్రి పంచాయతీ అధికారులు షెడ్యూల్‌ను ప్రకటించారు. దీని ప్రకారం తొలిరోజు బుధవారం ప్రత్యేక అధికారుల అధ్యక్షతన అన్ని గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. ఈనెల 8న గ్రామాల్లోని అన్ని వీధులను శుభ్రం చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక సిబ్బందిని నియమించుకొని రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేయడంతో పాటు ఇరువైపులున్న పిచ్చిమొక్కలను తొలగించాలి. 9న స్వశక్తి మహిళా సంఘాలు, వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలిసి డ్రై డే నిర్వహించాలి. ఇంటింటికి తిరుగుతూ ఇంకుడు గుంతల నిర్మాణం, మరుగుదొడ్ల ఉపయోగంపై అవగాహన కల్పించాలి. 10న డ్రెయినేజీల్లోని పూడికను తొలగించాలి. తాగునీటి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతు చేయాలి. 11న తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు బావుల్లో బ్లీచింగ్ పౌడర్ కలపాలి. 12న పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, బస్ షెల్టర్లు, పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లు, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతివనాల్లోని పిచ్చిమొక్కలను తొలగించాలి. 13న గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలి. శిథిలమైన ఇళ్లను కూల్చివేయాలి. ఉపయోగంలో లేని పాడుబడిన బావులను పూడ్చివేయాలి. 14న డ్రెయినేజీల్లో దోమల నియంత్రణకు ఆయిల్‌బాల్స్ వేయడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి. 15న చివరిరోజున వారం రోజుల్లో నిర్వహించిన కార్యక్రమాలపై జిల్లాస్థాయిలో ఫొటో ప్రదర్శన నిర్వహిస్తారు. పనితీరు ఆధారంగా ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి అవార్డులను కలెక్టర్‌తో పాటు ఎంపీ, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు అందజేస్తారు.

ఆధ్యాత్మికం

రేకుర్తి జాతరకు టెండర్లు ఖరారు



టెండరులో పాల్గొన్న అధికారులు, పాటదారులు

కరీంనగర్‌కల్చరల్: రేకుర్తి సమ్మక్క, సారలమ్మ జాతరలో భాగంగా వాయిదా పడిన కొబ్బరికాయల అమ్మకాలతో పాటు జాతర ప్రాంగణంలో తడకల పందిర్లు వేసేందుకు బుధవారం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో టెండర్లు నిర్వహించారు. రెండు టెండర్లు ఖరారు కాగా.. గతం వాటితో కలిపి అన్ని అంశాలకు టెండర్ల ప్రక్రియ పూర్తయినట్లు జాతర అధికారి ఎండపెల్లి మారుతి తెలిపారు. ఏసీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పి.ఉమ, జాతర అధికారి ఎ.మారుతి, వ్యవస్థాపక చైర్మన్ పిట్టల శ్రీనివాస్, క్లర్క్ గుడికాడి శ్రీనివాస్, దేవాదాయ శాఖ సిబ్బంది, పాటదారులు తదితరులు పాల్గొన్నారు.

టెంకాయలు, పూజాసామగ్రి అమ్మకాలకు టెండర్ల ఆహ్వానం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని దేవాదాయ శాఖ పరిధి పాతబజార్ గౌరీశంకరస్వామి దేవాలయంలో టెంకాయలు, పూజాసామగ్రి అమ్మకాల హక్కుకు టెండర్ల ఆహ్వానం కోసం ఏసీ కార్యాలయం ద్వారా బుధవారం అనుమతి పొందినట్లు ఈవో వుడుతల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆలయంలో సంప్రదించి నియమావళి తెలుసుకొని ఈనెల 12న ఉదయం 10.30 గంటలకు ఆలయ కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

సీటీసీ సీఐ బదిలీ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ సీటీసీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఇ.నాగార్జునరావు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సీఐగా బదిలీ చేస్తున్నట్లు ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

6,100 పోస్టులతో డీఎస్సీ

- షెడ్యూల్ ప్రకటించిన ఏపీ ప్రభుత్వం
- నేడు టెట్‌కు, 12న డీఎస్సీకి నోటిఫికేషన్ల జారీ

సాక్షి, అమరావతి: ఏపీలో బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మొత్తం 6,100 పోస్టుల భర్తీకి డీఎస్సీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ పోస్టుల్లో 2,280 సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), 2,299 స్కూల్ అసిస్టెంట్లు (ఎస్ఏ), 1,264 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ), 215 పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్లు (పీజీటీ), 42 ప్రిన్సిపాల్ పోస్టులు ఉన్నాయి. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)తో పాటు డీఎస్సీ–2024 నోటిఫికేషన్లకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం టెట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈనెల 12న ఇవ్వనుంది. టెట్, డీఎస్సీకి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ http://cse.ap.gov.in ద్వారా చేసుకోవాలి. ఈ మేరకు బుధవారం సచివాలయంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్ వివరాలు వెల్లడించారు. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచే ఆయా పరీక్షలకు ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా స్వీకరిస్తారు. మొత్తం ప్రక్రియను పూర్తి చేసి, ఏప్రిల్ చివరి నాటికి అభ్యర్థులకు పోస్టింగ్ ఇస్తామని, వారు వచ్చే విద్యా సంవత్సరంలో బోధన కూడా చేపడతారని మంత్రి బొత్స తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక ఇప్పటివరకు 14,219 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందన్నారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. ఏపీ టెట్, డీఎస్సీ పరీక్షలు రెండింటినీ ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)గా నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఏపీ టెట్, డీఎస్సీ–2024 షెడ్యూల్..

అంశం	టెట్	డీఎస్సీ
నోటిఫికేషన్	ఫిబ్రవరి 8	12
ఫీజు చెల్లింపు	ఫిబ్రవరి 17	21 వరకు
దరఖాస్తు ప్రక్రియ	ఫిబ్రవరి 18	22 వరకు
ఆన్‌లైన్ నమూనా పరీక్ష	ఫిబ్రవరి 19	24
హాల్‌టికెట్లు	ఫిబ్రవరి 23 నుంచి	మార్చి 5 నుంచి
పరీక్ష నిర్వహణ	ఫిబ్రవరి 27 నుంచి మార్చి15	మార్చి 9 30 వరకు
ప్రాథమిక కీ	మార్చి 10	31
తుది కీ	మార్చి 13	ఏప్రిల్ 2
ఫలితాల ప్రకటన	మార్చి 14	ఏప్రిల్ 7



ఏడు రంగుల ఆంధ్ర ధనుస్సు

అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా రూ.2.86 లక్షల కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటికి ప్రాధాన్యం

ద్రవ్య, రెవెన్యూ లోటు తగ్గించే చర్యలు

నాలుగు నెలలకు రూ.88,215 కోట్ల వ్యయానికి అసెంబ్లీకి ప్రతిపాదన



'రోటి, కపడా, ఔర్ మకాన్' ఎవరు అవునన్నా, కాదన్నా ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇదో నినాదం. ప్రజలకు వీటిని సమకూర్చడం పాలకుల కనీస బాధ్యత. ఇవి అందుబాటులో ఉన్నప్పుడే ఏ కుటుంబమైనా అభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేయడానికి ఉపక్రమిస్తుంది. వీటిని విస్మరించి, గ్రాఫిక్స్‌తో ఎన్ని మేడలు కట్టినా అవి నీటి మూటలేనని చరిత్ర చెబుతోంది. ప్రజల ఆనందాన్ని, వారి బాగోగులను చూసి ఆనందించే వాడే అసలైన పాలకుడని కూడా చరిత్ర వెల్లడిస్తోంది. తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు బాసటగా నిలిచినప్పుడే ప్రజా రంజక పాలన అనిపించుకుంటుంది. విద్య, వైద్యం, వ్యవసాయం.. ఈ మూడు రంగాల్లో చేయూత అందిస్తే చాలు, ప్రజలు స్వయం సమృద్ధి దిశగా అడుగులేస్తారని విశ్వ వ్యాప్తంగా విఖ్యాత ఆర్థిక నిపుణులు నొక్కి వక్కాణిస్తుండటం తరచూ వినిపిస్తోంది. ఈ మూడు రంగాల అభ్యున్నతికే ఎన్నో దేశాలు, రాష్ట్రాలు సతమతం అవుతున్న వేళ.. ఇంతకు మించిన సంక్షేమాభివృద్ధిని సాకారం చేస్తూ మన రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. నవరత్నాల పథకాలు, సప్త స్వరాల్లాంటి థీమ్‌ల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన జీవనాన్ని అందించాలనే తపన, తాపత్రయం.. బడ్జెట్‌లో పెద్దపీట వేయడం ద్వారా కళ్లకు కడుతోంది.

రంగాల వారీగా కేటాయింపులు (రూ.కోట్లలో) ₹

రంగం	కేటాయింపు	రంగం	కేటాయింపు
విద్య	33,898	వైద్య, ఆరోగ్యం	17,916
గ్రామీణాభివృద్ధి	17,816	పట్టణాభివృద్ధి	9,546
వ్యవసాయం, అనుబంధ రంగాలు	14,236	సాగునీరు	12,038
గృహ నిర్మాణాలు	7,062	సంక్షేమం	44,668
బీసీ సంక్షేమం	29,001.31	ఎస్సీ సంక్షేమం	9,291.55
ఎస్టీ సంక్షేమం	4,133.73	మైనారిటీల సంక్షేమం	2,242.36

సంక్షేమ శకం

రూ.2,86,389.27 కోట్లతో బుగ్గన ఓటాన్ అకౌంట్ బడ్జెట్

- మన రాష్ట్రానికి ధృడమైన, ఉజ్వల భవిష్యత్తు
- ఏడు ప్రధాన అంశాలతో సీఎం జగన్ వినూత్న పాలన
- గతంలో రెవెన్యూ వృద్ధి రేటు 6 శాతం.. ఇప్పుడు 16 శాతం



ఐదేళ్లలో జీఎస్‌డీపీ వృద్ధి రేటులో 14 నుంచి 4వ స్థానానికి ఎగబాకాం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్లలో ఆర్థికాభివృద్ధితో సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పిందని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. రానున్న కాలంలో రాష్ట్రానికి ధృడమైన, ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. బుధవారం అసెంబ్లీలో రూ.2,86,389.27 కోట్లతో 2024–25 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన బుగ్గన తనకు వరుసగా ఐదేళ్లుగా ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. సమాజంలో అత్యంత బలహీనులకు ప్రాధాన్యం ఇవ్వడంలో దివంగత వైఎస్సార్ నిబద్ధత, సామాజిక న్యాయం కోసం కృషి చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అసమానతలను రూపుమాపడం, వెనుకబడిన వర్గాలకు రక్షణ, సాధికారత, నాణ్యమైన విద్య, వైద్యం, పోషణ, జీవనోపాధి కల్పించటాన్ని నైతిక బాధ్యతగా భావిస్తూ రాష్ట్ర పునర్ నిర్మాణానికి శాయశక్తులా కృషి చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఏడు అంశాలు సుపరిపాలిత ఆంధ్ర, సామర్థ్య ఆంధ్ర, మన మహిళా మహారాణుల ఆంధ్ర, అన్నపూర్ణ ఆంధ్ర, సంక్షేమాంధ్ర, సంపన్న ఆంధ్రా, భూ భద్ర ఆంధ్ర పేరుతో సీఎం జగన్ చేపట్టిన కీలక సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయంటూ రంగాల వారీగా ప్రగతిని వివరించారు. ఉదయం 11.04 గంటలకు ముహూర్తం ప్రకారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన బుగ్గన తన ప్రసంగంలో గాంధీజీ, అబ్రహాం లింకన్, కోఫీ అన్నన్, అమర్త్యసేన్, బీఆర్ అంబేడ్కర్, వివేకానందుడి సూక్తులను ఉటంకిస్తూ మధ్యాహ్నం 1.05 గంటల వరకు సుదీర్ఘంగా మాట్లాడారు. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ శాసన మండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఐదేళ్లలో 'సుపరిపాలిత ఆంధ్ర'గా..

గడప గడపకు ప్రభుత్వ సేవల ద్వారా బాధ్యతాయుత పాలన

ఎటువంటి లోపాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సీఎం జగన్ ప్రభుత్వ ఐదేళ్ల పాలనా సంస్కరణలను ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి బుగ్గన

వెలుగు జిలుగుల అన్నపూర్ణ ఆంధ్ర

ఈ 57 నెలల్లో పండుగలా మారిన వ్యవసాయ రంగం

- అడుగడుగునా అన్నదాతను చేయపట్టి నడిపించిన ప్రభుత్వం
- కొత్త పుంతలు తొక్కుతున్న వ్యవసాయ అనుబంధ రంగాలు
- వైఎస్సార్ రైతు భరోసా, ఉచిత పంటల బీమా, పెట్టుబడి సాయం

ఇదిగో.. సామర్థ్య ఆంధ్ర!

సీఎం జగన్ పాలనలో అనతి కాలంలోనే సామర్థ్య ఆంధ్రగా ఆవిర్భావం

మౌలిక వసతులతో... రాష్ట్రం సుసంపన్నం

మౌలిక సదుపాయాల కల్పనకు రూ.43,307.21 కోట్లు

ప్రజల సహకారంతో అడవుల సంరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్



సమావేశానికి హాజరైన కేటీఆర్ సర్కిల్ అధికారులు

జన్నారం: ప్రజల భాగస్వామ్యంతో అడవులను సంరక్షించాలని, అందుకు ఏర్పాట్లు చేసుకోవాలని మంచిర్యాల జిల్లా అటవీ సంరక్షణ అధికారి(డీఎఫ్ఓ) శివ్ ఆశిష్‌సింగ్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలోని టీడీసీలో కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని అటవీ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అరుణాచల్‌ప్రదేశ్ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ యోగేశ్, మధ్యప్రదేశ్ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ అలోక్‌కుమార్ హాజరయ్యారు. టైగర్‌జోన్ అభివృద్ధిపై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అధికారుల అభిప్రాయాలు సేకరించారు. అడవుల్లో గడ్డి మైదానాలు, నీటి వసతులు, ఫైర్ ప్రొటెక్షన్, సోలార్ పంపులు, నీటికుంటలు తదితర అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుని, మరింత అభివృద్ధికి చేసే చర్యలపై అడిగి తెలుసుకున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో వేసవిలో నీటి సమస్య రాకుండా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ సమావేశానికి నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా డీఎఫ్‌వో, ఆదిలాబాద్ డీఎఫ్‌వోలు రాంకిషన్‌యాదవ్, నీరజ్‌కుమార్, ప్రశాంత్‌బాజిరావ్ పాటిల్, రేంజ్ అధికారులు హఫీజొద్దీన్, గులామ్ మోయినొద్దీన్, హేమలత, శంకర్, జ్ఞానేశ్వర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. హైదరాబాద్–చంద్రపూర్ జాతీయ రహదారిని ఆనుకుని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు పక్కన సర్వేనంబర్ 112, 134, 135లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని కొందరు షెడ్లు నిర్మించారు. ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు బుధవారం పోలీసు బందోబస్తు మధ్య అక్రమ కట్టడాలను జేసీబీతో కూల్చి వేయించారు. అంతలోనే అక్కడికి చేరుకున్న కన్నాల మాజీ సర్పంచ్ జిల్లపల్లి స్వరూప, ఆమె భర్త వెంకటస్వామి అభ్యంతరం తెలుపుతూ ఆర్డీవోతో వాదనకు దిగారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని ఆర్డీవో హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆదిలక్ష్మి, ఏఎస్సైలు తిరుపతి, శిరీష, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని విక్రయిస్తే క్రిమినల్ కేసులు

బెల్లంపల్లి: ప్రభుత్వ స్థలాన్ని అమ్మినా, కొనుగోలు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో హరికృష్ణ హెచ్చరించారు. బుధవారం కన్నాల శివారు ప్రభుత్వ భూమిలో నిర్మించిన షెడ్లను తొలగించిన అనంతరం ఆయన మాట్లాడారు. భూ ఆక్రమణదారుడితోపాటు కొనుగోలు చేసిన వ్యక్తి, తాపీమేస్త్రీపై కేసులు నమోదు చేస్తామన్నారు. భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



షెడ్లను కూల్చివేస్తున్న అధికారులు

జంగుబాయి ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సభ్యులు

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని మహరాజ్‌గూడలో ఉన్న జంగుబాయి ఆలయ హుండీని బుధవారం తెలంగాణ పోలీసుల పహరా మధ్య లెక్కించారు. ఇరు రాష్ట్రాల ఆదివాసీ భక్తులు, కటోడాల మధ్య హుండీ లెక్కించగా రూ.3,64,702 ఆదాయం వచ్చింది. ఇందులో కానుకల రూపంలో రూ.1,87,501, పార్కింగ్ రూ.1,77,201 వచ్చింది. 10 తులాల వెండి, 20 ఆవులను కానుకలుగా ఇచ్చారు. తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన ఎనిమిది గోత్రాల కటోడాలు, పటేళ్లు, 40 గ్రామాల పెద్దలు, ఇరు రాష్ట్రాల ఆలయ కమిటీ సభ్యు లు పాల్గొన్నారు. ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామని కటోడాలు జాకు, దౌలత్‌రావు, బాజీ రావు, శ్యాంరావు, ఆర్ఎస్.జంగు, చందు, సీతారాం తెలిపారు.

నేడు ఓటరు జాబితా సవరణపై సమావేశం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఫొటో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం–2024పై కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు, ప్రభుత్వ సంస్థలు, శాఖల ప్రత్యేక కార్యదర్శి బి.భారతి లక్‌పతినాయక్ ఈ నెల 8న నిర్మల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా మూడో సమావేశం నిర్వహిస్తారని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి జిల్లాల ఎన్నికల అధికారులు, సహాయ, రిటర్నింగ్ ఎన్నికల అధికారులు, బూత్‌స్థాయి అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

ఆశల సాగుపై రైతన్న బెంగ



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు గోపు విజయ్‌కుమార్ రెడ్డి. శంకరపట్నం మండలం గద్దపాక గ్రామం. యాసంగిలో 22 ఎకరాలో వరి (సన్నరకం)సాగు చేశాడు. నారుమడి నుంచే మొగిపురుగు ఉధృతితో ఐదుసార్లు ఖరీదైన మందులు పిచికారీ చేశాడు. నాటు వేసిన తర్వాత ఉధృతి మరింత పెరిగింది. గత్యంతరం లేకు నెల రోజుల వ్యవధిలో మళ్లీ నాలుగుసార్లు పురుగు మందులు పిచికారీ చేసినా పంట అంతంత మాత్రమే ఉంది. ఇప్పటి వరకు ఎకరాకు రూ.10వేల చొప్పున రూ.2.20 లక్షలు మందులకే ఖర్చు చేశాడు. ఎక్కువగా దొడ్డురకం వరిపంటను పురుగు ఆశిస్తుండగా ఈసారి సన్నరకానికి సోకింది. గతేడాది యాసంగిలో పురుగు వ్యాప్తి చెందడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. ఇప్పుడు అదే పరిస్థితి తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ ఒక్క రైతేకాదు జిల్లాలో వరిసాగు చేసిన రైతులందరి దుస్థితి.



మొగిపురుగు ఉధృతిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి

- వరిని ఆశించిన మొగిపురుగు దాడి
- డిసెంబర్ 20 నుంచి 30లోపు వేసిన నాట్లపై తీవ్ర ప్రభావం
- ఇప్పటికే మందులు పిచికారీ చేసినా తగ్గని ఉధృతి
- నెల రోజులైనా వేసిన కర్ర వేసినట్టే
- రెండేళ్లుగా రైతులను వెంటాడుతున్న తెగులు
- ఆందోళనలో కరీంనగర్ జిల్లా రైతులు

వీణవంక(హుజూరాబాద్): రైతులకు మొగిపురుగు బెంగ పట్టుకొంది. నాటేసి నెల రోజులైనా పంట ఎదుగుదల లోపించింది. దీంతో రైతులు నానా తంటాలు పడుతున్నారు. పత్తి, మొక్కజొన్న పంట మందులను పిచుకారీ చేసిన ఉధృతి తగ్గడం లేదని, ఇప్పటికే కొందరు రైతులు మళ్లీ నాట్లు వేస్తున్నారు. డిసెంబర్ 20నుంచి 31వ తేదీలోపు వేసిన నాట్లపై మాత్రమే తీవ్ర ప్రభావం ఉంది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు భిన్నంగా ఉండటంతో పంట చేతికందని రైతులు వాపోతున్నారు.

నారు మడి నుంచే దాడి ...

జిల్లాలో 2.71లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్టు అధికారుల అంచనా, ఎస్సారెస్పీ నీటి విడుదల వారబందీ పద్ధతిలో ఉండటంతో సాగు కొంతమేర తగ్గింది. వానాకాలంలో చేదు అనుభవాలను దిగమింగుతూ యాసంగి సాగుకు సిద్ధమైతే నారుమడి నుంచే పురుగు ప్రభావం తీవ్రంగా ఉంది.

రెండేళ్లుగా ఇదే పరిస్థితి...

రెండేళ్లుగా మొగిపురుగుతో రైతులకు పెట్టుబడి రావడంలేదు. ఎకరాకు 40బస్తాల దిగుబడి ఆశించిన రైతులకు 20 బస్తాలు రాని పరిస్థితి. వారం రోజులుగా మంచు, వాతావరణం చల్లగా ఉండటం పురుగు మరింత వ్యాప్తి చెందుతుందని రైతులు వాపోతున్నారు. నత్రజని ఎరువులు వేసిన వెంటనే ఉధృతి మరింత పెరుగుతుంది. సూర్యరశ్మి రోజుకు 7 గంటల కంటే తక్కువగా ఉండటం, యూరియా, కాంప్లెక్సు ఎరువులు ఎక్కువగా వాడిన పొలాలో ప్రభావం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో పురుగు ప్రభావం ఉన్నట్లు సమాచారం. పంట మార్పిడి చేయకపోవడం, విచ్చల విడిగా ఎరువుల వినియోగం ప్రభావం చూపెడుతుందని కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి చెబుతున్నారు. కనీసం మూడేళ్లకోసారి పంట మార్పిడి చేయాలని, ఇతర పంటలు సాగు చేస్తే ఆదాయంతో పాటు దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు చెప్పే మాటలను రైతులు పట్టించుకోవడం లేదు. గతంలో వ్యవసాయ అధికారులు గ్రామాలలోకి వెళ్లి రైతులకు పంటల సాగు వివరించేవారు. ఇప్పుడు రైతు వేదికల్లోనే ఉంటూ గ్రామాలోకి వెళ్లి రైతులకు వివరించాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం చెల్లించాలి



ఐదెకరాల్లో నాటు వేసిన నుంచే పురుగు ప్రభావం ఉంది. ఇప్పటికే మూడుసార్లు రసాయన మందులు పిచికారీ చేసిన. నారుమడి నుంచే పురుగు ప్రభావం ఉంది. ఖరీదై న రసాయన మందులు పిచికారీ చేసిన ఫలితం లేదు. ఎకరాకు రూ.పదివేలు మందులకే పెట్టుబడిగా పెట్టాను. గత యాసంగిలో పురుగు వ్యాపించింది. రెండేళ్లుగా కోలుకోలేకపోతున్నాం, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలి. – కల్లెపు సురేందర్‌రెడ్డి, రైతు, ఎల్బాక, వీణవంక మండలం

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కనీసం మూడేళ్లకోసారి పంట మార్పిడి చేయాలి. రైతులు అప్రమత్తంగా ఉంటూ సస్యరణ చర్యలు చేపట్టాలి. నాటు వేసిన 12–15రోజుల వ్యవధిలో కార్బోఫ్యూరాన్ ఎకరాకు పది కిలోల చొప్పున ఇసుకలో కలిపి చల్లాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8కిలోల చొప్పున చల్లాలి. డిసెంబర్‌లో వేసిన నాట్లకు పురుగు ఎక్కువగా ఉంది. విచ్చల విడిగా ఎరువులను చల్లకుండా యూరియా శాతం తగ్గించాలి. – వెంకటేశ్వర్‌రావు, సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే, జమ్మికుంట

కోళ్ల మృతిపై పోలీసులకు ఫిర్యాదు

- పోస్టుమార్టం చేయించిన అధికారులు
- రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో ఘటన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వంతడ్పులలో కోళ్లకు పోస్టుమార్టం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామస్తుల వివరాలు. గ్రామానికి చెందిన ఓ మహిళ కోళ్లను పెంచుకుంటోంది. అయితే ఈనెల 4న ఒకేసారి తనకు చెందిన ఆరు కోళ్లు చనిపోయాయి. ఎవరో ఉద్దేశపూర్వకంగానే కోళ్లకు విషమిచ్చి చంపారనే అనుమానంతో కోడి యజమానురాలు ఇల్లంతకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చనిపోయిన కోళ్లకు వైద్యులతో గ్రామంలోనే పోస్టుమార్టం చేయించారు. కోళ్ల మృతి పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడం, పోస్టుమార్టం చేయడంతో చర్చనీయాంశమైంది. ఈ విషయంపై ఇల్లంతకుంట ఎస్సై డి.సుధాకర్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

10న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 10న రామడుగు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. రాణించిన క్రీడాకారులను త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 10 గంటలకు పాఠశాలలో రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 94419 25807 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



సౌమ్య కల్లూరి

* ద్విజ్



చాలామంది వృథా కాలక్షేపాలతో సమయాన్ని వ్యర్థం చేస్తుంటారు. అతి కొద్దిమంది మాత్రమే వ్యర్థాలను కూడా ఉపయుక్తంగా మలచి, తమ జీవితాన్ని కూడా అర్థవంతంగా మార్చుకుంటారు. ఆ కొద్దిమంది జాబితాలో నిలుస్తుంది సౌమ్య కల్లూరి. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వాసి అయిన సౌమ్య ముంబైలో సోషల్ ఎంటర్‌ప్రైజ్ 'ద్విజ్' అనే సంస్థను ఏర్పాటు చేసి దాని ద్వారా వాడి పడేసే డెనిమ్ దుస్తులను తిరిగి ఉపయోగించుకునేలా బ్యాగులు, టోపీలు, జ్యువెలరీ, క్లచ్‌లు, ఇతర యాక్సెసరీస్.. తయారు చేస్తోంది. ఈ పని ద్వారా 40 మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని నిథిమ్‌లో జరుగుతున్న దస్తకారి హాత్ సమితి క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన డెనిమ్ స్టాల్‌లో తన ఉత్పత్తుల ద్వారా వ్యర్థాలతో కొత్త అర్థాలను మనకు పరిచయం చేస్తోంది.

రెండోసారి మరింత కొత్తగా!

"ద్విజ్ అంటే రెండవది అని అర్థం వచ్చేలా ఈ రీయూజ్ కాన్సెప్ట్‌ను ఎంచుకున్నాను. డెనిమ్ లేదా జీన్స్ అని పిలిచే క్లాత్ చాలా గట్టిగా ఉంటుందని మనకు తెలుసు. కొంత కాలం వాడాక పాతబడి పోవడమో, బోర్ అనిపించడమో, రంగు వెలిసిందనో పిల్లలవైతే పొట్టిగా అయ్యాయనో .. ఇలా రకరకాల కారణాలతో డెనిమ్ దుస్తులను ఎవరికైనా ఇచ్చేస్తుంటారు. అవి తీసుకున్నవాళ్లు వాటిని వాడతారు అనే నమ్మకం లేదు. ఎందుకంటే, అవి వారి సైజుకు సరిపోకపోవచ్చు. వారు వాటిని చెత్తలో పడేయచ్చు. ప్రపంచమంతటా విరివిగా ఉపయోగిస్తూ, వాడి పడేసే జీన్స్‌ను తిరిగి ఉపయుక్తంగా మార్చేలా చేసిన ప్రయోగాలు మంచి ఫలితాలను ఇచ్చాయి. దీంతో 2018లో ఈ ప్రాజెక్టును 6 లక్షల రూపాయలతో ఆరంభించాను.









పర్యావరణ హితంగా..

మెకానికల్ ఇంజినీరింగ్ చేసి, ఎమ్మెస్ కోసం జర్మనీ వెళ్లాను. అక్కడ కార్బన్ ఉద్గారాలు, వ్యర్థాలపై పరిశోధన చేస్తున్నప్పుడు చాలా విషయాలు పరిశీలనకు వచ్చాయి. పర్యావరణ హితంగా ఏదైనా వర్క్ చేయాలనుకున్నాను. ఏడాదిన్నర పాటు ఉద్యోగం చేసినా నా ఆలోచనలు మాత్రం రీ సైక్లింగ్ చుట్టూతానే తిరుగుతూ ఉండేవి. వాడేసిన డెనిమ్‌పైన దృష్టి మళ్లి వాటిని సేకరించడం మొదలుపెట్టాను. వాడేసిన వాటర్ బాటిల్స్‌ను సేకరించి, రీ సైకిల్ చేసి, బ్యాగ్ లోపలి వైపు వచ్చేలా డిజైన్ చేశాను. దీనివల్ల ఏదైనా పదార్థాన్ని బ్యాగ్‌లో తీసుకెళుతున్నప్పుడు డబ్బా మూతలు లీక్ అయినా సమస్య ఉండదు. ఈ బ్యాగ్‌లు ఎక్కడా పాతవిగా అనిపించవు. మొదటిసారి వాడుతున్నట్టుగానే ఉంటాయి. ఈ తరం కోరుకునే బ్యాక్ ప్యాక్స్, క్లచ్‌లు, ల్యాప్‌టాప్ బ్యాగ్‌లు.. కూడా మా దగ్గర అందుబాటులో ఉన్నాయి.

చిన్న పీస్‌ను కూడా వదలం

వాడేసిన జీన్స్‌ను సెకండ్ హ్యాండ్ మార్కెట్లో బల్క్‌లో కొనుగోలు చేస్తాం. కొందరు నేరుగా వచ్చి డొనేట్ చేస్తారు. ముందు వాటిని శుభ్రం చేయిస్తాం. ఆ తర్వాత వాటి సైజ్, షేడ్, సన్నం, మందం.. క్లాత్‌ని బట్టి దేనిని ఎలా మలచాలి అనే ఆలోచనకు వస్తాం. పదిమంది ఫుల్ టైమ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. 30మంది మహిళలు వాళ్ల ఇంటి నుంచే పని చేస్తారు. బాగా మందంగా ఉండి, పెద్ద పెద్ద జీన్స్ వస్తే వాటిని బ్యాగ్‌లుగా తయారు చేస్తాం. కొంచెం మీడియం సైజు వాటితో చిన్న బ్యాగ్స్,. పలుచటి, చిరిగిన జీన్స్‌తో హ్యాండ్‌మేడ్ జ్యువెలరీ తయారు చేస్తాం. ఇంకా, బొమ్మలు, ఎంబ్రాయిడరీ చేసి హోమ్ డెకార్ ఐటమ్స్ కూడా ఇందులో ఉంటాయి. మా దగ్గరకు వచ్చిన జీన్స్‌లో చిన్న ముక్కను కూడా వృథాగా పోనివ్వం. ఈ రోజుల్లో పర్యావరణం ఎలా ఉంటుందో చూస్తున్నాం. కాలానుగుణంగా వర్షాలు పడవు, భూతాపం పెరిగిపోతుంటుంది. కాలుష్యం కంపెనీల నుంచో, వాహనాల నుంచో వస్తుందనే అనుకుంటాం. కానీ, మనం రోజూ వాడే బట్టలు కూడా కాలుష్యానికి పెద్ద కారకం. ఈ సమస్య నివారణకు చేసిన చిన్న ప్రయత్నమే ద్విజ్.

> మీ దగ్గర ఉపయోగించని జీన్స్ ఉంటే, వాటిని తీసుకువచ్చి ఈ నెల 11వ తేదీ వరకు హైదరాబాద్‌లోని నిథిమ్‌లో జరిగే దస్తకారీ హాత్ సమితి హ్యాండ్‌క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లోని మా స్టాల్‌లో ఇవ్వచ్చు. లేదంటే, మీరే సేకరించి 'ద్విజ్' అప్ సైకిల్డ్ ఇండియా అడ్రస్‌కు తెలియజేయవచ్చు. ద్విజ్ పేరుతో మా వెబ్‌సైట్ ఉంది. అందులో పూర్తి వివరాలు ఉంటాయి.

స్వచ్ఛంద సంస్థలతో కలిసి

మిషన్ గ్రీన్ ముంబయ్ స్వచ్ఛంద సంస్థతో కలిసి ప్రభుత్వ స్కూల్ పిల్లలకు హ్యాండ్ బ్యాగ్‌లను కానుకగా ఇచ్చాం. దీని ద్వారా అటు చదువుకునే పిల్లలనూ, ఇటు ఈ పనిలో భాగం పంచుకుంటున్న మహిళలనూ ప్రోత్సహిస్తున్నాం. అనిమేథ్ చారిటబుల్ ట్రస్ట్ వారితో కలిసి మహిళలకు డెనిమ్ రీ యూజ్ ప్రాజెక్ట్‌లో భాగంగా వర్క్‌షాప్స్ ఏర్పాటు చేసి, శిక్షణ ఇస్తున్నాం. 2022లో సర్వోదయ ట్రస్ట్ ద్వారా తెలంగాణలోని వికారాబాద్ ప్రభుత్వ పాఠశాల పిల్లలకు హ్యాండ్ బ్యాగ్‌లను కానుకగా ఇచ్చాం. ఇండియా మొత్తంలో క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్స్ ఎక్కడ జరిగినా అక్కడ మా స్టాల్ ఏర్పాటుకు కృషి చేస్తుంటాం. దీనికి విడిగా షాప్ అంటూ ఏమీ లేదు. ఆన్‌లైన్ మార్కెటింగ్ చేస్తుంటాం" అని వివరిస్తారు సౌమ్య.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: అనిల్ కుమార్ మోర్ల

కిచెన్‌టిప్స్



● యాపిల్‌ను కట్ చేసి, ఆ ముక్కలను ప్లేట్‌లో అమర్చి సర్వ్ చేసే లోపే ముక్కలు రంగు మారుతుంటాయి. కాబట్టి కట్ చేసిన వెంటనే ఆ ముక్కల మీద నిమ్మరసం చల్లితే ముక్కలు తాజాగా ఉంటాయి. చాకును నిమ్మరసంలో ముంచి కట్ చేయడం కూడా మంచి ఫలితాన్నిస్తుంది.





● కొత్తిమీరను పలుచని క్లాత్ బ్యాగ్‌లో పెట్టి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచితే ఆకులు ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.

● పకోడీలు మెత్తబడకుండా ఎక్కువ సేపు కరకరలాడుతూ ఉండాలంటే పావు కేజీ శనగపిండిలో గుప్పెడు మొక్కజొన్న పిండి కలపాలి.

● పూరీలు నూనె తక్కువ పీల్చుకుని, పొంగి కరకరలాడాలంటే పూరీలు వత్తేటప్పుడు బియ్యప్పిండి చల్లుకోవాలి.

● కూరగాయలను తొక్క తీసి, తరిగిన తర్వాత నీటిలో శుభ్రం చేస్తే అందులోని పోషకాలు నీటిలో కరిగిపోతాయి. ముఖ్యంగా నీటిలో కరిగే విటమిన్‌లను నష్టపోతాం. కాబట్టి తొక్క తీయడమైనా, తరగడమైనా నీటితో శుభ్రం చేసిన తర్వాత మాత్రమే చేయాలి. అలాగే తరి



గిన వెంటనే వండాలి. పై నియమాన్ని వంకాయలకు పాటించడం కష్టం. ఎందుకంటే తరిగిన వెంటనే నీటిలో వేయకపోతే వంకాయ ముక్కలు నల్లబడడంతోపాటు చేదుగా మారతాయి. కాబట్టి ముందుగా వంకాయలను ఉప్పు నీటిలో కడిగి ఆ తర్వాత తరిగి మళ్లీ నీటిలో వేయాలి.



జెఎల్‌ఎఫ్ 2024

'క్షమించకపోతే మీరు గతంలోనే ఉండిపోతారు' అంటారు సాధ్వి భగవతి సరస్వతి. అమెరికాలో పుట్టి పెరిగిన ఈ యూదురాలు పాతికేళ్లుగా హృషికేశ్‌లో జీవిస్తూ ఆధ్యాత్మికత సాధన చేయడమే కాదు సామాజిక సేవలో విశేష గుర్తింపు పొందారు. 'ఆధునిక జీవితంలో పరుగు పెడుతున్నవారు ఆనందాలంటే ఏమిటో సరిగ్గా నిర్వచించుకోవాలి' అన్నారామె. 'హాలీవుడ్ టు హిమాలయాస్' పేరుతో వెలువడి బెస్ట్ సెల్లర్‌గా నిలిచిన తన ఆత్మకథ గురించి 'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో మాట్లాడారు.

హాలీవుడ్ టు హిమాలయాస్

ఆమె ఒక కథతో మొదలెట్టింది. 'ఒక ఊరిలో కోతుల బెడద ఎక్కువైంది. వాటిని పట్టుకుని అడవిలో వదిలిపెట్టాలి. ఏం చేశారంటే కొబ్బరి బోండాలకి కోతి చేయి పట్టేంత చిన్న చిల్లి చేసి వాటిలో కోతులకు ఇష్టమైన హల్వాను పెట్టారు. కోతులు ఆ హల్వా కోసం లోపలికి చేయి పెట్టి పిడికిలి బిగిస్తాయి. కాని చేయి బయటకు రాదు. కొబ్బరి బోండాంలో ఇరుక్కున్న చేతితో అది ఎక్కువ దూరం పోలేదు. అప్పుడు దానిని పట్టుకుని అడవిలో సులభంగా వదలొచ్చు. ఇక్కడ తెలుసుకోవాల్సిందేమంటే కోతి గనక పిడికిలి వదిలేస్తే చేయి బయటకు వచ్చేస్తుంది. కాని అది వదలదు. హల్వా కావాలి దానికి. మనిషి కూడా అంతే. తనే వెళ్లి జంజాటాల్లో చిక్కుకుంటాడు. పిడికిలి వదిలితే శాంతి పొందుతాడు' అందామె.

హృషికేశ్‌లోని గంగానది ఒడ్డున పరమార్థ్ ఆశ్రమ్‌లో గత పాతికేళ్లుగా జీవిస్తున్న సాధ్వి భగవతి సరస్వతి నిజానికి భారతీయురాలు కాదు. భారతదేశంతో ఏ సంబంధమూ లేదు. ఆమె అమెరికాలో జన్మించిన యూదురాలు (అసలు పేరు చెప్పదు). స్టాన్‌ఫర్డ్ యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్ చేసి ఆ తర్వాత సైకాలజీలో పీహెచ్‌డీ చేసింది. హాలీవుడ్ ఉండే లాస్ ఏంజెలిస్‌లో ఎక్కువ కాలం నివసించిన ఆమె హాలీవుడ్‌లో పని చేసింది కూడా. కాని 1997లో భర్తతో కలిసి తొలిసారి ఇక్కడకు వచ్చినప్పుడు గంగానది చూసి ఆమె పొందిన ప్రశాంతత అంతా ఇంతా కాదు. ప్రశాంతమైన జీవన విధానం భారతీయ తత్త్వ చింతనలో ఉందని విశ్వసించి అప్పటి నుంచి ఇక్కడే ఉండిపోయింది. విచిత్రమేమంటే ఈ దేశ జీవన విధానాన్ని మరచి ఆధునికవేగంలో కూరుకుపోయిన వారికి ఆమె పరిష్కార మార్గాలు బోధిస్తున్నది.



'జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్'లో మాట్లాడుతున్న సాధ్వి భగవతి సరస్వతి

సంతోషానికి నిర్వచనం ఏమిటి?

'బిడ్డ పుట్టినప్పటి నుంచి తల్లిదండ్రులు ఆ బిడ్డ సంతోషంగా ఉండాలంటే ఏం చేయాలో చెబుతుంటారు. బాగా చదవాలి, బాగా మార్కులు తెచ్చుకోవాలి, ఈ కోర్సులోనే చేరాలి, ఈ దేశమే వెళ్లాలి, ఫలానా విధంగా పెళ్లి చేసుకోవాలి, ఫలానా విధంగా డబ్బు వెనకేసుకోవాలి... ఇంత ప్రయాస పడితే తప్ప మనిషి సంతోషంగా ఉండలేడన్న భావన తలలో నిండిపోయి ఉంది. అయితే డబ్బు ఎక్కువగా ఉంటే సంతోషంగా ఉండగలమా? సంతృప్తిగా జీవించడంలో సంతోషం ఉంది. జీవితంలో అనుక్షణం సంతోషం పొందడం నేర్చుకోవడం లేదు. ఎప్పుడో ఏదో సంతోషం దొరుకుతుందనే తాపత్రయంతో ఈ క్షణంలోని సంతోషం పొందకుండా మనిషి పరిగెడుతున్నాడు' అంటుందామె.

హాలీవుడ్‌ను వదిలి

సాధారణంగా చాలామంది అమెరికాలో స్థిరపడి సంతోషకరమైన జీవితం గడపాలనుకుంటారు. కాని సాధ్వి భగవతి అమెరికాను విడిచి గంగానది ఒడ్డున ప్రశాంతంగా జీవించడంలో సంతోషం ఉందని ఇక్కడ ఉండిపోయింది. 'నా భర్త నాకు భారతదేశం గురించి చెప్పాడు. అతనే నన్ను ఇక్కడకు తీసుకొచ్చాడు. కానీ ఒక్కసారి ఇక్కడ గంగానదిని చూశాక, గురువును పొందాక ఇక ఎక్కడికీ వెళ్లకూడదనుకుని ఉండిపోయాను' అని తెలిపిందామె. ఆధునిక జీవితం నుంచి ఆధ్యాత్మిక జీవనంలో తాను ఎందుకు, ఎలా ప్రయాణించిందో తెలిపే ఆత్మకథను 'హాలీవుడ్ టు హిమాలయాస్' పేరుతో రాసిందామె. అది బెస్ట్ సెల్లర్‌గా ఉంది. గత పాతిక సంవత్సరాలుగా హిమాలయాల్లో పేదవారి కోసం సామాజిక సేవ చేస్తున్నదామె. అందుకే అమెరికా ప్రెసిడెంట్ బైడన్ ఆమెను 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు'తో గౌరవించాడు.

ఆ పిల్లల కళ్లల్లో నిశ్చింత

'హిమాలయాలకు మొదటిసారి వచ్చినప్పుడు ఇక్కడ ఒంటి మీద చొక్కా లేకపోయినా పిల్లల కళ్లల్లో నిశ్చింత చూశాను. లాస్ ఏంజిలస్‌లో అలాంటి నిశ్చింతతో పిల్లలు ఉండరు. ఆ నిశ్చింత, సంతోషం ఎందుకు పోగొట్టుకుంటున్నాం మనం? ఫిర్యాదులు, ప్రతీకారం, క్షమించకపోవడం... మనల్ని ముందుకు పోనీకుండా చేస్తాయి. ఎదుటివాళ్లు చేసిన తప్పులను మనం అంగీకరించకపోవచ్చు. కాని వాటిని దాటి ముందుకెళ్లాలంటే క్షమించడమే మార్గం. లేదంటే మనం గతంలోనే కూరుకుపోతాం. జీవితానికి ఏం మేలు చేస్తున్నావన్నది కాదు... జీవితం ద్వారా ఏం మేలు పొందుతున్నావన్నదే ముఖ్యం' అన్నారామె.

ఇంటర్వ్యూ:
జైపూర్ నుంచి 'సాక్షి' ప్రతినిధి

కొత్త జీవితం

ఎడారి చీకటి నుంచి వెన్నెల వెలుగులోకి...

'మీ బిడ్డ నాలుగు-అయిదు సంవత్సరాలకు మించి బతకడు' అని వైద్యులు చెప్పినప్పుడు ఎత్తైన చోటు నుంచి చీకటిలోయల్లో పడిపోయినట్లు తల్లడిల్లి పోయింది మౌష్మి కపాడియా. మూడు సంవత్సరాలు డిప్రెషన్ చీకట్లో కూరుకుపోయిన మౌష్మి ఒక్కొక్క అడుగు వేస్తూ వెలుగుదారిలోకి వచ్చింది. ఆట-పాటలతో తనలో ఉత్సాహాన్ని నింపుకొంది. ఆ ఉత్సాహాన్ని శక్తి చేసుకుంది. బైకర్‌గా దేశాన్ని చుట్టి వచ్చింది. ట్రెక్కర్‌గా ఎన్నో సాహసాలు చేసింది. ఇంటి గడప దాటలేడు అనుకున్న కుమారుడికి ప్రపంచం చూపుతూ ఉత్సాహాన్ని, శక్తిని ఇస్తోంది మౌష్మి కపాడియా...

మౌష్మి కపాడియా కుమారుడు వేదాన్ష్‌కు రిజిడ్ స్పైన్ మస్క్యులార్ డిస్ట్రఫీ(ఆర్‌ఎస్‌ఎమ్‌డీ) అని నిర్ధారించిన వైద్యులు 'ఇది నయం చేయలేని వ్యాధి' అన్నారు.

ఆ బాధ మాటలకు అందనిది. తట్టుకోలేనిది.

తనలో తాను ఎంతో కుమిలిపోయింది మౌష్మి.

పిల్లాడికి సంబంధించి ఏం చేయాలి? ఏం చేయకూడదు, ఎలా కేర్ తీసుకోవాలో వివరించారు వైద్యులు. వేదాన్ష్‌ను తీసుకొని దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్న భర్త ప్రియేష్ దగ్గరకు వెళ్లింది. మూడేళ్ల వయసులో వేదాన్ష్ న్యుమోనియా ఎటాక్‌కు గురయ్యాడు. ఐసీయూలో ఉన్న తన బిడ్డను చూసి కుప్పకూలిపోయింది మౌష్మి. ఆ భయానకమైన రోజు ఇప్పటికీ తన కళ్లముందే కదలాడుతున్నట్టు ఉంటుంది.

బిడ్డ పరిస్థితి ఎలా ఉండబోతుందో తెలియదు. తాను చేయగలిగిందల్లా దూరం నుంచి బిడ్డను చూస్తూ మనసులో ఏడ్వడం మాత్రమే.

ఆశ కోల్పోయిన వైద్యులు...

'దేవుడిని ప్రార్థించండి. మేము మా వంతు ప్రయత్నం చేశాం' అన్నారు. ఈ మాటలు తనను మరింత కృంగిపోయేలా చేశాయి.

వెంటిలేటర్‌పై అయిదురోజులు ఉన్నాడు వేదాన్ష్. ఆ హాస్పిటల్‌లో పనిచేసే డాక్టర్ ఒకరు మెరుగైన చికిత్స కోసం ఇండియాకు వెళితే మంచిది అని సలహా ఇచ్చాడు. అతడి సలహా ప్రకారం బిడ్డను తీసుకొని భర్తతో కలిసి ముంబైకి వచ్చింది మౌష్మి.

అబ్బాయిని ఇంటికి తీసుకువెళ్లిన రోజును గుర్తు తెచ్చుకుంటే ఇప్పటికీ వణికిపోతుంది మౌష్మి.

'ఇరవై ఏళ్ల క్రితం దుబాయ్‌లో వైద్యసదుపాయాలు అంత బాగాలేవు. శ్వాస తీసుకోవడానికి అవసరమైన ప్రత్యేక యంత్రాలు లేవు' అని దుబాయ్‌లో ఆనాటి పరిస్థితులను గుర్తు తెచ్చుకుంటుంది మౌష్మి.

ముంబైలోని హాస్పిటల్‌లో కొన్నిరోజులు ఉన్న తరువాత వేదాన్ష్ పరిస్థితి మెరుగుపడింది.

ఆశాదీపం ఏదో కనిపించి ఆ క్షణంలో ధైర్యం ఇచ్చింది. అయితే వైద్యులు మాత్రం... 'నాలుగు-అయిదు సంవత్సరాలకు మించి బతకడు' అని చెప్పారు.

బలహీనమైన ఊపిరితిత్తుల వల్ల వేదాన్ష్ ఎన్నోసార్లు నిమోనియా బారిన పడ్డాడు. 'ఇంటి నుంచి ఆస్పత్రి-ఆస్పత్రి నుంచి ఇంటికి' అన్నట్లు ఉండేది పరిస్థితి. కొంత కాలం తరువాత మరో బిడ్డకు జన్మనిచ్చింది మౌష్మి. ఇది మౌష్మి జీవితాన్ని మరింత కష్టాల్లోకి నెట్టింది. డిప్రెషన్ అనే చీకట్లోకి తీసుకెళ్లింది.

'అకారణంగా కోపం వచ్చేది. చీటికిమాటికి చిరాకు పడేదాన్ని. తలుపులు గట్టిగా వేసేదాన్ని. నేను డిప్రెషన్‌లో ఉన్నాను అనే విషయం అప్పుడు తెలియదు. ఇలా ఎందుకు చేస్తున్నాను? అని నా గురించి నేను ఆలోచించే పరిస్థితిలో లేను. ఆ సమయంలో నా ఫ్రెండ్ ఒకరు కౌన్సిలింగ్‌కు వెళ్లమని సలహా ఇచ్చారు' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మౌష్మి.

అయితే మందుల ప్రభావంతో ఆమె బరువు పెరిగింది. ఆ బరువు మోకాళ్లపై ప్రతికూల ప్రభావం చూపింది.



వేదాన్ష్

కుమారుడితో మౌష్మి కపాడియా



సాహసాలకు సై



'ఫిజికల్ యాక్టివిటీ ఉండాలి' అని చెప్పారు వైద్యులు. అలా తన ఫిట్‌నెస్ జర్నీ మొదలైంది. కొత్త జీవితానికి మొదటి అడుగు పడింది. తనకు ఇష్టమైన టెన్నిస్ ఆడడం మొదలు పెట్టింది. ఆడుతున్న సమయంలో తన మూడ్ చేంజ్ అవుతున్నట్లు, ఉత్సాహం వచ్చి చేరుతున్నట్లు అనిపించింది. జుంబా క్లాసులలో కూడా చేరి మరింత ఉత్సాహాన్ని పెంచుకుంది.

మూడేళ్లపాటు డిప్రెషన్‌తో పోరాడి బయట పడిన మౌష్మి ఇద్దరు బిడ్డలను కంటి పాపల్లా చూసుకోవాలనుకుంది. 'గత చేదు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రపంచంలోని బెస్ట్ మామ్ కావాలనుకున్నాను' అని గతాన్ని గుర్తు తెచ్చుకుంటుంది మౌష్మి.

మూడు సంవత్సరాలుగా తనను వెంటాడిన నిరాశానిస్పృహలు, విషాదం కోపం లాంటి వాటి నుంచి బయటపడిన తరువాత పిల్లలతో హాయిగా గడిపే కాలం, పిల్లలే నా ప్రపంచం అనే కల కన్నది.

బైక్‌పై దేశాన్ని చుట్టి రావాలి... ఎత్తైన పర్వతశిఖరాలను అధిరోహించాలి అనేది తన కల.

పీడకలలాంటి జీవితం నుంచి బయటపడ్డ మౌష్మి కపాడియా తన కలను నిజం చేసుకుంది. పర్వతారోహణకు సంబంధించి ఎన్నో సాహసాలు చేసింది. ఇంటికే పరిమితం అవుతాడనుకున్న వేదాన్ష్‌కు ప్రపంచాన్ని చూపింది. 'విషాదం తప్ప అతడికి తోడు ఏదీ లేదు' అని ఇతరులు సానుభూతి చూపే సమయంలో 'నిరంతరం ఆనందమే నా బలం' అని ధైర్యంగా ముందుకువెళ్లేలా చేసింది. బిడ్డతో కలిసి 21 దేశాలకు వెళ్లి వచ్చిన మౌష్మి కపాడియా ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకుంది.



రెండో సీడ్ జోడీకి అనిరుధ్ ద్వయం షాక్

డాలస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ పురుషుల డబుల్స్ విభాగంలో సంచలన విజయంతో శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో అనిరుధ్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) ద్వయం 6-4, 7-6 (7/2)తో రెండో సీడ్ నథానియల్ లామోన్స్-జాక్సన్ వి‌త్రో (అమెరికా) జంటకు షాక్ ఇచ్చింది. 85 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అనిరుధ్ జోడీ మూడు ఏస్‌లు సంధించి, ఒకసారి ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసింది.



భారత ట్రాప్ షూటర్లకు నిరాశ

ప్రపంచకప్ షాట్‌గన్ షూటింగ్ టోర్నీలో తొలిరోజు భారత షూటర్లకు నిరాశ ఎదురైంది. మొరాకోలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల, పురుషుల ట్రాప్ వ్యక్తిగత విభాగాల్లో భారత షూటర్లెవరూ ఫైనల్‌కు చేరుకోలేకపోయారు. మహిళల ట్రాప్ క్వాలిఫయింగ్‌లో రాజేశ్వరి 113 పాయింట్లతో 8వ ర్యాంక్‌లో నిలిచింది. టాప్-6లో నిలిచినవారు ఫైనల్ చేరుకుంటారు. భారత్‌కే చెందిన భవ్య 19వ ర్యాంక్‌లో, మనీషా 24వ ర్యాంక్‌లో నిలిచారు. పురుషుల ట్రాప్ క్వాలిఫయింగ్‌లో భౌనీష్ 17వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.



పోరాడి ఓడిన రష్మిక

సాక్షి, హైదరాబాద్: ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. ముంబైలో బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 520వ ర్యాంకర్ రష్మిక 7-5, 4-6, 4-6తో రష్యా టీనేజర్, ప్రపంచ 134వ ర్యాంకర్ అలీనా కోర్నీవా చేతిలో పోరాడి ఓడిపోయింది. 2 గంటల 24 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఐదు ఏస్‌లు సంధించి, ఏకంగా 14 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. మరో వైపు డబుల్స్ తొలి రౌండ్‌లో సహజ యామలపల్లి-వైష్ణవి (భారత్) జోడీ 3-6, 6-7 (1/7)తో రెండో సీడ్ సబ్రీనా (అమెరికా)-దలీలా జకుపోవిచ్ (స్లొవేనియా) జంట చేతిలో ఓటమి చవిచూసింది.

భారత్‌కు మూడో ఓటమి



భువనేశ్వర్: మహిళల ప్రొ లీగ్ హాకీ టోర్నీలో సొంత గడ్డపై భారత జట్టుకు వరుసగా మూడో పరాజయం ఎదురైంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 0-3 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓటమి చవిచూసింది. ఆస్ట్రేలియా తరఫున గ్రేస్ స్టీవర్ట్ (19వ ని.లో), టాటుమ్ స్టీవర్ట్ (23వ ని.లో), కైట్లిన్ నాబ్స్ (55వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. శుక్రవారం జరిగే మ్యాచ్‌లో అమెరికాతో భారత్ ఆడుతుంది. తొమ్మిది జట్లు పాల్గొంటున్న ఈ లీగ్‌లో ఇప్పటి వరకు భారత్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి ఎనిమిదో స్థానంలో ఉంది.

బుమ్రా నంబర్‌వన్



ఐసీసీ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం అందుకున్న తొలి భారత పేసర్‌గా గుర్తింపు

తాజా ఘనతతో మూడు ఫార్మాట్‌లలో నంబర్‌వన్‌గా నిలిచిన తొలి బౌలర్‌గా రికార్డు

దుబాయ్: భారత్ నుంచి ఎంతోమంది పేస్ బౌలర్లు టెస్టుల్లో పలుమార్లు అత్యుత్తమ ప్రదర్శనతో అలరించారు. కానీ ఏనాడూ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని దక్కించుకోలేకపోయారు. అయితే ఆ లోటును తీరుస్తూ జస్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని అందుకున్న తొలి భారతీయ పేస్ బౌలర్‌గా అవతరించాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 30 ఏళ్ల బుమ్రా మూడు స్థానాలు ఎగబాకి తన కెరీర్‌లో తొలిసారి ఈ ఫార్మాట్‌లో టాప్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. విశాఖపట్నంలో ఇంగ్లండ్ జట్టుతో జరిగిన రెండో టెస్టులో బుమ్రా తన పేస్ పదునుతో తొమ్మిది వికెట్లు (6/45; 3/46) పడగొట్టి భారత విజయంలో కీలకపాత్ర పోషించడంతోపాటు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' పురస్కారం గెల్చుకున్నాడు. బుమ్రా ఖాతాలో ప్రస్తుతం 881 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. గత ర్యాంకింగ్స్‌లో 'టాప్' ర్యాంక్‌లో ఉన్న భారత స్పిన్నర్ అశ్విన్ రెండు స్థానాలు పడిపోయి 841 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానానికి చేరుకున్నాడు. దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడ 851 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.

ఇప్పటి వరకు భారత్ నుంచి నలుగురు బౌలర్లు మాత్రమే ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచారు. గతంలో భారత స్పిన్నర్లు బిషన్‌సింగ్ బేడీ, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్ ఈ ఘనత సాధించగా... పేస్ బౌలర్ రూపంలో బుమ్రా తొలిసారి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఇప్పటి వరకు 34 టెస్టులు ఆడిన బుమ్రా 155 వికెట్లు తీసుకున్నాడు. తాజా టాప్ ర్యాంక్‌తో బుమ్రా మరో రికార్డు కూడా నెలకొల్పాడు. క్రికెట్ చరిత్రలో మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) ప్రపంచ నంబర్‌వన్‌గా నిలిచిన తొలి బౌలర్‌గా గుర్తింపు పొందాడు. బుమ్రా 2017 నవంబర్ 4న తొలిసారి టి20 ఫార్మాట్‌లో... 2018 ఫిబ్రవరి 4న తొలిసారి వన్డే ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. ప్రస్తుతం బుమ్రా వన్డేల్లో ఆరో ర్యాంక్‌లో, టి20ల్లో వందో ర్యాంక్‌లో ఉన్నాడు. మరోవైపు టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్ 37 స్థానాలు ఎగబాకి 29వ ర్యాంక్‌లో నిలిచాడు.

తదుపరి టెస్టులకూ దూరం!



న్యూఢిల్లీ: వ్యక్తిగత కారణాలరీత్యా భారత స్టార్ కోహ్లి ఇంగ్లండ్‌తో జరిగిన తొలి రెండు టెస్టులకు దూరంగా ఉన్నాడు. అయితే తదుపరి మూడు టెస్టులకూ కోహ్లి సేవలు జట్టుకు అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టెస్టు ఈనెల 15 నుంచి 19 వరకు రాజ్‌కోట్‌లో, నాలుగో టెస్టు ఈనెల 23 నుంచి 27 వరకు రాంచీలో జరగనున్నాయి. చివరిదైన ఐదో టెస్టు మార్చి 7 నుంచి 11 వరకు ధర్మశాలలో జరగుతుంది. తాను జట్టుకు ఎప్పుడు అందుబాటులో ఉంటాననే విషయంపై కోహ్లి బీసీసీఐకి ఇంకా సమాచారం ఇవ్వలేదని తెలిసింది.

'టాప్'లోకి జైపూర్ పింక్ పాంథర్స్



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో ఇప్పటికే ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించిన జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు మళ్లీ అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 27-22తో దబంగ్ ఢిల్లీని ఓడించింది. జైపూర్ తరఫున అర్జున్ దేశ్వాల్ 10 పాయింట్లు స్కోరు చేశాడు. ఈ లీగ్‌లో పింక్ పాంథర్స్‌కిది 13వ విజయం కావడం విశేషం. ప్రస్తుతం పింక్ పాంథర్స్ 77 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లోకి వచ్చింది. పుణేరి పల్టన్ 76 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 40-31తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. నేడు విశ్రాంతి దినం. శుక్రవారం జరిగే మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో గుజరాత్ జెయింట్స్; హరియాణా స్టీలర్స్‌తో యూపీ యోధాస్ తలపడతాయి.

281 పరుగులతో కివీస్ ఘనవిజయం



జేమీసన్, సౌతీ

తొలి టెస్టులో దక్షిణాఫ్రికా పరాజయం

మౌంట్ మాంగనుయ్: నాలుగు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో టిమ్ సౌతీ సారథ్యంలోని న్యూజిలాండ్ 281 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. పరుగుల పరంగా న్యూజిలాండ్‌కిది రెండో అతిపెద్ద విజయం. న్యూజిలాండ్ నిర్దేశించిన 529 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. బెడింగమ్ (96 బంతుల్లో 87; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) మినహా మిగతావారు విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో జేమీసన్ (4/58), సాన్‌ట్నర్ (3/59) రాణించారు. అంతకుముందు న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌ను ఓవర్‌నైట్ స్కోరు 179/4 వద్దే డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ సాధించిన కివీస్ బ్యాటర్ రచిన్ రవీంద్రకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. చివరిదైన రెండో టెస్టు ఈనెల 13 నుంచి హామిల్టన్‌లో జరుగుతుంది.

క్వార్టర్స్‌లో సాకేత్ జోడీ



సాక్షి, హైదరాబాద్: చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీలో భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని పురుషుల డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం చెన్నైలో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సాకేత్-రామ్‌కుమార్ (భారత్) జోడీ 7-6 (7/3), 6-4తో రే హో (చైనీస్ తైపీ) -మతు జెవ్స్కీ (పోలాండ్) జంటను ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్-రామ్‌కుమార్ మూడు ఏస్‌లు సంధించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరి-నికీ పునాచా (భారత్) జంట 6-2, 6-1తో నపోలిటానో (ఇటలీ)-రొకా బటాలా (స్పెయిన్) ద్వయంపై గెలిచింది.

ఫైనల్లో ఖతర్, జోర్డాన్

దోహా: ఆసియా కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఖతర్, జోర్డాన్ జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. బుధవారం జరిగిన రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఖతర్ 3-2తో ఇరాన్ జట్టును ఓడించింది. ఖతర్ తరఫున అబ్దుల్ సలామ్ (17వ ని.లో), అక్రమ్ అఫీఫ్ (43వ ని.లో), అల్మోజ్ అలీ (82వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. తొలి సెమీఫైనల్లో జోర్డాన్ 2-0తో దక్షిణ కొరియాకు షాక్ ఇచ్చి ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్‌కు చేరింది. ఫైనల్ ఈనెల 10న జరుగుతుంది.

సినిమా



రవితేజ

విధ్వంసాల జాతర

'మ్యాప్స్‌కి.. రీసెర్చ్‌కి అందని విషయం ఒకటి ఉంది సార్... అక్కడొకడుంటాడు' అనే డైలాగ్‌తో విడుదలైంది 'ఈగల్' సినిమా ట్రైలర్. రవితేజ హీరోగా నటించిన చిత్రమిది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రేపు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ''ఇప్పుడు పద్ధతైన దాడి.. ఫిబ్రవరి 9 నుంచి విధ్వంసాల జాతర' అంటూ 'ఈగల్' సినిమా రిలీజ్ ట్రైలర్‌ను రవితేజ 'ఎక్స్'లో షేర్ చేశారు. ''దళం.. సైన్యం కాదు.. దేశం వచ్చినా ఆపుతాను' (రవితేజ) 'ఇక్కడ పదేళ్ల నుంచి ఓ గాడ్జిల్లా ఉన్నాది రా' అనే డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి.



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్

హృదయాన్ని గిచ్చీ గిచ్చకా...

'గీత గోవిందం' (2018) వంటి హిట్ సినిమా తర్వాత హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ పరశురామ్ పెట్ల కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది. చిత్ర సంగీతదర్శకుడు గోపీ సుందర్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'నంద నందనా...' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించిన ఈ పాటను సిధ్ శ్రీరామ్ పాడారు. 'ఏమిటిది చెప్పీ చెప్పనట్టుగా ఎంత చెప్పిందో.. సూచనలు ఇచ్చీ ఇవ్వనట్టుగా ఎన్నెన్ని చ్చిందో.. హృదయాన్ని గిచ్చీ గిచ్చకా.. ప్రాణాన్ని గుచ్చీ గుచ్చకా.. చిత్రంగా చెక్కింది దేనికో..' అంటూ ఈ పాట సాగుతుంది. ''ఫ్యామిలీ స్టార్'ని హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు పరశురామ్. 'నంద నందనా..' పాట ఈ మూవీకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అన్నారు మేకర్స్.



రజనీకాంత్

ఇండియన్‌గా నేర్చుకోవాల్సింది అదే!

'ఊర్లో ఒక్క మగాడు లేడ్రా.. మందిని మొత్తాన్ని తీసుకుపోయి బొక్కలో తోసుండారు.. సక్కగా ఉన్న ఊర్ని స్మశానం చేసినారు కదరా!' అనే డైలాగ్స్‌తో విడుదలైంది 'లాల్ సలామ్' సినిమా తెలుగు ట్రైలర్. రజనీకాంత్, కపిల్ దేవ్, జీవితా రాజశేఖర్ ప్రధాన పాత్రల్లో విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా నటించిన చిత్రం 'లాల్ సలామ్'. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో సుభాస్కరన్ నిర్మించారు. ఇందులో ముంబైకి చెందిన మొయిద్దీన్ భాయ్ పాత్ర చేశారు రజనీకాంత్. రేపు 'లాల్ సలామ్' సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన తెలుగు ట్రైలర్‌లో 'ముంబై భాయ్ బాషాలాంటోడు రా!', 'మీరే కోర్టును గౌరవించకపోతే ఎలా భాయ్?', 'బిడ్డ సంపాదిస్తే ఇంటికి గౌరవం.. బిడ్డ సాధిస్తే దేశానికే గౌరవం.. మనవాడు దేశాన్నే గర్వపడేలా చేస్తాడు', 'మతాన్ని నమ్మితే మనసులో ఉంచుకో.. మానవత్వాన్ని అందరితో పంచుకో. ఇండియన్‌గా నేర్చుకోవాల్సింది అదే' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.



కొంచెం క్రాక్

'డీజే టిల్లు' వంటి హిట్ మూవీతో యూత్‌లో మంచి క్రేజ్ సొంతం చేసుకున్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. బుధవారం (ఫిబ్రవరి 7) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా సిద్ధు నటిస్తున్న రెండు చిత్రాల (టిల్లు స్క్వేర్, జాక్) అప్‌డేట్స్ ఇచ్చారు మేకర్స్. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'జాక్' అనే టైటిల్ ఖరారు చేసి, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్‌లైన్. ''ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే మరిన్ని వివరాలను వెల్లడిస్తాం'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్.

త్వరలో ట్రైలర్: 'డీజే టిల్లు'కి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. ఈ సినిమా నుంచి స్పెషల్ బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేసింది యూనిట్. ఈ మూవీ ట్రైలర్ ఈ నెల 14న రిలీజ్ కానుంది. మార్చి 29న సినిమా రిలీజవుతోంది.



వర్ష బొల్లమ్మ

''పాత్ర నిడివి కాదు... నా పాత్ర ప్రాముఖ్యతను బట్టి కథలు ఓకే చేయడానికి ఆసక్తి చూపిస్తాను. ఇప్పటి వరకు నేను చేసిన పాత్రలన్నీ అలా ఎంచుకున్నవే'' అన్నారు వర్షా బొల్లమ్మ. సందీప్ కిషన్ హీరోగా నటించిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. ఈ చిత్రంలో కావ్యా థాపర్, వర్షా బొల్లమ్మ హీరోయిన్లు. వీఐ ఆనంద్ దర్శకత్వంలో అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ– ''ఊరు పేరు భైరవకోన' సినిమాలో నేను ట్రైబల్ అమ్మాయి భూమి పాత్రలో కనిపిస్తాను. తన ఊర్లో చదువుకున్న

నా ప్రేమ వార్త నిజం కాదు

అమ్మాయి ఒక్క భూమి మాత్రమే. అందంగా, అమయాకంగా కనిపించే ఈ పాత్రలో స్ట్రెంత్, పవర్ ఉన్నాయి. ఈ సినిమాలో ఉన్న సందేశం కూడా నా పాత్రతోనే వస్తుంది. నా రియల్ లైఫ్ క్యారెక్టర్‌కు భూమి పాత్ర కాస్త దగ్గరగా అనిపించింది. వీఐ ఆనంద్ గారు ఈ సినిమా కథ చెప్పినప్పుడు అలా ఎలా ఆలోచించి కథలు రెడీ చేస్తారు? అనుకున్నాను. కథ అంత బాగా అనిపించింది. ప్రస్తుతం తమిళ, తెలుగు, మలయాళంలో సినిమాలు చేస్తున్నాను. తెలుగులో ఓ కొత్త ప్రాజెక్ట్ సైన్ చేశాను. ఇక హీరో బెల్లంకొండ గణేశ్‌తో నేను ప్రేమలో ఉన్నానన్న వార్తల్లో ఏ మాత్రం నిజం లేదు'' అని చెప్పుకొచ్చారు.



విశ్వక్ సేన్, చాందినీ చౌదరి

అఘోరా అనుకొని ధర్మం చేశారు!

''గామి' సినిమా షూటింగ్‌ని వారణాసిలోని కుంభమేళాలో జరిపినప్పుడు నేను నిజమైన అఘోరా అనుకొని కొందరు ధర్మం చేశారు. అక్కడ చలికి వణుకుతూ ఓ మూలన కూర్చున్నప్పుడు ఓ వృద్ధురాలు భోజనం పెట్టి, టీ ఇచ్చింది. 'గామి' ట్రైలర్ అత్యద్భుతంగా ఉంది. ఈ చిత్రం ప్రేక్షకులకు మునుపెన్నడూ కలిగించని సరికొత్త అనుభూతిని పంచుతుందనే నమ్మకం ఉంది'' అని విశ్వక్ సేన్ అన్నారు. ఆయన హీరోగా విద్యాధర్ కాగిత దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'గామి'. చాందినీ చౌదరి కథానాయిక. వి సెల్యులాయిడ్ సమర్పణలో కార్తీక్ శబరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని మార్చి 8న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''గామి' కోసం దాదాపు నాలుగున్నరేళ్లు పని చేశాం. ఇంత సమయం పట్టింది కాబట్టే మంచి గ్రాఫిక్స్‌ని రాబట్టుకున్నాం'' అన్నారు. ''మానవ స్పర్శ లేని జీవితాన్ని ఊహించలేం. అలాంటి సమస్య ఎదుర్కొంటున్న అఘోరా శంకర్ (విశ్వక్ సేన్) హిమాలయాల్లో చేసే సాహసోపేత ప్రయాణమే ఈ చిత్రం. ఈ సినిమా కోసం వారణాసిలో కుంభమేళా షూటింగ్ చేశాం. మైనస్ 40 డిగ్రీల్లో కూడా గ్లౌజులు లేకుండా నటించాడు విశ్వక్'' అన్నారు విద్యాధర్ కాగిత. ''2018లో 'గామి' మొదలు పెట్టాం. క్రౌడ్ ఫండ్ మోడల్‌లో చేశాం'' అన్నారు కార్తీక్ శబరీష్.



గౌతమ్ కృష్ణ

సోలో బాయ్

'బిగ్ బాస్' తెలుగు సీజన్ 7 ఫేమ్ గౌతమ్ కృష్ణ హీరోగా నటిస్తున్న చిత్రం 'సోలో బాయ్'. పి. నవీన్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్వేతా అవస్తి, రమ్య పసుపులేటి నాయికలు. సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాత. ఈ చిత్రానికి 'సోలో బాయ్' టైటిల్ ప్రకటించి, ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ– ''కోవిడ్ టైమ్‌లో 'బట్టల రామస్వామి బయోపిక్' సినిమా తీసి, వినోదం అందించాం. ఇప్పుడు 'సోలో బాయ్' నిర్మిస్తున్నాను. రెండు పాటలు మినహా షూటింగ్ పూర్తయింది'' అన్నారు. ''గతంలో నేను చేసిన 'ఆకాశ వీధిలో' సినిమాకి నటుడిగా మంచి గుర్తింపు వచ్చింది. 'బిగ్ బాస్'లోనూ ప్రేక్షకులు నన్ను బాగా ఆదరించారు. 'సోలో బాయ్'ని కూడా ఆశీర్వదించాలి'' అన్నారు గౌతమ్ కృష్ణ. ''యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను మా చిత్రం అలరించేలా ఉంటుంది'' అన్నారు పి. నవీన్ కుమార్.

ఆరేళ్ల ప్రేమతో..



శ్రీ గౌరి ప్రియ

మణికందన్, శ్రీ గౌరీప్రియ, కన్న రవి లీడ్ రోల్స్‌లో నటించిన తమిళ చిత్రం 'ట్రూ లవర్'. ప్రభురామ్ వ్యాస్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రేపు తమిళంలో విడుదలవుతోంది. ఈ సినిమాను 'ట్రూ లవర్' టైటిల్‌తో ఈ నెల 10న తెలుగులో దర్శక-నిర్మాత మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ విడుదల చేస్తున్నారు. ఈ చిత్ర కథానాయిక శ్రీ గౌరి మాట్లాడుతూ– ''నేను హైదరాబాద్ అమ్మాయిని. 2018లో మిస్ హైదరాబాద్‌గా ఎంపికైనా నాకు ఇండస్ట్రీ నుంచి ఆఫర్స్ వచ్చాయి. ప్రియదర్శితో చేసిన 'మెయిల్' వెబ్ సిరీస్, సుహాస్ 'రైటర్ పద్మభూషణ్', 'మ్యాడ్' సినిమాలు నాకు నటిగా గుర్తింపు తీసుకువచ్చాయి. తమిళంలో 'మోడ్రన్ లవ్ చెన్నై'లో నటించి, అక్కడి ప్రేక్షకులకు దగ్గరయ్యా. అలా 'ట్రూ లవర్'లో చాన్స్ వచ్చింది. ఓ జంట మధ్య ఆరేళ్ల కాలంలో జరిగే కథే ఈ చిత్రం. ఇందులో డిఫరెంట్ షేడ్స్ ఉన్న దివ్య పాత్రలో కనిపిస్తాను. ఈ సినిమాని ప్రేమికులు బాగా రిలేట్ చేసుకుంటారు'' అన్నారు.

థ్రిల్లర్ ఆరంభం



ప్రశాంత్, ఇషా యాదవ్

ప్రశాంత్ గురువాన హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'తిమిరం'. ఈ చిత్రంలో ఇషా యాదవ్ కథానాయిక. రాహుల్ అయ్యర్, ప్రసన్న, వేణుగోపాల్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభమైంది. తొలి సీన్‌కి నిర్మాతల్లో ఒకరైన వేణుగోపాల్ కెమెరా స్విచ్చాన్ చేయగా, పారిశ్రామికవేత్త ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. ప్రశాంత్ గురువాన మాట్లాడుతూ– ''ఓ ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న సరికొత్త హారర్ థ్రిల్లర్ చిత్రమిది. హీరోగా, దర్శకుడిగా ఇది నా మొదటి చిత్రం'' అన్నారు. ''మూఢ నమ్మకాల నేపథ్యంలో నడిచే హారర్ చిత్రమిది. వేసవిలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి సంగీతం: తరుణ్ రానా ప్రతాప్, కెమెరా: మహేష్.

సాక్షి బిజినెస్

గురువారం
8-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
34	1
72,152	21,930

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,710	△	101
డోజోన్స్	38,666	△	145
ఎఫ్‌టీఎస్ఈ 100	7,629	▽	52
డాక్స్	16,922	▽	111
షాంఘై	2,830	△	40
నికాయ్	36,120	▽	41

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
62,646	△	167
బంగారం (99.5 స్వచ్ఛత)		
62,395	△	96
వెండి (కిలో)		
69,866	▽	118

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		82.64	83.66
£	బ్రిటన్ పౌండ్		103.57	106.14
€	యూరో		88.33	90.68
¥	జపాన్ ఎన్ (100)		56.10	57.38
AUS$	ఆస్ట్రేలియా డాలర్		53.40	55.31
S$	సింగపూర్ డాలర్		59.68	6389
SAR	సౌదీ రియాల్		21.17	22.79
UAE D	యూఏఈ దిర్హామ్		21.70	23.48
¥	చైనా యువాన్		10.40	12.39

'బీ న్యూ'లో రియల్‌మీ 12 ప్రో 5జీ స్మార్ట్ ఫోన్లు



హైదరాబాద్: మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చెయిన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో రియల్‌మీ 12 ప్రో 5జీ సిరీస్ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని మాదాపూర్ బీ న్యూ స్టోర్‌లో బుధవారం నటి ప్రియాంక జవాల్కర్ ఈ మోడల్ స్మార్ట్‌ఫోన్ విడుదల చేశారు. ''అద్భుతమైన ఫీచర్లున్న రియల్‌మీ 12 ప్రో 5జీ స్మార్ట్ ఫోన్లను బీ న్యూ ఉత్తమ ఆఫర్లకు అందిస్తుంది. ఈ అవకాశాన్ని కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలి'' అని సంస్థ సీఎండీ బాలాజీ చౌదరి కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సంస్థ సీఈఓ సాయి నిఖిలేశ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్‌తో పాటు రియల్‌మీ సేల్స్ డైరెక్టర్ తరిని ప్రసాద్, సేల్స్ హెడ్ పునీత్, నరసింహాలు పాల్గొన్నారు.

ఈ-లూనా వచ్చేసింది

ఆరంభ ధర రూ.69,990



న్యూఢిల్లీ: దేశీ మార్కెట్లోకి ఈ-లూనా అడుగుపెట్టింది. కేంద్ర రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ దీన్ని ఆవిష్కరించారు. కర్బన ఉద్గారాలను తగ్గించడంతోపాటు, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ-లూనా ఎలక్ట్రిక్ రవాణాకు వీలు కల్పిస్తుందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో లక్ష ఈ-లూనాలను విక్రయించనున్నట్టు కినెటిక్ గ్రీన్ వ్యవస్థాపకురాలు, సీఈవో సులజ్జా ఫిరోదియా మోత్వానీ తెలిపారు. బీటూబీ కస్టమర్లు, ఈ-కామర్స్ సంస్థల నుంచి మంచి స్పందన వచ్చిందని, వారికి 50,000 యూనిట్లు విక్రయిస్తామనే అంచనాతో ఉన్నట్టు చెప్పారు. ఈ-లూనా ఆరంభ ధర రూ.69,990 (ఎక్స్‌షోరూమ్). 2 కిలోవాట్ లిథియం అయాన్ బ్యాటరీతో వచ్చే ఈ-లూనా ఒక్కసారి చార్జింగ్‌తో 110 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1,200 కోట్ల టర్నోవర్ సాధించాలని.. ఇందులో రూ.800 కోట్ల ఆదాయం ఈ-లూనా నుంచే వస్తుందన్న అంచనాతో కంపెనీ ఉంది.

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ రూ. 4.50 డివిడెండ్

నికర లాభంలో 11 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి పనితీరు పరంగా రాణించింది. క్రితం ఏడాది ఇదే కాలంలోని లాభం రూ.3,645 కోట్లతో పోల్చి చూసినప్పుడు 11 శాతం పెరిగి రూ.4,028 కోట్లకు చేరింది. ఆదాయం సైతం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.11,530 కోట్ల నుంచి రూ.11,820 కోట్లకు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో రూ.7,690 కోట్ల మూలధన వ్యయాలను వినియోగించింది. డిసెంబర్ త్రైమాసికంలో ఆరు అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ ప్రాజెక్టులను బిడ్డింగ్‌లో గెలుచుకుంది. వీటి నిర్మాణ అంచనా వ్యయం రూ.20,479 కోట్లుగా ఉంది.



డిసెంబర్ చివరికి పవర్‌గ్రిడ్ సంస్థ నిర్వహణలోని ట్రాన్స్‌మిషన్ ఆస్తుల నిడివి 1,76,530 సర్క్యూట్ కిలోమీటర్లుగా ఉంది. అలాగే, 276 సబ్ స్టేషన్లు, 5,17,860 మెగావోల్ట్ యాంపియర్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రెండో మధ్యంతర డివిడెండ్ కింద రూ.4.50 చొప్పున పంపిణీ చేయాలని నిర్ణయించింది.

ఆర్‌బీఐ పాలసీ అప్రమత్తత

- ఆరంభ లాభాలు ఆవిరి
- ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి
- ఇంట్రాడేలో ఒడిదుడుకుల ట్రేడింగ్
- స్వల్ప నష్టాల ముగింపు



ముంబై: ఆరంభ లాభాలు కోల్పోయిన స్టాక్ సూచీలు బుధవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఆర్‌బీఐ ద్రవ్య కమిటీ సమావేశ నిర్ణయాల వెల్లడి (నేడు)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఐటీ షేర్లలో లాభాల స్వీకరణతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో బలహీన సంకేతాలు సైతం సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో 621 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 34 పాయింట్ల స్వల్ప నష్టంతో 72,152 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 71,938 వద్ద కనిష్టాన్ని, 72,559 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 22,053 – 21,860 రేంజ్ లో కదలాడింది. చివరికి ఒక పాయింటు లాభపడి 21,930 వద్ద నిలిచింది. ఐటీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఫార్మా, రియల్టీ షేర్లకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.31%, 0.38% చొప్పున పెరిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,691 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,096 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో హాంగ్‌కాంగ్, ఇండోనేసియా, చైనా తప్ప మిగిలిన అన్ని దేశాల సూచీలు ఒకశాతం మేర లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు 0.50% - 0.10% నష్టపోయాయి. అమెరికా మార్కెట్లు 0.25% లాభాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- అమెరికా దిగ్గజ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ క్యూ4 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో పాటు ఇటీవల ర్యాలీ నేపథ్యంలో ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. టెక్ మహీంద్రా 2.31%, ఇన్ఫోసిస్ 2%, టీసీఎస్, విప్రో, హెచ్‌సీఎల్ షేర్లు ఒకశాతం చొప్పున నష్టపోయాయి.
- పేటీఎం రికవరీ ప్రయాణం బుధవారం కొనసాగింది. బీఎస్ఈలో ట్రేడింగ్ ప్రారంభంలో 10% పెరిగి రూ.496 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి లాకైంది. రెండు రోజుల్లో షేరు 13% బౌన్స్‌బ్యాక్‌తో కంపెనీ మార్కెట్ విలువ రూ.3,720 కోట్లు పెరిగి రూ.31,548 కోట్లకు చేరింది.
- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వాటా కొనుగోలుకు ఆర్‌బీఐ అనుమతినివ్వడంతో యస్‌బ్యాంక్, సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ షేర్లు వరుసగా 17%, 7% చొప్పున లాభపడ్డాయి.

టాటా కన్జ్యూమర్ లాభాలకు కోత

రూ.301 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ కన్సాలిడేటెడ్ నికర లాభం డిసెంబర్ త్రైమాసికంలో 17 శాతం క్షీణించి రూ.301 కోట్లకు పరిమితమైంది. ఒక అసాధారణ అంశానికి తోడు, అసోసియేట్, జాయింట్ వెంచర్ల నుంచి లాభాల వాటా తగ్గడం ఇందుకు కారణమని సంస్థ తెలిపింది. వీటిని మినహాయించి చూస్తే నికర లాభం 27 శాతం వృద్ధితో రూ.513 కోట్లుగా ఉంది. ఆదాయం 9 శాతానికి పైగా వృద్ధితో రూ.3,804 కోట్లకు చేరుకుంది. దేశీ బ్రాండెడ్ ఆదాయం 10% పెరిగి రూ.2,375 కోట్లుగా నమోదైంది. ప్యాకేజ్డ్ బేవరేజెస్ విక్రయాలు 4 శాతం, టాటా సంపన్న్ బ్రాండెడ్ అమ్మకాలు 40 శాతం చొప్పున పెరిగాయి. టాటా స్టార్‌బక్స్ బ్రాండ్‌పై కొత్తగా 22 స్టోర్లను ప్రారంభించగా, 55 పట్టణాల్లో మొత్తం స్టోర్లు 392కు పెరిగాయి.

20 లక్షల మందికి ఏఐలో శిక్షణ

- ఏఐ నియంత్రణపై సహకారం అత్యవసరం
- మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల



ముంబై: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతపై రెండేళ్లలో 20 లక్షల మంది భారతీయులకు నైపుణ్యం కల్పిస్తామని అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల బుధవారం తెలిపారు. శ్రామికశక్తి అభివృద్ధి చెందడానికి నైపుణ్యాలను పెంపొందించడం అనేది ఒక సంస్థ చేయగలిగే అత్యంత ముఖ్యమైన విషయమని అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా నాదెళ్ల భారత్‌లో అడుగుపెట్టారు. కన్సల్టెన్సీలు, చట్టపర సంస్థలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీలకు చెందిన వ్యాపారవేత్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఏఐపై నిబంధనలను రూపొందించడంలో భారత్, యూఎస్ సహకరించుకోవడం అత్యవసరం అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కొత్త తరం సాంకేతికత వృద్ధిని సమానంగా పంపిణీ చేయగలదని అన్నారు. శక్తివంతమైన సాధారణ ప్రయోజన సాంకేతికతగా ఏఐని పేర్కొన్న ఆయన.. ఏఐ నిబంధనల విషయంలో ఏకాభిప్రాయం బహుపాక్షిక స్థాయిలలో కూడా చాలా అవసరమని నాదెళ్ల తెలిపారు.

జీడీపీ వృద్ధిలో ఏఐ..

సాంకేతికత వేగంగా విస్తరించడం వల్ల ఆర్థిక వృద్ధిలో సమాన పంపిణీకి సహాయపడుతుందని సత్య నాదెళ్ల అన్నారు. జీడీపీ వృద్ధిని పెంచడంలో ఏఐ సహాయపడుతుందని చెప్పారు. భారత్‌ను ప్రపంచంలోని అత్యధిక వృద్ధి మార్కెట్లలో ఒకటిగా పేర్కొన్నారు. 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల జీడీపీలో ఏఐ జీడీపీ 500 బిలియన్ డాలర్లుగా ఉంటుందన్న మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ నివేదికను ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. పునరుత్పాదక వనరుల నుంచి విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, భారత్ కూడా గ్రిడ్ స్థిరత్వంపై దృష్టి సారించాల్సి ఉందని చెప్పారు. సాంకేతికత కూడా ఇందులో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. భారత పర్యటనలో భాగంగా టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌ను తాను కలిశానని, ఎయిర్ ఇండియా ఏఐ వినియోగాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. ఐటీసీ, అరవింద్, లాభాపేక్ష లేని ఇతర భారతీయ సంస్థలు, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వంటి ఐటీ కంపెనీలు అనేక సంస్థాగత కార్యక్రమాల కోసం ఏఐ సాధనాలను ఉపయోగిస్తున్నాయని నాదెళ్ల వివరించారు.

కెనరా బ్యాంక్ షేరు విభజన!

ఈ నెల 26న నిర్ణయం

న్యూఢిల్లీ: కెనరా బ్యాంక్ షేరు ముఖ విలువని విభజించాలని అనుకుంటున్నట్టు ప్రకటించింది. దీనిపై నిర్ణయం తీసుకునేందుకు ఈ నెల 26న బోర్డ్ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపింది. ప్రస్తుతం కెనరా బ్యాంక్ షేరు ముఖ విలువ రూ.10గా ఉంది. ఆర్‌బీఐ, ఇతర చట్టబద్ధమైన ప్రభుత్వరంగ సంస్థల ముందస్తు అనుమతి మేరకు ఈక్విటీ షేర్ల సబ్ స్ప్లిట్‌పై బోర్డు ఆఫ్ డైరెక్టర్ల నుంచి సూత్ర ప్రాయ ఆమోదం తీసుకోనున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కెనరా బ్యాంక్ తెలియజేసింది. స్టాక్ లిక్విడిటీ (మరిన్ని షేర్ల లభ్యత) పెంచేందుకు వీలు గా కెనరా బ్యాంక్ ముఖ విలువ విభజనకు మొగ్గు చూపుతున్నట్టు తెలిపింది. ఈ వార్త నేపథ్యంలో బీఎస్ఈలో కెనరా బ్యాంక్ షేరు 6% లాభపడి రూ.554 వద్ద ముగిసింది.

ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ జేవీ



గోవా: దేశీ చమురు-గ్యాస్ ఉత్పత్తి దిగ్గజం ఓఎన్‌జీసీ, అతిపెద్ద విద్యుత్ సంస్థ ఎన్‌టీపీసీ జాయింట్ వెంచర్ ఒప్పందంపై ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమం వేదికగా బుధవారం సంతకం చేశాయి. ఈ జేవీ ద్వారా భారత్‌తోపాటు విదేశాల్లో పవన విద్యుత్ ప్రాజెక్టులను ఇరు సంస్థలు కలిసి ఏర్పాటు చేస్తాయి. స్టోరేజ్, ఈ-మొబిలిటీ, కార్బన్ క్రెడిట్, గ్రీన్ క్రెడిట్, గ్రీన్ హైడ్రోజన్ వ్యాపారంతోపాటు గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మిథనాల్ వంటి విభాగాల్లోకి ప్రవేశించే అవకాశాలను పరిశీలిస్తాయి.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఎన్‌ఆర్‌ఎస్‌సీలో సైంటిస్ట్ ఉద్యోగాలు

41 ఉద్యోగాలకు ప్రకటన విడుదల

ఇస్రో జాబ్స్

దేశాభివృద్ధిలో అంతరిక్ష పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుంది. ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడం, వాటిని పర్యవేక్షించడం తదితర ముఖ్య విధులను ఇస్రోలో పనిచేసే సైంటిస్ట్/ఇంజనీర్లు నిర్వహిస్తారు. తాజాగా ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌సీ) పలు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

- మొత్తం పోస్టులు: 41
- సైంటిస్ట్: వ్యవసాయం, ఫారెస్ట్రీ, ఎకాలజీ, జియోఇన్ఫర్మేటిక్స్, జియాలజీ, జియోఫిజిక్స్, సాయిల్‌సైన్స్, అర్బన్ స్టడీస్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీచేస్తారు. ఇందులో సైంటిస్ట్ ఇంజనీర్-35, మెడికల్ ఆఫీసర్-01, నర్స్-02, లైబ్రరీ అసిస్టెంట్-03 పోస్టులు ఉన్నాయి.

విద్యార్హతలు

- పోస్టులను అనుసరించి విద్యార్హతలు వేర్వేరుగా ఉన్నాయి. సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు ఎమ్మెస్సీ, ఎంఈ/ఎంటెక్, బీఎస్సీ/బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి.
- మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. అలాగే రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
- నర్స్(బి) ఈ పోస్టులకు ఎస్ఎస్ఎల్‌సీ/ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో మూడేళ్ల డిప్లొమా ఉండాలి.
- లైబ్రరీ అసిస్టెంట్(ఎ) పోస్టులకు ప్రథమ శ్రేణి గ్రాడ్యుయేషన్‌తోపాటు ప్రథమ శ్రేణిలో మాస్టర్ డిగ్రీ ఇన్ లైబ్రరీ సైన్స్/లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి.

ఎంపిక ఇలా

- పోస్టులను బట్టి ఎంపిక విధానం వేర్వేరుగా ఉంటుంది. సైంటిస్ట్/ఇంజనీరింగ్ పోస్టులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.
- నర్స్ పోస్టులకు రాత పరీక్ష, స్కిల్ టెస్ట్‌లను నిర్వహించి ఎంపిక చేస్తారు.
- లైబ్రరీ అసిస్టెంట్ పోస్టులకు రాత పరీక్ష, స్కిల్ టెస్ట్‌ల్లో చూపించిన ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:12.02.2024
- వెబ్‌సైట్: https://www.nrsc.gov.in

మేనేజ్‌మెంట్ పీజీకి.. మ్యాట్

ఇంజనీరింగ్, మెడిసిన్ తర్వాత దేశంలో ఆదరణ ఉన్న మరో కోర్సు..ఎంబీఏ! అందుకే గ్రాడ్యుయేషన్ స్థాయి విద్యార్థులు పీజీలో మేనేజ్‌మెంట్ కోర్సులవైపు ఎక్కువగా మొగ్గు చూపుతుంటారు. మేనేజ్‌మెంట్ విద్యలో భాగంగా వ్యాపారాన్ని, సంస్థలను సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది. తాజాగా మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి వీలు కల్పించే మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో.. మ్యాట్ పరీక్షకు సంబంధించిన వివరాలు..

- ఏడాదికి నాలుగుసార్లు పరీక్ష నిర్వహణ
- ఫిబ్రవరి సెషన్‌కు నోటిఫికేషన్ విడుదల

దేశవ్యాప్తంగా ఉన్న బీస్కూళ్లలో ప్రవేశాలకు నిర్వహించే అర్హత పరీక్షల్లో మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (మ్యాట్) ఒకటి. జాతీయ స్థాయిలో ఏడాదికి నాలుగుసార్లు ఫిబ్రవరి, మే, సెప్టెంబర్, డిసెంబర్‌ల్లో ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) ఈ పరీక్షను నిర్వహిస్తోంది. ఈ స్కోరు ఏడాదిపాటు చెల్లుబాటు అవుతుంది. ప్రస్తుతం ఫిబ్రవరి సెషన్‌కు ప్రకటన వెలువడింది. పరీక్షను పేపర్ ఆధారిత (పీబీటీ), కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ), ఇంటర్నెట్ ఆధారిత పరీక్ష (ఐబీటీ).. ఇలా మూడు విధానాల్లో రాసుకునే వీలుంది. ఏవైనా రెండు విధానాలను కలిపి రాసుకునే అవకాశం కూడా ఉంది.

అర్హతలు

ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు మ్యాట్ రాసేందుకు అర్హులు. ఆర్ట్స్/కామర్స్/ సైన్స్/ఇంజనీరింగ్/మెడిసిన్.. ఇలా ఏ విభాగంలో డిగ్రీ స్థాయి కోర్సు ఉత్తీర్ణులైనా మ్యాట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు ఎంతుండాలనే నిబంధన ఏదీ పేర్కొనలేదు. అంటే..10+2+3 విధానంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు ఎవరైనా ఈ పరీక్ష రాయొచ్చు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సైతం మ్యాట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఐబీటీ ఇలా

రిమోట్ ప్రోక్టర్డ్ ఇంటర్నెట్ బేస్డ్ టెస్టు (ఐబీటీ) విధానంలో ఇంటి నుంచే పరీక్ష రాసుకోవచ్చు. కంప్యూటర్, ఇంటర్నెట్ కనెక్షన్, వెబ్‌క్యామ్ ఉంటే సరిపోతుంది. ప్రతి రోజూ రెండు స్లాట్లలో ఉదయం, మధ్యాహ్నం వీటిని నిర్వహిస్తారు. పరీక్షకు సంబంధించి ఇష్టమైన తేదీ, సమయం ఎంపిక చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. పరీక్ష రాయాలనుకుంటున్న తేదీకి కనీసం 4 రోజుల ముందు దరఖాస్తు చేసుకున్నా సరిపోతుంది.

రాత పరీక్ష



లాంగ్వేజ్ కాంప్రహెన్షన్,మ్యాథమెటికల్ స్కిల్స్, డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీ, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ అంశాల్లో.. ఒక్కో విభాగం నుంచి 40 చొప్పున 200 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ఇందులో లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 30 నిమిషాలు, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్ 30 నిమిషాలు, మ్యాథ్స్ స్కిల్స్ 40 నిమిషాలు, డేటా ఎనాలిసిస్ అండ్ సఫిషియన్సీ 35 నిమిషాలు, ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్‌కు 15 నిమిషాల వ్యవధి కేటాయించారు.

ప్రిపరేషన్ పక్కాగా

- మ్యాట్ సిలబస్ ప్రకారం–ఆయా అంశాల అధ్యయనం ప్రారంభించాలి. చదివేటప్పుడే పాయింట్స్‌గా నోట్స్ రాసుకోవాలి. ఇది రివిజన్ సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుంది.
- పోటీ పరీక్షలో ప్రతి మార్కు నిర్ణయాత్మకం అవుతుందున్న విషయాన్ని గుర్తించి పట్టుదలతో ప్రిపరేషన్ సాగించాలి.
- ఏ అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలో తెలుసుకోవాలి. అందుకు అనుగుణంగా ప్రిపరేషన్ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.
- అన్నింటికంటే ప్రధానమైనది మాక్ టెస్టుల ప్రాక్టీస్. జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు హాజరయ్యేటప్పుడు ఇది చాలా అవసరం. ఒకటికి పదిసార్లు పాత ప్రశ్న పత్రాలు ప్రాక్టీస్ చేయడంతో పాటు నమూనా పరీక్షలు కూడా రాయాలి. ఎంత ఎక్కువ ప్రాక్టీస్ చేస్తారో అంత ఎక్కువగా సబ్జెక్టుపై పట్టు లభిస్తుంది. అంతేకాకుండా వేగం కూడా పెరుగుతుంది. ఇది పరీక్ష బాగా రాసేందుకు దోహదపడుతుంది.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ (పీబీటీ): ఫిబ్రవరి 20, 2024
- రాత పరీక్ష తేదీ (పీబీటీ): ఫిబ్రవరి 25, 2024
- సీబీటీ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: మార్చి 05, 2024
- సీబీటీ పరీక్ష తేదీ: మార్చి 10, 2024
- వెబ్‌సైట్: https://mat.aima.in

విద్య, ఉద్యోగ సమాచారం

భారత తీర రక్షక దళంలో 260 నావిక్ పోస్టులు

భారత తీరరక్షక దళం కోస్ట్‌గార్డ్ ఎన్‌రోల్డ్ పర్సనల్ టెస్ట్(సీజీఈపీటీ)-02/2024 బ్యాచ్ ద్వారా నావిక్(జనరల్ డ్యూటీ) పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 260
- రీజియన్/జోన్‌ల వారీగా ఖాళీలు: నార్త్-79, వెస్ట్-66, నార్త్ ఈస్ట్-68, ఈస్ట్-33, నార్త్ వెస్ట్-12, అండమాన్-నికోబార్-03.
- అర్హత: 10+2(మ్యాథ్స్, ఫిజిక్స్) ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. వయసు: 18 నుంచి 22 ఏళ్లు ఉండాలి.
- ప్రారంభ వేతనం: నెలకు రూ.21,700.
- ఎంపిక విధానం: స్టేజ్-1, స్టేజ్-2, స్టేజ్-3, స్టేజ్-4 పరీక్షలు, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 13.02.2024
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:27.02.2024
- వెబ్‌సైట్: https://joinindiancoast-guard.cdac.in

ఏలూరు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో వివిధ పోస్టులు

ఏలూరు జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 09
- పోస్టుల వివరాలు: బ్లాక్ కోఆర్డినేటర్-02, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ (ఎల్‌సీపీవో)-01, సోషల్ వర్కర్(మేల్)-01, ఔట్‌రీచ్ వర్కర్(ఓఆర్‌డబ్ల్యూ) (మహిళలు)-01, సోషల్ వర్కర్ కమ్ ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్(మహిళలకు మాత్రమే)-01, డాక్టర్(పార్ట్‌టైమ్)-01, చౌకీదార్(మహిళలకు మాత్రమే)-01, పారా లీగల్ పర్సనల్/లాయర్-01.
- అర్హతలు: ఇంటర్, డిగ్రీ, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, కలెక్టరేట్, ఏలూరు చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 15.02.2024.
- వెబ్‌సైట్: https://eluru.ap.gov.in

సీఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్ కొలువులు

169 పోస్టులకు ప్రకటన విడుదల

పోలీస్ జాబ్స్

కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో ఒకటైన సెంట్రల్ రిజర్వ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్).. పలు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దీనిలో భాగంగా స్పోర్ట్స్ కోటా కింద గ్రూప్-సి విభాగంలో కానిస్టేబుల్(జనరల్ డ్యూటీ) నాన్ -గెజిటెడ్ అండ్ నాన్ మినిస్టీరియల్ ఖాళీలను భర్తీ చేయనుంది. అర్హత కలిగిన మహిళ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- మొత్తం పోస్టులు: 169

క్రీడా విభాగాలు

జిమ్నాస్టిక్స్,జూడో, వుషు, షూటింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ, రెజ్లింగ్ ఫ్రీ స్టైల్, గ్రీకో రోమన్, తైక్వాండో, వాటర్ స్పోర్ట్స్ కయాక్, కానో, రోయింగ్, బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, ట్రయాథ్లాన్, డైవింగ్, డైవింగ్ ఈక్వెస్ట్రియన్, యాచింగ్, ఐస్ హాకీ, ఐస్ స్కేటింగ్, ఐస్ స్కీయింగ్.

అర్హతలు

అభ్యర్థులు పదోతరగతి ఉత్తీర్ణత సాధించి.. నిర్దిష్ట శారీరక సామర్థ్యంతోపాటు సంబంధిత క్రీడాంశాల్లో అర్హత ఉండాలి. 15.02.2024నాటికి 18 నుంచి 23 సంవత్సరాల మధ్య ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిలో జనరల్ అభ్యర్థులకు 5ఏళ్లు,ఎస్సీ,ఎస్టీలకు 10ఏళ్లు, ఓబీసీ(ఎన్‌సీఎల్)లకు 8ఏళ్లు, డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు 5 ఏళ్ల సడలింపు లభిస్తుంది.

శారీరక ప్రమాణాలు

పురుష అభ్యర్థులు ఎత్తు 170 సెం.మీ, ఛాతీ 80 సెం.మీ ఉండాలి. గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ పెరగాలి. మహిళా అభ్యర్థుల ఎత్తు 157 సెం.మీ ఉండాలి. ఎస్సీ, ఎస్టీ పురుష అభ్యర్థులు 162 సెం.మీ, ఛాతీ 76 సెం.మీ ఉండాలి. మహిళా అభ్యర్థులు ఎత్తు 150 సెం.మీ ఉండాలి. అలాగే అభ్యర్థులకు వర్ణ అంధత్వం, ఇతర సంబంధిత సమస్యలు ఏమీ ఉండకూడదు.

ఎంపిక ఇలా

- క్రీడా ప్రదర్శన, స్పోర్ట్స్ ట్రయల్ టెస్ట్, వైద్య పరీక్షలు, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అలాగే 01.02.2021 నుంచి 31.12.2023 మధ్య వివిధ క్రీడల్లో పాల్గొని పొందిన పతకాల ఆధారంగా మార్కులు ఇస్తారు.
- 01.01.2021 నుంచి 31.12.2023 వరకు జరిగిన వివిధ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన అభ్యర్థులకు మాత్రమే అడ్మిట్ కార్డులు జారీ చేస్తారు. తర్వాత వీరికి ధ్రువపత్రాల పరిశీలన, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ), డీటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహించి..అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

మార్కుల కేటాయింపు

- వివిధ క్రీడా పోటీల్లో సాధించిన పతకాలను బట్టి మార్కులు ఇస్తారు.
- ఒలింపిక్ గేమ్స్/సమ్మర్/వింటర్ పోటీలు: బంగారు పతకానికి-100, వెండికి-96, కాంస్యానికి-92, పాల్గొన్నవారికి 80 మార్కులు ఇస్తారు.
- వరల్డ్ ఛాంపియన్‌షిప్/వరల్డ్ కప్: బంగారు 90, వెండి-86, కాంస్యానికి-82, పాల్గొంటే 70 మార్కులు.
- ఏషియన్ ఛాంపియన్‌షిప్/కప్/కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్: బంగారు-70, వెండికి-66,కాంస్యానికి-62,పాల్గొంటే 50 మార్కులు.
- యూత్ ఒలింపిక్ గేమ్స్: బంగారుకు-60, వెండికి-56,కాంస్యానికి-52,పాల్గొంటే 40మార్కులు
- యూత్/జూనియర్ ఏషియన్ ఛాంపియన్‌షిప్ అండ్ యూత్/జూనియర్ కామన్‌వెల్త్ ఛాంపియన్‌షిప్: బంగారుకు-50, వెండికి-46, కాంస్యానికి-42, పాల్గొంటే 30 మార్కులు.
- సాఫ్ గేమ్, ఇతర అంతర్జాతీయ పోటీలు: బంగారుకు-40, వెండికి-36, కాంస్యానికి-32, పాల్గొంటే 26 మార్కులు.
- నేషనల్ గేమ్స్, సీనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్ ఇండివిడ్యువల్ మెడల్ విభాగం: బంగారుకు 30, వెండికి-26, పాల్గొంటే 22 మార్కులు.
- టీమ్ మెడల్ ఇన్ ఇండివిడ్యుయల్ స్పోర్ట్స్: బంగారుకు-26,వెండికి-22,కాంస్యానికి 18 మార్కులు
- టీమ్ మెడల్ ఇన్ ఇండివిడ్యువల్ స్పోర్ట్స్: బంగారుకు-16,వెండికి-12,కాంస్యానికి 8 మార్కులు

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 15.02.2024
- వెబ్‌సైట్: https://recruitment.crpf.gov.in

వారి నియామకం చెల్లదు

జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యుల నియామకంపై హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉన్నందున హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులుగా బడ్డిపడగ రాజిరెడ్డి, కె.కాత్యాయిని నియామకం చెల్లదని హైకోర్టు తీర్పునిచ్చింది. వారిని నియమిస్తూ 2023, ఆగస్టు 16న జారీ చేసిన జీవో 28ను రద్దు చేసింది. జీవో 28ని సవాల్ చేస్తూ కె.సరిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరి పిన జస్టిస్ మాధవీదేవి ఇటీవల తీర్పు వెల్లడించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఏపీ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ ఎక్కువ మార్కులు పొందారని, ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ ధ్రువీకరణ పూర్తి చేసినా.. తక్కువ మార్కులు వచ్చినవారిని నియమించారని తెలిపారు. 2023, మార్చి 3న కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ వర్సెస్ మహీంద్ర భాస్కర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా నియామకాలు చేశారన్నారు. సభ్యుల నియా మకం నోటిఫికేషన్ ప్రక్రియ ప్రకారమే జరిగిందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్టపరమైన ప్రత్యామ్నాయాలను ఆశ్రయించడానికి తీర్పు అమలును నాలుగు వారాల పాటు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

19 నుంచి కానిస్టేబుల్ శిక్షణ!

ట్రైనింగ్ కసరత్తు ముమ్మరం.. డీజీపీ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: కానిస్టేబుల్ శిక్షణ ఈనెల 19 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ట్రైనింగ్ ప్రారంభించడంపై ఉన్నతాధికారులు ఇప్పటికే కసరత్తు ముమ్మరం చేశారు. పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో మౌలిక వసతుల కల్పన, ఇండోర్, ఔట్‌డోర్ శిక్షణకు సంబంధించిన సిబ్బంది నియామకం తదితర అంశాలపైన డీజీపీ రవి గుప్తా బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో కలిపి మొత్తం 15,644 కానిస్టేబుల్ భర్తీ ప్రక్రియ పూర్తయిన విషయం తెలిసిందే. వీరిలో తొలి విడతలో 4,965 మందికి సివిల్ కానిస్టేబుల్ శిక్షణ ప్రారంభించనున్నారు. శిక్షణ ప్రారంభానికి సంబంధించి పోలీస్ ట్రైనింగ్ కళాశాలలకు సమాచారాన్ని పంపారు. ఇండోర్, ఔట్‌డోర్‌లో కనీస మౌలిక వసతుల కల్పన కూడా అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ఈనెల 15 నుంచి కానిస్టేబుల్ శిక్షణకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు తెలిసింది.

వైద్యారోగ్యశాఖలో డిప్యుటేషన్లు రద్దు

- తక్షణమే ఒరిజినల్ పోస్టింగుల్లో చేరాలని ఆదేశాలు
- డాక్టర్లు, నర్సులు, ప్రొఫెసర్లు, సిబ్బంది ఆందోళన
- విద్యా సంవత్సరం మధ్యలో ఎలా చేస్తారన్న ప్రశ్నలు
- 'ప్రభుత్వ ఆమోదంతో అవసరాల మేరకు డిప్యుటేషన్లు ఇవ్వొచ్చని' మెలిక
- దీంతో మళ్లీ పైరవీలు మొదలవుతాయని సందేహాలు



సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖలోని అన్ని డిప్యుటేషన్లను రద్దు చేశారు. తక్షణమే రద్దు ఆదేశాలు అమలులోకి వచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. డిప్యుటేషన్లలో ఉన్న డాక్టర్లు, నర్సులు, ఇతర ఉద్యోగులు వెంటనే తమ ఒరిజినల్ పోస్టింగుల్లో చేరాలని హుకుం జారీ చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ ఎ.ఎస్.క్రిస్టినా చోంగ్తు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) పరిధిలోని వైద్య సిబ్బంది తక్షణమే రిలీవ్ అయి బుధవారం సాయంత్రమే అసలు పోస్టింగ్ స్థలంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. వివిధ మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్ కేడర్‌లో ఉన్న డాక్టర్లను రిలీవ్ చేయాలని సంబంధిత అధికారులకు డీఎంఈ డాక్టర్ త్రివేణి మెమో జారీ చేశారు. ఇక ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని వైద్య సిబ్బంది గురువారం సాయంత్రానికి తమ ఒరిజినల్ పోస్టింగ్‌లలో చేరాలని ప్రజారోగ్య సంచాలకులు ఆదేశించారు. డిప్యుటేషన్లు లేదా వర్క్ ఆర్డర్లు రద్దయిన ఉద్యోగుల జాబితాను సంబంధిత విభాగాల అధిపతులు గురువారం సాయంత్రానికి సమర్పించాలని స్పష్టం చేశారు. తమ విభాగాల్లో డిప్యుటేషన్లలో ఎవరూ లేరన్న ధ్రువీకరణ పత్రాన్ని కూడా పంపాలని కోరారు.

'అవసరాల మేరకు డిప్యుటేషన్లు అంటూ' పైరవీలకు రంగం సిద్ధం...

జిల్లా కలెక్టర్లు లేదా ప్రభుత్వం నుంచి రాతపూర్వక ఆమోదంతో అవసరాల మేరకు ఆయా శాఖల అధిపతులు డిప్యుటేషన్లు జారీ చేస్తారని వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఒకవైపు డిప్యుటేషన్లను రద్దు చేస్తూనే ఈ మెలిక పెట్టడంలో ఆంతర్యమేంటన్న ప్రశ్న తలెత్తుతోంది. మళ్లీ డిప్యుటేషన్లు తీసుకోవడానికే ఈ మెలిక అన్న చర్చ జరుగుతోంది.

2 వేల మందికిపైగా డిప్యుటేషన్లలోనే..

ఒక అంచనా ప్రకారం వైద్య,ఆరోగ్యశాఖలో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో దాదాపు 2 వేల మందికి పైగా డిప్యుటేషన్లలో ఉంటారని తెలుస్తోంది. ఇప్పుడు వీటన్నింటినీ రద్దు చేయడం వెనుక కుట్ర ఉందన్న విమర్శలు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన డిప్యుటేషన్లను రద్దు చేసి, కొత్తగా ఇవ్వడం ద్వారా పైరవీలకు తెరలేపాలన్నదే కొందరు అధికారుల ఉద్దేశమన్న విమర్శలున్నాయి. ఆ మేరకు ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇచ్చారన్న చర్చ కూడా జరుగుతోంది.

సొమ్ములు చేతులు మారేందుకేనా

అవసరాల మేరకు ప్రభుత్వ రాతపూర్వక అనుమతితో డిప్యుటేషన్లు ఇవ్వొచ్చన్న నిబంధన పెద్ద ఎత్తున దుర్వినియోగం కానుందని అంటున్నారు. సాధారణ సిబ్బంది డిప్యుటేషన్లకు రూ.లక్ష, స్టాఫ్ నర్సులకు రూ.లక్షన్నర, డాక్టర్లకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు డిమాండ్ ఉంటుంది. అలా పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారేందుకే అన్ని డిప్యుటేషన్లను రద్దు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరాల మేరకు తీసుకోవచ్చని ఉత్తర్వులో చెప్పాల్సిన అవసరమేంటి? ఒకవేళ అవసరాలున్నచోట ఇప్పటికే ఉన్నవారిని తొలగించి వెనక్కు పంపించాల్సిన అవసరమేంటన్న వాదన కూడా వినిపిస్తోంది.

ఆ 18 మంది డీఎంహెచ్‌వోల మాటేమిటి

కాగా, డిప్యుటేషన్‌పై ఉన్న దాదాపు 18 మంది జిల్లా వైద్యాధికారులను (డీఎంహెచ్‌వో) వెనక్కు పంపించాలన్న ఆదేశాలు వెలువడలేదని ఒక అధికారి వెల్లడించారు. దీనికి కారణాలు ఏంటో అంతుబట్టడంలేదన్న వాదనలున్నాయి.

ఉద్యోగులు... సంఘాల అభ్యంతరం

ఒక్కరోజు కూడా సమయం ఇవ్వకుండా డిప్యుటేషన్లు రద్దు చేయడంతో ఒక్కసారిగా డాక్టర్లు, నర్సులు, ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. వివిధ ఉద్యోగ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. విద్యా సంవత్సరం మధ్యలో ఉండటం, పదో తరగతి, ఇంటర్, ఎంసెట్ వంటి పరీక్షలు ఉన్న నేపథ్యంలో డిప్యుటేషన్లు రద్దు చేయడం వల్ల గందరగోళం నెలకొంటుందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. తక్షణమే అమలు చేయడం వల్ల వివిధ ప్రాంతాలకు వెళ్లడం, అక్కడ ఏర్పాట్లు చేసుకోవడం కష్టమవుతుందని అంటున్నారు. ప్రభుత్వం తన ఆదేశాలను వచ్చే జూన్ వరకు నిలిపివేయాలని కోరుతున్నారు. కొంతమంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, స్పౌజ్ గ్రౌండ్లలో ఉన్న వారికి కూడా అవకాశం ఇవ్వకుండా డిప్యుటేషన్లు రద్దు చేయడం సమంజసం కాదంటున్నారు. విద్యా సంవత్సరం పూర్తయ్యేవరకు సమయం ఇవ్వాలని, సాధారణ బదిలీలను చేపట్టాలని కోరుతున్నారు.





ఆ గుడి దీపస్తంభమే నాటి లైట్‌హౌస్?

కృష్ణానదీ తీరంలోని ముదిమాణిక్యంలో ఆసక్తికర ఆధారాలు వెలుగులోకి

సాక్షి, హైదరాబాద్: అదో చిన్న శివాలయం.. కానీ దాని ముందు 20 అడుగుల ఎత్తు ఉన్న దీప స్తంభం ఉంది. అది దేవాలయం ముందు అరుదుగా ఉండే సాధారణ దీపస్తంభం మాత్రమే కాదని, పక్కనే ఉన్న కృష్ణానదిలో ఒకప్పుడు సాగిన నౌకాయానానికి ఉపయోగపడిన లైట్‌హౌస్ కూడా అయ్యి ఉంటుందన్నదే ఆ ఆసక్తికి కారణం. 389 సంవత్సరాల క్రితం కృష్ణానదీ తీరంలో ఈ స్తంభం ఏర్పాటు చేశారు. ప్రస్తుత నల్లగొండ జిల్లా ముదిమాణిక్యంలో పబ్లిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హిస్టరీ, ఆర్కియాలజీ అండ్ హెరిటేజ్ (ప్రిహ) తాజాగా దీని వివరాలు వెలుగులోకి తెచ్చింది. శతాబ్దాలపాటు వాణిజ్యానికి కృష్ణానది రవాణా సాధనంగా వినియోగించారు. నదీ తీరంలో అలనాటి జాడలను పలుప్రాంతాల్లో పరిశోధకులు గుర్తించారు. ఓడరేవుల జాడలను వెలుగులోకి తెచ్చారు. చీకటి వేళ సాగే నౌకలకు రేవుల జాడలు తెలిపేందుకు దీపపు స్తంభాలు ఉపయోగపడతాయి. ముదిమాణిక్యం ప్రాంతం కూడా ఒకప్పుడు ప్రధాన వాణిజ్యకేంద్రంగా భాసిల్లిందన్న ఆధారాలున్నాయి. ఈక్రమంలో ఇప్పుడు చిన్న దేవాలయం ముందు వెలుగు చూసిన దీపపు స్తంభం శతాబ్దాల క్రితం నౌకలకు లైట్‌హౌస్‌గా కూడా ఉపయోగపడి ఉంటుందన్న అంశం కొత్త పరిశోధనలకు ఊతమిస్తోంది. 'ప్రిహ'సభ్యుడు అశోక్‌కుమార్‌తో కలిసి దీనిని వెలుగులోకి తెచ్చినట్టు ప్రిహ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ఏ.శ్రీనివాసన్ పేర్కొన్నారు. ''దేవాలయాల ముందు ధ్వజస్తంభాలుంటా యని కాని, దీప స్తంభాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. చాలా చిన్నగా ఉన్న శివాలయం ముందు 20 అడుగుల ఎత్తుతో ఈ దీప స్తంభం ఉండటం మరింత ప్రత్యేకంగా ఉంది. ఈ ఆలయం కృష్ణానది ఒడ్డుపై ఉంది. అది ఓడ రవాణా మార్గంగా కొనసాగినందున అది నౌకలకు దారి చూపే లైట్‌హౌస్‌గా కూడా ఉపయోగించి ఉంటారు. దానిపై తమిళ భాష పదాలు కలగలిసిన తెలుగులో శాసనం చెక్కి ఉంది. 1635 జూన్ 1 సోమవారం రోజు ఈ శాసనం వేయించినట్టు ఉంది. కాశీ విశ్వనాథ మందిరానికి దీప స్తంభంగా దీనిని వాలి మునులయ్య కుమారుడు పోలినేడు ఏర్పాటు చేయించారని, దానిపై శాసనాన్ని ఇడుపులపాటికి చెందిన మాదిరాజు నరసయ్య వేయించారని అందులో ఉంది.'అని ఆయన పేర్కొన్నారు.

త్వరలో వైద్య ఆరోగ్య శాఖలో 2,500 ఉద్యోగాల భర్తీ

మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి



హుజూర్‌నగర్: వైద్య ఆరోగ్యశాఖలో నర్సులు, డాక్టర్లు, వివిధ రకాల సిబ్బంది కలిపి సుమారు 10 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, త్వరలో 2,500 ఖాళీలను భర్తీ చేస్తామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖమంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులతో కలిసి సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఏరియా హాస్పిటల్‌ను రాజనర్సింహ సందర్శించారు. వార్డులను తిరిగి పరిశీలించి రోగులతో మాట్లాడారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2,500 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలిపారు. దశలవారీగా మిగతా వాటిని కూడా భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వం జాబ్ కేలండర్‌ను అమలు చేసేందుకు కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని రాజనర్సింహ తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద 1,800 వ్యాధులకు రూ.487 కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, హెల్త్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టీనా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జిల్లా కలెక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి మరికొన్ని 'సెట్స్'

ఇప్పటికే రెండు ప్రవేశ పరీక్షల తేదీల ఖరారు
లాసెట్, ఎడ్‌సెట్, ఈసెట్, ఐసెట్‌పై స్పష్టత

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 9, 10 తేదీల్లో మరికొన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షల తేదీలు వెల్లడించేందుకు ఉన్నత విద్యా మండలి సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రవేశ పరీక్షల కన్వీనర్‌తో మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి సంప్రదింపులు జరిపారు. పరీక్ష తేదీలపై ఇప్పటికే సూత్రప్రాయమైన నిర్ణయం జరిగింది. ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించిన టీఎస్‌ఈఏపీ సెట్, పోస్టు-గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి టీఎస్ పీజీ సెట్ తేదీలను ప్రకటించారు. లాసెట్, ఎడ్‌సెట్, ఐసెట్, ఈసెట్ తేదీలను ప్రక టించాల్సి ఉంది. పరీక్ష తేదీలపై స్పష్టత కోసం ఇంతకాలం అధికారులు కసరత్తు చేశారు. ఇది ఓ కొలిక్కి రావడంతో తేదీల ప్రకటనకు ముహూర్తం ఖరారు చేసినట్టు మండలి వర్గాలు తెలిపాయి. ఇది పూర్తయిన తర్వాత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్, పరీక్ష నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టే వీలుంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.